
'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 175

గురువారం 15-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వినేశ్ కంచుపట్టు

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన భారత మహిళా రెజ్లర్ - 14లో



అమెరికా ద్రవ్యోల్బణం దెబ్బ

224 పాయింట్లు పతనమైన సెన్సెక్స్. నిఫ్టీ నష్టం 66 పాయింట్లు - 15లో



కొందరి చేతుల్లోనే అధికారం

8 ఏళ్లుగా అధికారం మొత్తం కొందరు రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తల చేతుల్లోనే చిక్కుకుందని కాంగ్రెస్ నేత సోనియా అన్నారు.

వివరాలు 6లో



రాణి అంత్యక్రియలకు రాష్ట్రపతి

బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 అంత్యక్రియలకు రాష్ట్రపతి ముర్ము హాజరవనున్నారు. 17వ తేదీ నుంచి 19 దాకా ఆమె బ్రిటన్‌లో పర్యటిస్తారు.

వివరాలు 6లో



431 కిలోల బంగారం, వెండి

రక్ష బులియన్ అండ్ క్లాసిక్ మార్బుల్స్ సంస్థ ఆఫీసుల్లో ఈడీ చేసిన సోదాల్లో 431 కిలోల బంగారు, వెండి కడ్డీలు బయటపడ్డాయి.

వివరాలు 6లో



లోయలో పడిన బస్సు

జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్‌లో బస్సు లోయలో పడిపోవడంతో 11 మంది మరణించారు. 29 మందికి గాయాలయ్యాయి.

వివరాలు 6లో

వికేంద్రీకరణే..!

అసెంబ్లీ వేదికగా నేడు అధికార పక్షం చర్చ

- గ్రామ, వార్డు సచివాలయాలతో ప్రజల ముంగిటకే పాలన
- 26 జిల్లాల ఏర్పాటు.. ప్రతి అడుగులోనూ పారదర్శకత
- మూడు రాజధానులతో రాష్ట్ర సమగ్రాభివృద్ధి.. దేశం ఏపీ వైపు చూసేలా విప్లవాత్మక సంస్కరణలు
- అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు
- రైతన్నలను చేయి పట్టుకుని నడిపిస్తున్న ఆర్బీకేలు.. కొత్త పుంతలు తొక్కుతున్న విద్యా రంగం
- 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు
- సరికొత్త మార్పులతో ఆరోగ్యశ్రీ
- ఆస్పత్రుల్లోనూ నాడు–నేడు.. కొత్త మెడికల్ కాలేజీలు
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్
- చేసిన మేలును వివరిస్తూ 'గడప గడపకు మన ప్రభుత్వం'



సాక్షి, అమరావతి: మూడేళ్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రజాభ్యుదయమే లక్ష్యంగా తీసుకొచ్చిన పాలన సంస్కరణలు, వికేంద్రీకరణ దిశగా వేసిన అడుగుల గురించి నేడు అసెంబ్లీ వేదికగా చర్చించనుంది. వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానులతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని పునరుద్ఘాటించనుంది. సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని, అన్ని ప్రాంతాల అభివృద్ధిని కాంక్షిస్తూ తీసుకున్న నిర్ణయాలను, రాబోయే కాలంలో చేయనున్న మేలును, ప్రతిపక్షం తీరును మరోమారు ప్రజల దృష్టికి తీసుకెళ్లనుంది. కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా

మిగతా 10వ పేజీలో ▶

రచ్చే.. చర్చ వద్దు

- ఎమ్మెల్యేలకు చంద్రబాబు దిశా నిర్దేశం.. ఎలా గొడవ చేయాలనే విషయంపై రోజంతా మంతనాలు
- రాజధాని అంశంపైనే రగడ చేయాలని నిర్ణయం 12లో
- 15 రోజులు సభ జరపాల్సిందిగా పట్టుబట్టాలని బాబు సూచన
- తాను సభకు రానని వెల్లడి

న్యూస్‌రీల్

మాజీ ఎంపీ కొత్తపల్లి గీత అరెస్టు



తప్పుడు పత్రాలతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.42.79 కోట్లు తీసుకొని మోసం చేసిన కేసులో మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు కొత్తపల్లి గీత, ఆమె భర్త రామకోటేశ్వరరావును సీబీఐ అధికారులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. వీరిద్దరికీ సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించింది.

వివరాలు 10లో ▸

నేటి నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు



పంచాయతీరాజ్ శాఖ గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో 16 రోజులపాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతోంది. ఈ సందర్భంగా ప్రజలు చెప్పే అభిప్రాయాలతో గ్రామ పరిశుభ్రత ప్రణాళికను రూపొందిస్తారు. అక్టోబర్ 2న ఈ ప్రణాళికకు ఆమోదం తీసుకుంటారు.

వివరాలు 10లో ▸

గుట్కాపై 'సెబ్' అస్త్రం



అక్రమంగా సాగుతున్న గుట్కా దందాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. గుట్కా రాకెట్ ఆటకట్టించేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు ప్రత్యేక అధికారాలిస్తూ త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. సాంకేతిక కారణాలతో నిందితులు తప్పించుకోకుండా జాగ్రత్తలు తీసుకోనుంది.

వివరాలు 16లో ▸



కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న గోవా సీఎం ప్రమోద్, బీజేపీ గోవా అధ్యక్షుడు సదానంద్

గోవా కాంగ్రెస్‌కు భారీ షాక్

- 8 మంది ఎమ్మెల్యేలు బీజేపీలోకి జంప్
- బీజేపీవి దిగజారుడు రాజకీయాలంటూ కాంగ్రెస్ నేతల మండిపాటు

పనాజీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా పాదయాత్ర నిర్వహిస్తూ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్న వేళ గోవాలో ఆ పార్టీకి గట్టి షాక్ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి దిగంబర్ కామత్ సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు హ్యాండిచ్చి కమలం గూటికి చేరారు. సీఎం ప్రమోద్ సావంత్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సదానంద శేట్ తనవాడె సమక్షంలో బుధవారం ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ కండువా కప్పుకున్నారు. దీంతో మొత్తం 40 అసెంబ్లీ స్థానాలున్న గోవాలో

మిగతా 3వ పేజీలో ▶

అసెంబ్లీ బలాబలాలు ఇలా

- 40 అసెంబ్లీ సీట్లున్న రాష్ట్రంలో బీజేపీకి సొంతంగా 20 మంది సభ్యులున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది చేరడంతో ఆ పార్టీ బలం 28కి చేరింది.
- బీజేపీ ప్రభుత్వానికి ఇద్దరు సభ్యులున్న మహారాష్ట్రవాడి గోమంతక్ పార్టీ (ఎంజీపీ) , ముగ్గురు స్వతంత్ర సభ్యులు మద్దతు ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వ బలం 33కి పెరిగింది.
- కాంగ్రెస్ 11 మంది ఎమ్మెల్యేలలో ఎనిమిది మంది పార్టీ ఫిరాయించడంతో ముగ్గురు మాత్రమే మిగిలారు. కాంగ్రెస్ మిత్రపక్షమైన గోవా ఫార్వార్డ్ పార్టీకి ఒక్క సభ్యుడు ఉన్నారు.
- ఆప్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు, రివల్యూషనరీ గోన్స్ పార్టీకి ఒక్కరు ఉన్నారు.

గోవాలో అంతే 6లో ఫిరాయింపుల సంస్కృతికి కేరాఫ్ అడ్రస్

వరద గోదావరి

- ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 13.74 లక్షల క్యూసెక్కుల ప్రవాహం 12లో
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- 13.66 లక్షల క్యూసెక్కులు కడలిలోకి
- బేసిన్‌లో వర్షాలు తగ్గడంతో ఎగువన తగ్గుతున్న వరద



మీడియాతో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నేతలు

అమరావతి యాత్రను ఎలా అడ్డుకుంటారో చూస్తాం

- ఉత్తరాంధ్రలో అడుగడుగునా స్వాగతం పలుకుతాం 5లో
- టీడీపీ నేతలు అయ్యన్న, బండారు సత్యనారాయణ మూర్తి, బుద్దా వెంకన్న

అమరావతి రైతుల పాదయాత్రను అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు చెబుతున్నారు. వారు ఎలా అడ్డుకుంటారో చూస్తాం. రైతుల పాదయాత్రకు మా పూర్తి మద్దతు ఇస్తున్నాం. అమరావతిలో రాజధాని ఏర్పాటు చేయాలని ఉత్తరాంధ్రలో అడుగడుగునా స్వాగతం పలుకుతాం. అమరావతి యాత్రపై మాట్లాడితే కేసులు పెడతారా?

- టీడీపీ నేతలు అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, బుద్దా వెంకన్న



పాదయాత్రలో పెత్తందారులే

ఐదేళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు అమరావతి పేరుతో వ్యాపారం చేశారు. ఇప్పుడు పాదయాత్రలో కూడా చంద్రబాబు మాదిరిగా రైతుల్ని పీడించిన పెత్తందారులే ఉన్నారు. వారిది త్యాగం కాదు.. లాభాపేక్ష. చంద్రబాబు వల్ల ప్రజలకు జరిగిన అన్యాయాన్ని.. సీఎం జగన్ సరిదిద్దుతున్నారు. - మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ

11లో

బెంజ్ కార్లు.. బౌన్సర్లు!



రోలెక్స్ వాచ్‌లు, బెంజ్ కార్లు, బౌన్సర్లతో చంద్రబాబు బృందం సాగిస్తున్న పాదయాత్రను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. చంద్రబాబు నేతృత్వంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఈ యాత్ర చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా జరిగిన అభివృద్ధితో ఏపీ తీవ్రంగా నష్టపోయింది. మళ్లీ అలాంటి పరిస్థితి రాకూడదనే సీఎం జగన్ మూడు ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

రైతుల ముసుగులో రాజకీయ యాత్ర




రాజధాని రైతుల పేరుతో టీడీపీ రాజకీయ యాత్ర నిర్వహిస్తోంది. టీడీపీ నేతలు అసలు పాదయాత్ర ఎందుకు చేస్తున్నారు? ఉత్తరాంధ్ర, రాయలసీమకు వ్యతిరేకంగానే కదా? పేదలు, బలహీన వర్గాలకు చోటు లేని రాజధాని ఎందుకు? అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

భూ ఆక్రమణలపై

కన్నెర్ర!

పంచాయతీ భూముల్లో నుంచి ఆరు నెలల్లో ఖాళీ చేయించాలి



- మునిసిపల్, అటవీ భూముల ఆక్రమణదారులను 2 నెలల్లో గుర్తించాలి
- వారిని ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలి
- ఆ భూములు తిరిగి కబ్జాకు గురి కాకుండా గట్టి చర్యలు చేపట్టాలి
- ఖాళీ చేయించే ముందు నోటీసిచ్చి వారి వాదనలు వినాలి
- హైకోర్టు సీజే నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులు

- వివరాలు 11లో

ఆర్టీసీలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం

సాక్షి, అమరావతి: డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందించేందుకు ప్రజా రవాణా విభాగం (ఆర్టీసీ) నిర్ణయించింది. స్టైఫండ్ లేకుండా ఇంటర్న్‌షిప్ చేసేందుకు విద్యార్థులను అనుమతించాలని ఆర్టీసీ డిపో మేనేజర్లను బుధవారం ఆదేశించింది. రెండో ఏడాది విద్యార్థులకు 2 నెలలు, మూడో ఏడాది విద్యార్థులకు 6 నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తారు. అనంతరం విద్యార్థులకు ఆర్టీసీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తుంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పరిధిలోని ఆర్టీసీ డిపో మేనేజర్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

ఆర్టీసీలో ఆన్‌లైన్ చెల్లింపులు



విజయవాడలో డిజిటల్ చెల్లింపుల ద్వారా టికెట్లు అందజేస్తున్న దృశ్యం

సాక్షి విజయవాడ: ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. దూరప్రాంతాలకు ప్రయాణించే వారికోసం అందుబాటులోకి తెచ్చిన ఈ పోస్ యంత్రంలో డిజిటల్ లావాదేవీలు మొదలు పెట్టింది. క్రెడిట్ కార్డు, ఫోన్ పే, స్కాన్ చెల్లింపులు తదితర ఆన్‌లైన్ సేవల ద్వారా ప్రయాణికులకు టికెట్లు అందిస్తోంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పండిట్ నెహ్రూబస్‌స్టేషన్‌లో బుధవారం ప్రయాణికులకు డిజిటల్ చెల్లింపుల ద్వారా టికెట్లు అందజేశారు.

27న విభజన సమస్యలపై సమావేశం

- ఏపీ, తెలంగాణ సీఎస్‌లతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి భేటీ
- వివిధ కేంద్ర శాఖల అధికారులు కూడా హాజరు
- అజెండాలో ఏపీకి పన్ను రాయితీలు
- వెనుకబడిన జిల్లాల అభివృద్ధి గ్రాంటు, రెవెన్యూ లోటు
- ఇరు రాష్ట్రాలకు సంస్థల విభజన, బ్యాంకు బ్యాలెన్స్‌ల పంపిణీ
- విభజన అంశాలపై దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో ఏపీ ప్రస్తావన
- కేంద్ర హోం మంత్రి ఎదుట గట్టిగా వాణిని వినిపించిన రాష్ట్రం



సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై కేంద్ర హోం శాఖలో కదలిక వచ్చింది. రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లు అయినా పలు సమస్యలు అపరిష్కృతంగా ఉండటంపై ఇటీవల జరిగిన దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గట్టిగా తన వాణిని వినిపించింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, విభజన చట్టంలో ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై త్వరగా ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఈ నెల 27న ఢిల్లీలో ఏపీ, తెలంగాణ సీఎస్‌లతో పాటు అయా అంశాలకు చెందిన కేంద్ర మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన జరిగే సమావేశం అజెండాలో ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న విభజన ద్వైపాక్షిక సమస్యలు, విభజన చట్టంలో ఏపీకి ఇచ్చిన పన్ను రాయితీలు, ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఏడు వెనుకబడిన జిల్లాల అభివృద్ధి గ్రాంటు, రెవెన్యూ లోటు భర్తీ తదితర అంశాలున్నాయి.

అజెండాలోని అంశాలు ఇవీ..

ద్వైపాక్షిక సమస్యలు

- విభజన చట్టంలోని షెడ్యూల్ 9లో ఉన్న ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్ల విభజన
- షెడ్యూల్ 10లోని రాష్ట్ర సంస్థల విభజన
- విభజన చట్టంలో ప్రస్తావించని సంస్థల విభజన
- ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎఫ్‌సీ) విభజన
- సింగరేణి కాలరీస్, ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ విభజన
- ఉమ్మడి సంస్థల్లోని కేంద్ర ప్రాయోజిత పథకాలకు చెందిన బ్యాంకుల్లోని నగదు నిల్వలు విభజన. విదేశీ ఆర్థిక సంస్థల సాయంతో చేపట్టిన ప్రాజెక్టుల రుణాల విభజన
- బియ్యం సబ్సిడీకి సంబంధించి తెలంగాణ పౌర సరఫరాల సంస్థ నుంచి ఏపీ పౌర సరఫరాల సంస్థకు నగదు క్రెడిట్ విడుదల

ఇతర సమస్యలు

- ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న పారిశ్రామిక పన్ను రాయితీలు
- ఉత్తరాంధ్ర, రాయలసీమలోని వెనుకబడిన ఉమ్మడి ఏడు జిల్లాల అభివృద్ధి గ్రాంటు
- రెవెన్యూ లోటు
- పన్నుల సమస్యలు
- విద్యా సంస్థల ఏర్పాటు
- నూతన రాజధానికి కేంద్ర మద్దతు
- నూతన రాజధానికి ర్యాపిడ్ రైల్ కనెక్టివిటీ

ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు

- జల్ జీవన్ మిషన్ అమలుకు ప్రత్యేక కార్యాచరణ
- యునిసెఫ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో ఎన్జీవోలకు శిక్షణ
- విజయవాడలో ప్రారంభించిన అధికారులు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: గ్రామాల్లోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.వి.కృష్ణారెడ్డి, తాగునీరు– పారిశుధ్యం ప్రాజెక్టు డైరెక్టర్ హరిరామ్ నాయక్ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుతో వంద శాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎన్జీవోలతో కలిసి గ్రామాల్లో మంచినీరు, ఇంటింటికి నీటి కుళాయిల ప్రాధాన్యంపై ప్రచారం చేయనున్నట్టు వివరించారు. ఎంపిక చేసిన ఎన్జీవో ప్రతినిధులకు యునిసెఫ్ ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ తరగతులను బుధవారం విజయవాడలో ప్రారంభించారు. మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన వీరు జిల్లాల వారీగా మరికొందరికి శిక్షణనిచ్చి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపు రూ.25 వేల కోట్ల ఖర్చుతో అన్ని గ్రామాల్లోను ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 95 లక్షల కుళాయిలు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 40 లక్షల కుళాయి కనెక్షన్లు ఇచ్చినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టును 2024 నాటికి పూర్తి చేస్తామన్నారు. దీంతోపాటు మురుగు నీటి నిర్వహణ, నీటి సంరక్షణ, వర్షపు నీరు పునర్వినియోగంపై దృష్టి పెట్టినట్టు వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించే విషయంలో ఎన్జీవోలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని యునిసెఫ్ అందిస్తున్నట్టు తెలిపారు.

గోవా కాంగ్రెస్‌కు భారీ షాక్

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంఖ్య మూడుకి పడిపోయింది. బీజేపీ గూటికి చేరిన వారిలో దిగంబర్ కామత్, మైకేల్ లోబో, ఆయన భార్య డెలిహా లోబో, రాజేశ్ ఫల్‌దేశియా, కేదార్ నాయక్, సంకల్ప్ అమోంకర్, అలెక్సియో సెక్వేరియా, రూడల్ఫ్ ఫెర్నాండెజ్ ఉన్నారు. గోవా నుంచి ''కాంగ్రెస్ ఛోడో, బీజేపీ కో జోడో''' ప్రారంభమైందని ఫిరాయించిన ఎమ్మెల్యే లోబో వ్యాఖ్యానించారు. బుధవారం ఉదయం నుంచే ఎమ్మెల్యేల ఫిరాయింపుపై ప్రచారం మొదలైంది. దిగంబర్ కామత్, లోబో, ఇతర నాయకులు సమావేశంలో బీజేపీలో చేరాలని తీర్మానించారు. అసెంబ్లీకి ఎన్నికయ్యాక ఎమ్మెల్యేలు జారిపోకుండా రాహుల్ గాంధీ వారితో ఆలయం, చర్చి, మసీదుల్లో ప్రమాణాలు కూడా చేయించారు. చేసిన ప్రమాణాలను కూడా మరిచి పార్టీని మోసం చేశారని, ఇదో సిగ్గుమాలిన చర్య అంటూ కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. దీనిపై కామత్‌ను విలేకరులు ప్రశ్నించగా ''బీజేపీలో చేరడానికి ముందు నేను మళ్లీ గుడికి వెళ్లి దేవుడా ఏం చెయ్యమంటావు అని అడిగాను. ఏది ఉత్తమమైన పనో అదే చెయ్యి అని ఆ భగవంతుడు చెప్పాడు''అంటూ వెటకారంగా బదులిచ్చారు. మరోవైపు కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర విజయవంతం కావడంతో బీజేపీకి వణుకు పుడుతోందని అందుకే ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు దిగిందని విమర్శించారు. బీజేపీ చేస్తున్నది ''ఆపరేషన్ కిచడ్ (బురద)''అంటూ ట్వీట్ చేశారు. రెండు నెలల క్రితమే లోబో నేతృత్వంలో ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడానికి ప్రయత్నించడంతో కాంగ్రెస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. వారిపై అనర్హత వేటు వేయాలని కోరింది. అసెంబ్లీలో శాసనసభా పక్ష నాయకుడిగా ఉన్న లోబోను తప్పించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా భారత్ జోడో యాత్ర నిర్వహిస్తున్న సమయంలో ఎమ్మెల్యేలను లాగేసి బీజేపీ గట్టి దెబ్బ కొట్టింది.

52 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

వెంకటాచలం: అక్రమంగా రెండు లారీల్లో తరలిస్తోన్న రూ.19.24 లక్షల విలువైన 52 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం రామదాసుసత్రం వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..మంగళవారం రాత్రి విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడి సిబ్బందితో కలిసి వెంకటాచలం టోల్‌ప్లాజా నుంచి రామదాసు సత్రం వరకు జాతీయ రహదారిలో తనిఖీలు చేపట్టారు. ఒక్కొక్క లారీలో 26 టన్నుల వంతున రెండు లారీల్లో 52 టన్నులు పీడీఎస్ బియ్యం బస్తాలను గుర్తించారు. బిల్లులు చూపాలని లారీ డ్రైవర్లను అధికారులు ప్రశ్నించారు. ఒక లారీ కోనసీమ జిల్లా మండపేట మండలం ఆర్తమూరులోని ఎస్‌వీవీఎస్ రైస్‌మిల్లు నుంచి, మరో లారీ మాచవరంలోని లక్ష్మీగణపతి ట్రేడర్స్ నుంచి చెన్నైకు చెందిన రాక్షి ఏజెన్సీస్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా పీడీఎస్ రవాణా చేసిన రవాణాదారులతో పాటు, చెన్నైకు చెందిన రాక్షి ఏజెన్సీస్ నిర్వాహకులపైనా, లారీడ్రైవర్లపైనా కేసులు నమోదు చేసి లారీలను వెంకటాచలం పోలీసులకు అప్పగించారు.

శోభనం గదిలో వరుడి మృతి

- భజంత్రీలు మోగిన ఇంట చావు బాజాలు
- అన్నమయ్య జిల్లాలో విషాదం



తులసీప్రసాద్ ఫైల్

మదనపల్లె టౌన్ : శోభనం గదిలో పెళ్లికుమారుడి మృతి కలకలం రేపింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. తిరుపతి జిల్లా దామలచెరువు ఊట్లవారిపల్లెకు చెందిన గుర్రప్పనాయుడు, వితలమ్మ దంపతుల కుమారుడు తులసీప్రసాద్(26). గుర్రప్పనాయుడు వేరొకరిని పెళ్లి చేసుకోవడంతో వితలమ్మ మదనపల్లె పట్టణంలో నివాసముంటోంది. తులసీప్రసాద్ గతంలో పాకాల సమీపంలోని ఓ ప్రయివేట్ ఫ్యాక్టరీలో పని చేసేవాడు. మొదటి భార్యతో విడిపోయి హైదరాబాద్‌కు వెళ్లి పోయాడు. అక్కడ ఓ కంపెనీలో పనిచేస్తుండగా.. అక్కడే శిరీష పరిచయమైంది. అది కాస్త ప్రేమగా మారింది. సోమవారం వరుడి ఇంట్లో పెద్దలు పెళ్లి చేశారు. బంధువులు మంగళవారం రాత్రి ఇద్దరికి శోభన ఏర్పాట్లు చేశారు. రాత్రి 11 గంటల వరకు బంధువులతో కలసి వధూవరులు డ్యాన్సులు చేశారు. 11.30 గంటలకు శోభనం గదిలోకి వెళ్లారు. సుమారు ఒంటి గంట ప్రాంతంలో శోభనం గది లోంచి కోడలు పెద్దగా వితలమ్మను పిలిచింది. వితలమ్మ గదిలోకి వెళ్లి చూడగా కుమారుడు అచేతనంగా పడి ఉన్నాడు. వెంటనే ఆటోలో స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తులసీప్రసాద్ చనిపోయి రెండు గంటలైందని వైద్యులు చెప్పారు. గుండెపోటు వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.



కాకినాడ జిల్లా భోగాపురంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



కృష్ణా జిల్లా అడ్డాడలో ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి.

ఇంటింటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్ద ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరువేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



నిన్ను నువ్వు అర్థం చేసుకోకుండా,
ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం వల్ల
ఉపయోగం ఏమిటి?
– రమణ మహర్షి

సాక్షి

గురువారం, సెప్టెంబర్, 15

ర్యాంకులు పోనాయండీ!

ప్రపంచవ్యాప్తంగా ఇది ఆందోళనకర అంశం, తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన విషయం. ఐరాస లెక్క ప్రకారం వరుసగా రెండో ఏడాదీ పలు దేశాల 'మానవాభివృద్ధి సూచిక' (హెచ్డీఐ) స్కోరు కిందకు పడింది. మన దేశపు ర్యాంకు మునుపటితో పోలిస్తే రెండు స్థానాలు కిందకు పడింది. ఐరాస అభివృద్ధి సంస్థ (యూఎన్డీపీ) 2021–22 మానవాభివృద్ధి నివేదిక (హెచ్డీఆర్) 'అనిశ్చిత పరిస్థితులు, అస్థిర జీవితాలు – మారుతున్న ప్రపంచంలో భవిష్యత్ రూప కల్పన' ఈ చేదునిజాన్ని బయటపెట్టింది. తొంభై శాతానికి పైగా దేశాలు 2020లో కానీ, 2021లో కానీ హెచ్డీఐ స్కోరులో వెనకబడ్డాయి. నలభై శాతానికి పైగా దేశాలైతే ఆ రెండేళ్ళూ ర్యాంకుల్లో కిందికి వచ్చేశాయి.

గత వారం విడుదలైన ఈ నివేదిక ప్రకారం మానవాభివృద్ధిలో మొత్తం 191 దేశాల్లో మన దేశం రెండు స్థానాలు కిందకొచ్చి, 132వ ర్యాంకుకు చేరింది. గడచిన 32 ఏళ్ళలో ఇలా వరుసగా రెండేళ్ళు సూచికలో దిగజారడం ఇదే తొలిసారి. మానవాభివృద్ధి పరామితుల ప్రకారం బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంకల కన్నా మనం వెనకబడే ఉన్నాం. దేశం సుభిక్షంగా ఉంది, స్థూల జాతీయోత్పత్తిలో బ్రిటన్‌ను దాటేశాం లాంటి కబుర్లతో కాలక్షేపం చేస్తున్న వారికి ఇది కనువిప్పు. హెచ్డీఐలో వివిధ దేశాల ర్యాంకులు పడిపోవడానికి కనివిని ఎరుగని సంక్షోభాలు కారణం. గత పదేళ్ళలో ఆర్థికపతనాలు, వాతావరణ సంక్షోభాలు, కరోనా, యుద్ధం లాంటి గడ్డు సమస్యల్ని ప్రపంచం ఎదుర్కొంది. ప్రతి సంక్షోభం ప్రపంచాభివృద్ధిపై ప్రభావం చూపింది. అయితే, అందులో కరోనాది అతి పెద్ద పాత్ర అని ఐరాస నివేదిక సారాంశం. ప్రపంచాన్ని వణికించిన ఈ మహమ్మారితో మానవ పురోగతి కనీసం అయిదేళ్ళు వెనక్కి వెళ్ళింది. అంతటా అనిశ్చితి ప్రబలింది.

హెచ్డీఐకి లెక్కలోకి తీసుకుంటున్న అంశాల్లో లోపాలున్నాయని కొన్ని విమర్శలు లేకపోలేదు. అయితే, మరే సూచికా లేని వేళ ప్రతి దేశపు సగటు విజయాన్నీ లెక్కించడానికి ఉన్నంతలో ఇదే మెరుగైనదని ఒప్పుకోక తప్పదు. ఆర్థిక అసమానత్వం, లైంగిక అసమానత్వం, బహుముఖ దారిద్ర్యం లాంటి ఆరు వేర్వేరు మానవాభివృద్ధి సూచీల ద్వారా ఈ ర్యాంకులు లెక్కకట్టారు. స్విట్జర్లాండ్ 0.962 స్కోరుతో ప్రథమ ర్యాంకు దక్కించుకుంది. భారత్ కేవలం 0.633 స్కోరుతో అగ్రశ్రేణికి సుదూరంగా నిలిచిపోయింది. విషాదమేమిటంటే, మానవాభివృద్ధిలో మన స్కోరు ప్రపంచ సగటు 0.732 కన్నా తక్కువ. పొరుగున ఉన్న చైనా హెచ్డీఐ స్కోర్ 1990 నుంచి ఏటా పెరుగుతుంటే, మన పరిస్థితి తద్భిన్నంగా ఉంది. మన దేశంలో ఆర్థిక అసమానతలూ ఎక్కువే. జనాభాలో అతి సంపన్నులైన 1 శాతం మంది ఆదాయ వాటా, నిరుపేదలైన 40 శాతం మంది వాటా కన్నా ఎక్కువని తాజా లెక్క. ఇంతటి అసమానత చైనా, స్విట్జర్లాండ్‌లలో లేదు.

లింగపరంగా చూస్తే, మన దేశ తలసరి ఆదాయంలో పురుషుల కన్నా స్త్రీలు చాలా వెనుకబడి ఉన్నారు. విద్య, వైద్యం, జీవన ప్రమాణాల ప్రాతిపదికన లెక్కకట్టే బహుముఖ దారిద్ర్యం లోనూ భారత్ పరిస్థితి గొప్పగా ఏమీ లేదు. 2019 నాటి యూఎన్డీపీ అంచనాల ప్రకారం... ప్రపంచంలో అత్యధిక జనాభా గల చైనాలో 5.4 కోట్ల మంది బహుముఖ దారిద్ర్యంలో ఉంటే, రెండో అత్యధిక జనాభా ఉన్న భారత్‌లో ఆ సంఖ్య 38.1 కోట్ల పైచిలుకే. అయితే, 2019 – 2020 మధ్య మన దేశంలో లింగ అసమానత దారుణంగా పెరగగా, తాజా నివేదికలో ఆ కోణంలో కొద్దిగా మెరుగుదల సాధించడం ఉపశమనం. మొత్తానికి, అన్నీ కలిపి చూస్తే మానవాభివృద్ధిలో మన స్కోరునూ, దరిమిలా ఇతర దేశాల మధ్య మన ర్యాంకునూ కిందకు గుంజాయి.

అయితే, సంతోషించదగ్గ అంశం ఏమంటే – కరోనాలో ఏడాది లోపలే భారత్ టీకాను అభివృద్ధి చేయడం, ధనిక దేశాలకు సైతం కరోనా నిరోధానికి సహకరించడం! ఇది మన మానవ సామర్థ్యమే! అదే సమయంలో కనీస ఆదాయ హామీకై దేశంలో జరుగుతున్న ప్రయత్నాలూ యూఎన్డీపీ ప్రశంసలు అందుకున్నాయి. అలాగే కరోనా అనంతరం ఆర్థికంగా మన దేశపు పనితీరు పొరుగు దేశాల కన్నా మెరుగ్గా ఉండడం ఆశాకిరణం. అభివృద్ధి అజెండా అమలుకు నిధులు వెచ్చించే వీలుంటుంది. అయినా, ఇప్పటికీ అనేక అంశాల్లో ఇతర దేశాలు మెరుగ్గా ఉన్నాయనేది నిష్ఠురసత్యం. పౌష్టికలోప జనాభా, బాలల మరణాల రేటు తదితర అంశాలతో లెక్కించే 'ప్రపంచ ఆకలి సూచి' (2020) ప్రకారం కూడా 107 దేశాల్లో మనది 94వ స్థానం.

వీటికి తోడు ఇప్పుడు ఉక్రెయిన్‌లో యుద్ధం, ప్రపంచాన్ని పూర్తిగా వదిలిపోని కరోనా, భూతాపోన్నతి ముప్పేటదాడి చేస్తున్నాయి. అన్నీ కలసి ప్రపంచ ఆహార సంక్షోభానికి దారి తీయవచ్చని ఐరాస హెచ్చరిస్తోంది. నిలకడైన అభివృద్ధి, సామాజిక భద్రత, సత్వర సాంకేతిక ఆవిష్కరణలపై దృష్టి పెడితేనే అనిశ్చితి నుంచి బయటపడగలమంటోంది. ఐరాస మాట చద్దిమూట. పాలకులు దీన్ని పరిగణనలోకి తీసుకొని, పకడ్బందీగా మానవాభివృద్ధి ప్రణాళికలు రచించాలి. పర్యావరణ సంక్షోభ నివారణ లక్ష్యాలను చేరుకొనేందుకూ కృషి చేయాలి. ద్రవ్యోల్బణం, ధరలు పెరుగుతూ, ఉపాధి హామీ తగ్గుతున్న సమయంలో ఎన్నికల వ్యూహాలు కాస్త ఆపి, నిలకడగా చేతల్లోకి దిగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతరాలు తగ్గించుకొని, సమన్వయంతో సాగాలి. కానీ, పైచేయి కోసం ప్రయత్నాలతో ఢిల్లీ నుంచి గల్లీ దాకా సహకార స్ఫూర్తి కొరవడుతున్న వేళ ప్రగతి బాటలో కలసి సాగడానికి మన పాలకులు సిద్ధమేనా?


గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.పంచమి ప.12.36 వరకు తదుపరి షష్ఠి **నక్షత్రం:** భరణి ఉ.10.44 వరకు, తదుపరి కృత్తిక **వర్జ్యం:** రా.11.26 నుండి 1.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.46 నుండి 3.34 వరకు **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం: 6.02
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

టీ కప్పులో దౌత్యపు తుపాను

సందర్భం



కె. నట్వర్ సింగ్

దౌత్య రంగంలో చిన్న ఘటన కూడా ఎంత సంక్షోభానికి దారితీయగలదో రుజువు చేసే ఘట్టమిది. కామన్వెల్త్ ప్రభుత్వాధినేతల సదస్సు 1983లో ఢిల్లీలో జరిగింది. ఆ సందర్భంలోనే మదర్ థెరెసాకు 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను రాష్ట్రపతి భవన్‌లో అందించాలని బ్రిటిష్ రాణి రెండో ఎలిజబెత్ కార్యక్రమం 'నిర్ణయమైంది'. ఈ విషయంలో ప్రధాని ఇందిరాగాంధీ సంతోషంగా లేరు. భారత రాష్ట్రపతి తప్ప మరెవరూ రాష్ట్రపతి భవన్‌లో అధికారిక కార్యక్రమం నిర్వహించకూడదు. దీన్ని లోక్‌సభలో ప్రతిపక్షాలు లేవనెత్తుతాయి. మీడియా దుమ్మెత్తిపోస్తుంది. ఆ సమయంలో ఇందిర సమయస్ఫూర్తిగా వ్యవహరించారు. అటువైపున్న శక్తిమంతమైన మహిళలూ అలాగే స్పందించడంతో పెద్ద దౌత్య సంక్షోభం 'టీ' కప్పులో తుపానులా సమసిపోయింది.

కామన్వెల్త్ ప్రభుత్వాధినేతల సదస్సు న్యూఢిల్లీలో 1983 నవంబర్‌లో జరిగింది. ఈ భేటీకి ప్రధాన సమన్వయ కర్తగా నాటి ప్రధాని ఇందిరాగాంధీ నన్ను నియమించారు. కామన్వెల్త్ అధినేతగా బ్రిటిష్ రాణి రెండో ఎలిజబెత్ ఈ సందర్భంగా న్యూఢిల్లీకి విచ్చేశారు. భర్త ప్రిన్స్ ఫిలిప్‌తో పాటు ఆమె రాష్ట్రపతి భవన్‌లో విడిది చేశారు. అయిదేళ్ల పదవీకాలం పూర్తయిన సర్ సానీ రాంఫల్ (గయానా రాజకీయ నాయకుడు) స్థానంలో కామన్వెల్త్‌కు నూతన సెక్రటరీ జనరల్‌ను ఎన్నుకోవడం అనేది ఎజెండాలో తొలి అంశం. రాంఫల్ మరో అయిదేళ్లపాటు ఆ పదవిలో కొనసాగాలని ఇందిరాగాంధీ కోరుకున్నారు. కానీ బ్రిటన్ ప్రధాని మార్గరేట్ థాచర్ దానికి సుముఖంగా లేరు. ఇందిర ఆ సమావేశానికి ఛైర్మన్‌గా ఉండేవారు. దాంతో ఆమె తన పలుకుబడిని ఉపయోగించి, రాంఫల్ రెండో దఫా పదవిలో కొనసాగేలా చేశారు.



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి రెండో ఎలిజబెత్

ఆ సందర్భంగా కామన్వెల్త్ సదస్సు వెలుపల ఒక చిన్న సంక్షోభం వచ్చినట్లే వచ్చి పక్కకు తప్పుకుంది. నాకు గుర్తున్నంత వరకూ అది సదస్సు రెండో రోజు. మదర్ థెరెసాకు 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను ఇవ్వడానికి రాష్ట్రపతి భవన్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నారా అని రాష్ట్రపతి భవన్ అధికారులను నెమ్మదిగా అడిగి కనుక్కోమని ప్రధాని ఇందిర నాకు చెప్పారు. ప్రధానమంత్రి విన్నది నిజమేనని రాష్ట్రపతి భవన్ అధికారులు నిర్ధారించారు. ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రదాన కార్యక్రమానికి ఆహ్వాన పత్రికలు జారీ చేశారు. దానికి బకింగ్‌హామ్ ప్యాలెస్ స్టేషనరీని వాడారు. నాటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్ సింగ్ కార్యదర్శిని లేదా సైనిక కార్యదర్శిని సంప్రదించకుండానే ఆ పని చేసేశారు. నేను ఈ విషయాన్ని ఇందిరాగాంధీకి చేరవేశాను. తాను విన్నదాంతో ఆమె సంతోషంగా లేరు.

ఈలోగా ఎంపీ హెచ్‌ఎన్ బహుగుణ ప్రధానికి ఉత్తరం పంపారు. రాష్ట్రపతి భవనలో మదర్ థెరెసాకు బ్రిటిష్ రాణి అత్యున్నత పురస్కారం ఇస్తున్నట్లు తనకు తెలిసిందన్నది ఆ లేఖ సారాంశం. అయితే తాను విన్నది నిజం కాదని భావిస్తున్నట్లు ఆయన ముక్తాయించారు. భారత్‌లో రాష్ట్రపతి మాత్రమే ఆయన అధికారిక భవనంలో పురస్కార కార్యక్రమం నిర్వహించగలరు. ఒకవేళ బ్రిటిష్ రాణి ఆ కార్యక్రమాన్ని నిర్వహించడానికే ముందుకు వెళ్లినట్లయితే తానూ, ఇతర ప్రతిపక్ష నేతలూ కలిసి ఈ విషయాన్ని లోక్‌సభలో లేవనెత్తాల్సి ఉంటుందని ఆయన ఆ ఉత్తరంలో పేర్కొన్నారు.

బహుగుణ చెప్పింది నిజం. బ్రిటిష్ రాణి సిబ్బంది తెలీకుండా తప్పు చేశారు. ఆ తప్పును తప్పకుండా సవరించాల్సి ఉంది. చోగమ్ (కామన్వెల్త్ దేశాధినేతలు, ప్రభుత్వాధినేతల సదస్సు) ప్రధాన సమన్వయకర్తగా, కనీవినీ ఎరుగని అసాధారణమైన ప్రోటోకాల్ ఉల్లంఘనతో నేను వ్యవహరించాల్సి వచ్చింది.

నాటి బ్రిటన్ ప్రధాని మార్గరేట్ థాచర్‌కు ఈ విషయం తెలియజేసి ఆమె ఏం చెబుతారో తన దృష్టికి తీసుకురావాలని ఇందిరాగాంధీ నన్ను కోరారు. ఆనాడు భారత్‌లో అధికార బాధ్యతల్లో ఉన్న బ్రిటిష్ హై కమిషనర్ ఒక విజయవంతమైన, నిపుణుడైన దౌత్యవేత్త. రాష్ట్రపతి భవన్‌లో అలాంటి పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించకూడదని థాచర్‌కూ, బ్రిటిష్ రాణికీ ఈ విషయాన్ని తెలియజేయవలసిందిగా నేను బ్రిటిష్ హైకమిషనర్‌ను కోరాను. భారత్‌లోని బ్రిటన్ హైకమిషన్‌లో లేదా బ్రిటిష్ కమిషనర్ నివాసంలో ఆ అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించుకోవచ్చని నేను తెలియజేశాను. బ్రిటిష్ రాణి అంటే మాకు అపారమైన గౌరవం ఉందనీ, ఇక మదర్ థెరీసా అయితే మా దృష్టిలో ఒక ప్రత్యేకమైన వ్యక్తి అనీ నేను ఆయనతో చెప్పాను. అదే సమయంలో ఈ విషయంలో మనం ముఖాముఖాలు చూసుకునే పరిస్థితి రాకూడదనీ వివరించాను.

బ్రిటిష్ హైకమిషనర్ నాకు రెండు గంటల్లో ఫోన్ చేశారు. రాణి తలపెట్టిన వేదికను మార్చడానికి కూడా సమయం దాటిపోయిందని నాకు చెప్పారు. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు పంచడం అయిపోయిందనీ, పైగా ఈ విషయం చెబితే రాణి చాలా ఇబ్బంది పడతారనీ ఆయన చెప్పారు. పైగా బ్రిటన్ ప్రెస్‌కు ఈ కార్యక్రమం గురించి తెలిసిపోయింది. ఇది నిజంగా చెడ్డవార్తే. మార్గరేట్ థాచర్ ప్రతిస్పందనను భారత ప్రధాని ఇందిరాగాంధీకి తెలియజేస్తానని నేను బ్రిటిష్ హైకమిషనర్‌కు చెప్పాను. అయితే ఒక విషయం నేను స్పష్టం చేయదల్చుకున్నాను. రాష్ట్రపతి భవన్‌లో అలాంటి అధికారిక పురస్కార ప్రదాన కార్యక్రమానికి మనం అంగీకరించకూడదని ప్రధాని ఇందిరాగాంధీకి నేను సిఫార్సు చేస్తానని తేల్చి చెప్పాను.

ఇక్కడ మాముందు అత్యంత ప్రమాదకరమైన ప్రోటోకాల్ మందుపాతర సిద్ధంగా ఉంది. నలుగురు ప్రపంచ ప్రముఖ మహిళల ముందు జరుగుతున్న నాటకీయ పరిణామం అది. ఇద్దరు శక్తిమంతులైన ప్రధానమంత్రులు, ఒక రాణి, మరొకరు సన్యాసిని కంటే ఎక్కువైన మహిళ. ఈ కథ గానీ బయటపడిందంటే భారత్ మీడియా ఏం చేస్తుంది? అది వెలిగించే పెద్ద భోగిమంటను తల్చుకుంటేనే వణుకు పుట్టింది.

తర్వాత బ్రిటిష్ ప్రధాని చెప్పిన మాటలను నేను ఇందిరాగాంధీకి నివేదించాను. ఇందిర ముఖంలో వెంటనే చిరాకును చూశాను. ఒక క్షణం అలాగే ఉండి, తర్వాత ఆమె గొప్ప నైపుణ్యంతో ఒక దౌత్యపరమైన గూగ్లి వేశారామె. "నట్వర్, థాచర్ వద్దకు వెళ్లి రాష్ట్రపతి భవన్‌లో బ్రిటిష్ రాణి ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించవచ్చని నా మాటగా చెప్పు. కానీ ఈ విషయాన్ని మరుసటి రోజు భారత పార్లమెంటులో తప్పకుండా లేవనెత్తుతారని ఆమెకు చెప్పు. దీనిపై తప్పకుండా విమర్శలు చెలరేగుతాయి. పైగా రాణి పేరును కూడా దీంట్లోకి లాగుతారు. బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ఈ విషయం పట్ల అప్రమత్తంగా ఉంటే మంచిది."

నిజంగానే ఒక అద్భుతమైన ప్రతిస్పందన అటువైపు నుంచి వెంటనే వచ్చింది. రాష్ట్రపతి భవనలో మదర్ థెరెసాకు అవార్డు ప్రదాన కార్యక్రమం జరగనేలేదు. మదర్ థెరెసాను ఎలిజబెత్ రాణి ఉద్యానవనంలో తేనీటి విందుకు ఆహ్వానించారు. అక్కడే ఆమె నోబెల్ గ్రహీత అయిన మదర్ థెరెసాకు ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రదానం చేశారు. ముందుగా అనుకున్న ప్రకారం ఆ కార్యక్రమాన్ని రాష్ట్రపతి భవన్‌లోనే నిర్వహించి ఉంటే దౌత్యపరంగా ఎంత కల్లోలం చోటు చేసుకునేదో మదర్ థెరెసాకు అయితే అసలు తెలిసేది కాదు.

చివరకు ఈ సమస్య పరిష్కారమైన తీరు నన్ను కూడా వ్యక్తిగతంగా ఎంతో సంతోషపెట్టింది. ఆ తర్వాత కామన్వెల్త్ దేశాధినేతల సదస్సు ముగింపు సందర్భంగా బ్రిటన్ ప్రధాని మార్గరేట్ థాచర్ నన్ను ప్రశంసిస్తున్నట్టుగా సైగ చేశారు. భారత్ పర్యటనను ముగించుకుని బ్రిటన్ వెళ్లిపోయేముందు ఎలిజబెత్ రాణి నన్ను పిలిచారు. నా పట్ల ఆమె ఎంతో దయతో వ్యవహరించారు. మరింకెవరికీ అది దక్కి ఉండదనిపించింది. అంతే కాకుండా నాకు ఆమె ఒక రాచ బహుమతిని కూడా ప్రసాదించారు.

వ్యాసకర్త మాజీ విదేశాంగమంత్రి
('ఫస్ట్ ఇండియా' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తోసేస్తే సరా?



వైద్య విద్య, ఆరోగ్య విధానాల ఆచరణతో ముడిపడి ఉన్న అన్ని అవలక్షణాలను నిందించడానికి 'నీట్' అనేది ఒక బలి పశువు అయిందా?

– ఎస్పీ కాలంత్రి, ఫిజీషియన్

మద్దతివ్వలేం



కేవలం రష్యా పక్షాన ఆర్మేనియా ఉన్నందున... టర్కీ, ఉక్రెయిన్ పక్షాన అజర్‌బైజాన్ ఉన్నందున... ఆర్మేనియాకు వ్యతిరేకంగా అజర్‌బైజాన్ చేస్తున్న దురాక్రమణకు మనం సంతోషపడాల్సిన పనిలేదు. ప్రపంచం నలుపు, తెలుపుల్లో ఉండదు.

– కైల్ గ్లెన్, యూకే జర్నలిస్ట్

ఇందుకా ఓటు?



ఇండియాలో మీరు ఏ పార్టీకి ఓటు వేస్తున్నారు అన్నదానితో నిమిత్తం లేకుండా, బహిరంగ మార్కెట్‌లో కొనడానికీ, అమ్ముడుపోవడానికీ సిద్ధపడే ఒక వస్తువును ఎన్నుకోవడానికి ఓటు వేస్తున్నట్టు. ఇంత బలహీనమైన ఎన్నికల వ్యవస్థను భారతీయులు వద్దనుకుంటే, దానికోసం మనం పోరాడాలి.

– ప్రతీక్ సిన్హా, జర్నలిస్ట్

ఇదా చేయాల్సింది?



చీల్చడం మాత్రమే తనకు తెలుసని భాజపా మరోసారి నిరూపించుకుంది. మా కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో యాత్రకు బెదిరిన భాజపా గోవాలో ఒక నీచమైన చర్యకు శ్రీకారం చుట్టింది. దేశం దీన్ని గమనిస్తోంది. వాళ్లు ప్రజలను విభజిస్తారు, మేము కలుపుకొనిపోతాం.

– పవన్ ఖేరా, కాంగ్రెస్ మీడియా

నాస్తిక దేశం



అల్బేనియాలోని సామ్యవాద ప్రభుత్వం ఆ దేశాన్ని 1967లో ప్రపంచంలోని మొట్టమొదటి నాస్తిక దేశంగా ప్రకటించింది. మత విశ్వాసాల మీద నిషేధం విధించి... మత ఉత్సవాలు, ఊరేగింపులు చేసినవాళ్లకూ, ధార్మిక గ్రంథాలు ఉంచుకున్నవాళ్లకూ శిక్షలు ఖరారు చేసింది. గమ్మత్తేమిటంటే – అది ముస్లింలు ఎక్కువున్న దేశం.

– అమీనా బేగమ్ అన్సారీ, పరిశోధకురాలు

మన భాషలో...



ఈజిప్షుల బీజగణితాన్ని గ్రీకులు గ్రీకు భాషలోకి అనువదించుకున్నారు. 'ఆర్యభట్టీయాన్ని' అరబ్బులు అరబిక్‌లోకి అనువదించుకున్నారు. 'యుక్తిభాష'ను జెసూట్లు లాటిన్‌లోకి అనువదించుకున్నారు. పాశ్చాత్య సైన్సును చైనా మాండరిన్ భాషలోకి తెచ్చుకుంది. కానీ చాచా నెహ్రూ మాత్రమే ఇండియన్లు సైన్సును ఇంగ్లీషులో చదవాలనుకున్నారు. అసహజమైన విధానం ఇది.

– జోసెఫ్ టి.నూనీ, వైద్యుడు

నవలకు రోజులు కావా?



భారతీయ సాహిత్యంలో నవలా ప్రక్రియ చచ్చిపోతోందా? ప్రచురణకర్తలు 'నాన్-ఫిక్షన్' కోసం మరీ మరీ వేటాడుతున్నారు. వాస్తవాలు, గణాంకాలు, కథనాలు, సిద్ధాంతం, అనుభవాలు... వీటిమీద పాఠకులు, ప్రచురణకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. చూస్తుంటే దేశంలో కాల్పనిక సాహిత్యానికి రోజులు ముగిశాయని అనిపిస్తోంది.

– పేర్నా ఖంబాటా, లిటరరీ ఏజెంట్

బోధి చెట్టు కింది బుద్ధుడు

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

యాల పొద్దుగాల. తుప్పర్లు బడ్తున్నయి. విజయవాడ కండ్లు దెరుస్తున్నది. సీపురు కట్ట బట్కోని సపాయోల్లు తొవ్వలు ఊక్తున్నరు. పాలపాకెట్లు అమ్మెటోల్లు పాలపాకిట్లు అమ్ముతున్నరు. బాసండ్లు తోమెతందుక్కు పనిమన్సులు బోతున్నరు. వేరె గల్లి కెల్లి వొచ్చిన కుక్కను జూసి గల్లి కుక్కలు మొర్గుతున్నయి.

కొంతమంది లీడర్లు సుత గప్పుడే నిద్ర లేసింద్రు. మోటర్ల ఎన్క గూసున్నోల్లు గూడ సీటు బెల్టు బెట్టు కోవాలని జెప్తున్నరు. మంత్రి కుర్సికి ఆకర్కి ముక్యమంత్రి కుర్సికి గుడ్క సీటు బెల్టు బెట్టుకుంటె మంచిగుంటదని లీడర్లు అన్కొంటున్నరు. గట్ల జేస్తె సచ్చేదాంక కుర్సీమీద గూసుండొచ్చు. ఎలచ్చన్లు, గిలచ్చన్లు లేకుండబోతె మజా చెయ్యొచ్చని గాల్లు జెప్తున్నరు.

తొమ్మిది గొట్టింది. తుప్పర్లు బందైనయి. మబ్బుల సాటుకెల్లి సూర్యుడెల్లిండు. పల్చటి ఎండ గొట్టబట్టింది. టీడీపీ లీడర్ యనమల రామకిష్నుడు కాఫి దాగిండు. ఆరాం కుర్సిల గూసోని పేపర్ సద్వబట్టిండు. ఏం కొంప మున్గిందేమొగని ఒక విలేకరి గాయిన తాన్కి బోయిండు.

'నమస్తే సార్' అని అన్నడు.

'నమస్తే. ఏందివయా యాల పొద్దుగాలే వొచ్చినవ్' అని యనమల అడిగిండు.

'బల్క్ డ్రగ్ పార్క్ మా రాష్ట్రంల బెట్టుండ్రి అంటె మా రాష్ట్రంల బెట్టుండ్రనుకుంట పదిహేడు రాష్ట్రాలు దర్కాస్తు బెడ్తె మూడు రాష్ట్రాలల్ల బెట్టెతందుక్కు పర్మిషన్ ఇచ్చింద్రు. గా మూడు రాష్ట్రాలల్ల మన ఆంధ్రప్రదేశ్ గూడ ఉన్నది గదా'.

'అవ్ ఉన్నది'.

'మన రాష్ట్రంల బల్క్ డ్రగ్ పార్క్ బెట్టొద్దని సంటర్కు కారటెందుకేసింద్రు'.

'గదిగిన బెడ్తె కాకినాడ కాడ రైతుల బత్కులే గాకుంట బెస్తోల్ల బత్కులు బండలైతయి. గాలి, నీల్లు కరాబైతయి'.

'గవి కరాబ్ గాకుంట ట్రీట్‌మెంట్ ప్లాంట్ బెడ్తరు. గది బెడ్తనే బల్క్ డ్రగ్ పార్క్‌కు పర్మిషనిస్తరు. గా పార్క్ తోని ఇర్వై వేల మందికి కొల్వులు దొరుక్తయి. గంతేగాకుంట గాదాంట్ల రోగాలు తక్వజేసేటి మందులు తయారు జేస్తరు'.

'అన్ని రోగాలు తక్వ జేసేటి మందుండంగ గా మందుల్తోని పనేమున్నది. మందుగొడ్తె ముసలోడు గుడ్క



మైకెల్ జాక్సన్ లెక్క డాన్సు జేస్తడు. కీసల పైసలేనోడు గూడ అమరావతి బూములు గొంటనంటడు. ఏబీసీడీలు రానోడు సుత అంగ్రేజిల మాడ్లాడ్తడు. మొన్నటిదాంక మా అయ్యన్న పాత్రున్కి విశాక డిస్టిలరి ఉండె. మా వియ్యంకునికి పి.ఎం.కె. డిస్టిలరి ఉన్నది. ఆదికేశవులు నాయుడికి శ్రీకిష్న డిస్టిలరి ఉన్నది. గివన్ని మా చెంద్రబాబు జమానకెల్లే నడుస్తున్నయి. గివన్ని ఉండంగ వేరె బల్క్ డ్రగ్ పార్క్ ఎందుకు?

బ్రాంది తాగినోడు బ్రహ్మలోకమున కేగు
విస్కిగొట్టినోడు విష్ణువు చెంత జేరు
ఏమి తాగనోడు ఎడ్డోడు చెడ్డోడు
మందు భాగ్యశీల మరి మాటలేల' అని యనమల పద్దెం బాడిండు.

'వహ్వా! వహ్వా! క్యా ఖూబ్' అన్కుంట విలేకరి బోయిండు.

ఒక దిక్కు గిట్లుంటె ఇంకో దిక్కు లోకేశ్, చెంద్రబాబు తాన్కి బోయిండు.

'నాయినా! నాయినా!' అని బిల్సిండు.

'ఏం గావాలె బిడ్డా!' అని చెంద్రబాబు అడిగిండు.

'రాహుల్ గాంది బారత్ జోడో యాత్ర జేస్తుండే'.

'గాయిన జేస్తె నీకేందిరా?'

'నేను గూడ ఏపీ జోడో యాత్ర జేస్తనే'.

'నువ్వు జేసుడెందుకు?'

'రాహుల్ గాందిని అందరు పప్పు అంటరు. నన్ను గూడ పప్పనే అంటున్నరు. పెద్ద పప్పు పాదయాత్ర జేస్తుండంగ చిన్న పప్పు జెయ్యకుంటె ఏం బాగుంటదే'.

'రాజకీయాలు ఎన్నడు నేర్సుకుంటవురా. చెట్టు మనది గాకున్నా పండ్లు మనమే దీస్కోవాలె. పంట మనం పండియ్యకున్నా పంటంత మనదే అనాలె'.

'గదెట్లనే'.

'వొచ్చెపారి బాలకిష్ననే ముక్యమంత్రి క్యాండేట్ అనాలె. మా కాక అన్కుంట జూనియర్ ఎన్టీఆర్ గాయిన దిక్కుకెల్లి ప్రచారం జేస్తడు. మల్లొక పారి టీడీపీ సర్కారొస్తది. బాలకిష్న ముక్యమంత్రి అయితడు'.

'మా మామ ముక్యమంత్రి అయితె నాకేం ఫాయిద?'

'పిల్లనిచ్చిన ఎన్టీఆర్‌కు వెన్నుపోటు బొడ్సి నేను ముక్యమంత్రిని గాలేదా? నా తీర్గనే పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు బొడ్సి నువ్వు ముక్యమంత్రివి గావొచ్చు. షార్ట్‌కట్ ఉండంగ పాదయాత్రలు, గీదయాత్రలు మనకెందుక్కు బిడ్డా' అని చెంద్రబాబు అన్నడు.

దాంతోని లోకేశ్ బోది చెట్టు కింది బుద్దుడయ్యిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ ၊ 99591 50491

నడిచే బహు భాషాకోవిదుడు

సందర్భం



డాక్టర్ జి. లీలావరప్రసాదరావు

కళింగాంధ్రలో జన్మించి రచయితగా, బోధకుడిగా, అనువాదకుడిగా, సాహితీ విమర్శకుడిగా, అభ్యుదయవాదిగా ఆచార్య రోణంకి అప్పలస్వామి చేసిన పయనం తరగని స్ఫూర్తిని పంచింది. ఆయన 1909 సెప్టెంబరు 15వ తేదీన శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం ఇజ్జవరం గ్రామంలో జన్మించారు. మూడో ఫారం చదువుతుండగానే పోతన భాగవతంలోని ఘట్టాలను కంఠస్థం చేసిన అప్పలస్వామి, తర్వాత కాలంలో ప్రపంచమే నివ్వెరపోయేటంత భాషావేత్తగా ఎదిగారు. విజయనగరం ఎంఆర్ కళాశాలలో ఆంగ్ల బోధకుడిగా 1934లో కెరీర్ ప్రారంభించారు.



ఆచార్య రోణంకి అప్పలస్వామి

ఒక వైపు ఆంగ్ల అధ్యాపకునిగా ఉంటూనే ఫ్రెంచ్, స్పానిష్, గ్రీకు, హీబ్రూ, ఇటాలియన్ వంటి యూరోపియన్ భాషలను అధ్యయనం చేశారు. ఆయా భాషల్లో కవితలు, రచనలు చేయడమేకాక అనువాదాలూ చేశారు. గ్రామఫోన్ ప్లేట్లు పెట్టుకొని జర్మన్, లాటిన్ లాంటి భాషల్లో నైపుణ్యం సంపాదించారు. హిందీ, ఒడియా, కన్నడం, బెంగాలీ వంటి భారతీయ భాషల్లో సైతం అనర్గళంగా మాట్లాడే శక్తి సొంతం చేసుకున్నారు.

విజయనగరంలో వున్న తొలినాళ్లలో 'సాంగ్స్ అండ్ లిరిక్స్' పేరిట తొలికవితా సంపుటిని 1935లో వెలువరించారు. అల్లసాని పెద్దన, క్షేత్రయ్య రచనలను ఆంగ్లీకరించారు. మేకియవెల్లి ఇటాలియన్ భాషలో రాసిన 'ప్రిన్స్' గ్రంథాన్ని, 'రాజనీతి' పేరుతో తెలుగులోకి సరళంగా అనువదించారు. మహాకవి గురజాడ కలం నుంచి జాలువారిన 'పూర్ణమ్మ', 'తోక చుక్క'లను ఇంగ్లీష్‌లోకి అనువదించారు. విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, నారాయణ బాబు, విశ్వసుందరమ్మ, చాకలి బంగారమ్మ వంటివారిని ప్రపంచ కవితా ప్రియులకు పరిచయం చేసింది రోణంకి వారే. ఆకాశవాణిలో కొన్ని సంవత్సరాలు ప్రసంగాలు చేశారు.

ఆంగ్లభాషలో ఉత్తమ బోధకుడిగా, పలు భాషల్లో నిష్టాతుడిగా ఖ్యాతిగాంచిన రోణంకి అప్పలస్వామిని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బోధన చేయమని ఆహ్వానం లభించింది. యూజీసీ ఎమెచ్యూర్ ప్రొఫెసర్‌గా నియమించింది. చాగంటి సోమయాజులు (చాసో), శ్రీరంగం నారాయణబాబు, చిత్రావూరి సర్వేశ్వర శర్మలు రోణంకికి మంచి స్నేహితులు. ప్రముఖ చిత్రకారుడు అంట్యాకుల పైడి రాజు ఎంతో సాన్నిహిత్యం కలిగి ఉండే వారు. ప్రముఖ రచయిత ఆరుద్ర, రోణంకి మాష్టారుకు శిష్యుడే. అందుకే తన తొలి కావ్యం 'త్వమేవాహం'ను అప్పలస్వామికి అంకితం చేశారు. డాక్టర్ మానేపల్లి తన తొలి కవితా సంపుటి 'వెలిగించే దీపాలు'ను రోణంకి గారికే అంకితమిచ్చి మాష్టారు రుణం తీర్చుకున్నారు. పీవీ నరసింహారావు, పుట్టపర్తి నారాయణాచార్యుల వంటి వారితో సమాన ప్రతిభా పాటవాలు కలిగిన ఆచార్య అప్పలస్వామి జీవిత చరిత్రను, రచనలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్, బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం ၊ 83095 19615
(నేడు ఆచార్య రోణంకి అప్పలస్వామి జయంతి)

నయా 'ఆన్‌లైన్' మోసం

ఆర్డర్ ఇవ్వకపోయినా ఇంటికి కొరియర్
- తెరిచి చూస్తే అందులో పాత బట్టలు
- కస్టమర్ కేర్‌కు ఫోన్ చేస్తే మొబైల్‌కు లింక్
- క్లిక్ చేస్తే డబ్బులు రిఫండ్ వస్తాయంటూ చెప్పిన ముఠా
- అనుమానం వచ్చి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ
- విశాఖ నగరంలో ఘటన



దొండపర్తి (విశాఖ దక్షిణ): 'హలో సర్.. ఆన్‌లైన్‌లో మీరు పెట్టిన ఆర్డర్ వచ్చింది. కేవలం రూ.270 చెల్లించండి' అంటూ విశాఖపట్నం ఉషోదయ జంక్షన్‌లో నివాసముంటున్న ఒక మహిళకు ఫోన్ వచ్చింది. ఆర్డర్ ఇవ్వలేదని చెప్పినా.. తక్కువ ధరకు ప్రొడక్ట్ వచ్చిందని చెప్పడంతో ఆమె కొరియర్‌ను తీసుకున్నారు. డబ్బులు చెల్లించాక కొరియర్‌ను తెరిచి చేస్తే అందులో పాత డ్రెస్ ఉంది. వెంటనే బిల్‌పై ఉన్న కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయగా.. విషయం చెప్పకముందే ఫోన్ రిసీవ్ చేసుకున్న వ్యక్తి మాట్లాడుతూ.. 'మీ ఐటెమ్‌ను తిరిగి ఇచ్చేయాలనుకుంటున్నారా? మీ ఫోన్ నంబర్‌కు లింక్ పంపిస్తున్నాం. అది ఓకే చేస్తే అమౌంట్ మీకు తిరిగొస్తుంది' అని చెప్పాడు. అసలు విషయం చెప్పకముందే సదరు వ్యక్తి అలా చెప్పే సరికి ఆమెకు అనుమానం వచ్చింది. లింక్ క్లిక్ చేస్తే ఫోన్ హ్యాక్ అవుతుందని భావించి వెంటనే ఆమె సోమవారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నగరంలోకి బిహార్ గ్యాంగ్!

ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, డేటింగ్ యాప్‌ల ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ లింక్‌లు.. ఇలా అనేక మార్గాల్లో దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఆన్‌లైన్ కేటుగాళ్లు ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు. తాజాగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తరహాలో ఆన్‌లైన్ ఆర్డర్, కొరియర్ పేరుతో ప్రజలను దోచుకోడానికి కొత్త పంథాను ఎంచుకున్నారు. బిహార్, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన గ్యాంగ్ నగరంలోనే తిష్టవేసి.. ఆన్‌లైన్‌లో ఆర్డర్స్ పేరుతో బుక్ చేసుకోకపోయినా ఫోన్లు చేసి కొరియర్‌ను అందిస్తున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు విశాఖ నగరంలో ఒక ఫ్లాట్‌లో ఉంటున్న ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ చేయాల్సి ఉందని.. ఈ ఆరుగురికి కొరియర్ మోసాలతో సంబంధం ఉందో, లేదో విచారణలో తేలుతుందని అంటున్నారు.

కొరియర్‌లో పనికిరాని వస్తువులు

కొరియర్‌ను తెరిచి చూస్తే అందులో వాడేసిన బట్టలు, పగిలిపోయిన చిన్న చిన్న వస్తువులు ఉంటున్నాయి. ఇటువంటివి డెలివరీ అయితే డబ్బులు చెల్లించిన వారు తప్పకుండా కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయడం సర్వసాధారణం. ఆ గ్యాంగ్‌కు కావాల్సింది కూడా ఇదే. అలా కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసిన వెంటనే.. ఎటువంటి సమాచారం అడగకుండానే.. 'మీ ఆర్డర్‌ను రిటర్న్ ఇచ్చేస్తున్నారా? మీకు లింక్ పంపిస్తాం. దాన్ని క్లిక్ చేస్తే మీ డబ్బులు రిఫండ్ అయిపోతాయి' అని సమాధానమిస్తున్నారు. ఒకవేళ ఆ లింక్‌ను క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ అయిపోతుంది. ఆన్‌లైన్ మోసాలతో పాటు ఆర్డర్ చేయకుండా వచ్చే కొరియర్ల విషయంలో కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ సూచించారు.

గిఫ్ట్ కార్డుల పేరుతో ఘరానా మోసం

- కార్లు, బైక్‌లు వచ్చాయంటూ ఉత్తరాలు
- ఫోన్ చేసినవారిని మభ్యపెట్టి.. జీఎస్టీ పేరుతో డబ్బులు వసూలు
- చిత్తూరు జిల్లాలో లక్షలాది రూపాయలు పోగొట్టుకున్న బాధితులు
- బిహార్‌కు చెందిన ప్రధాన నిందితుడితో పాటు నలుగురు అరెస్టు
- నకిలీ గిఫ్ట్‌కార్డులు, 30 సెల్‌ఫోన్లు, 30 ఏటీఎం కార్డులు స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గిఫ్ట్‌కార్డులు, ఉత్తరాలు

చిత్తూరు అర్బన్: గిఫ్ట్‌కార్డుల పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన ముఠాను చిత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. కార్లు, బైక్‌లు వచ్చాయంటూ నమ్మబలికి.. జీఎస్టీ, ఎన్‌వోసీ తదితరాల పేర్లతో లక్షలాది రూపాయలు కొట్టేసిన బిహార్, కర్ణాటకకు చెందిన నిందితులను పోలీసులు చిత్తూరులో చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ వివరాలను బుధవారం చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. వివరాలు.. బిహార్‌కు చెందిన ముకేశ్‌కుమార్ ఆన్‌లైన్ ద్వారా పలు వస్తువులు కొనుగోలు చేసిన 5 లక్షల మంది చిరునామాలను సంపాదించాడు. ప్రతి ఒక్కరి అడ్రస్‌కు ఓ ఉత్తరం, ఈ-కామర్స్ కంపెనీల స్టాంప్ ముద్రలతో గిఫ్ట్‌కార్డులు పంపించేవాడు. ఆ బహుమతిని సొంతం చేసుకునేందుకు తమను సంప్రదించాలంటూ ఆ ఉత్తరాల్లో తమ ఫోన్ నంబర్లు ఉంచేవాడు. ఇలా చిత్తూరు జిల్లాలో పలువురికి ఉత్తరాలతో పాటు గిఫ్ట్‌కార్డులు వచ్చాయి. వాటిని స్క్రాచ్ చేసి చూడగా.. కార్లు, బైకులు గెల్చుకున్నట్లు ఉంది. దీంతో వారు ఉత్తరంలోని నంబర్లకు ఫోన్ చేయగా.. కారు పంపించేందుకు గాను జీఎస్టీ కింద రూ.5 వేలు కట్టాలని నమ్మబలికారు. దీంతో చిత్తూరు జిల్లాకు చెందిన 26 మంది.. నిందితుడు చెప్పిన బ్యాంకు ఖాతాకు ఆ సొమ్మును జమ చేశారు. ఆ తర్వాత ఎన్‌వోసీ కోసమని, ట్యాక్స్ చెల్లించాలని రకరకాల పేర్లతో మభ్యపెట్టి రూ.లక్షల్లో వసూలు చేశారు. చివరకు తాము మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి.. చిత్తూరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ సీఐ నరసింహరాజు, పెనుమూరు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తదితర సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ప్రధాన నిందితుడు ముకేశ్‌తో పాటు కర్ణాటకకు చెందిన సందేష్, కిరణ్, హెచ్‌ఎస్ కిరణ్, జైనుల్ అబిద్‌లను చిత్తూరులోని ఫారెస్టు రోడ్డులో పట్టుకున్నారు. నిందితుల నుంచి నకిలీ గిఫ్ట్‌కార్డులు, 30 సెల్‌ఫోన్లు, 30 ఏటీఎం కార్డులు, రెండు ల్యాప్‌టాప్‌లు, రూ.1.80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించి.. నగదు రివార్డులు అందజేశారు.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రం పైకి నైరుతి గాలులు వీస్తున్నాయి. ఫలితంగా గురు, శుక్రవారాల్లో ఉత్తర కోస్తాంధ్రలో కొన్ని చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ఈ నెల 18న ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడి.. 19 నాటికి అల్పపీడనంగా మారుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీంతో 19 నుంచి ఉత్తర కోస్తాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా బుధవారం రాష్ట్రంలో సత్యసాయి, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ, జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. సత్యసాయి జిల్లా ఎర్రమంచిలో అత్యధికంగా 13.8 సెం.మీ., విశాఖ జిల్లా గాజువాకలో 3.7 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

'ఎస్టీ రిజర్వేషన్‌ను కచ్చితంగా పాటించాలి'

సాక్షి, అమరావతి: పర్యాటక శాఖ ఉద్యోగ నియామకాల్లో ఎస్టీ రిజర్వేషన్‌ను కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో పర్యాటక శాఖ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. బొర్రా గుహల ద్వారా వచ్చే ఆదాయంలో 20 శాతం నిధులను.. బొర్రా పంచాయతీకే కేటాయించాలని స్పష్టం చేశారు. గైడ్లకు పారితోషకాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.

అమరావతి రైతుల పాదయాత్రను ఎలా అడ్డుకుంటారో చూస్తాం

- టీడీపీ నేతలు అయ్యన్న, బండారు, బుద్దా వెంకన్న
- రైతులకు అడుగడుగునా స్వాగతం పలుకుతాం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిపై మంత్రులు చర్చకు రావాలి


మహారాణిపేట(విశాఖ దక్షిణ): కొంత మంది వైఎస్సార్ సీపీ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు అమరావతి రైతుల పాదయాత్రను అడ్డుకుంటామని చెబుతున్నారని, వారు ఎలా అడ్డుకుంటారో చూస్తామని తెలుగుదేశం నేతలు చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, బుద్దా వెంకన్న అన్నారు. రైతుల పాదయాత్రకు పూర్తి మద్దతు ఇస్తామని, ఈ యాత్రకు ఉత్తరాంధ్రలో అడుగడుగునా స్వాగతం పలుకుతామని వారు చెప్పారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. అమరావతి రాజధాని నిర్ణయం చంద్రబాబు ఒక్కరే తీసుకున్నది కాదని, అసెంబ్లీలో చర్చించి చట్టం చేశారన్నారు. ఆ సమయంలో మద్దతు తెలిపిన నాయకులు ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. పాదయాత్రపై మాట్లాడితే కేసులు పెడతారా అంటూ మండిపడ్డారు. టీడీపీ హయాంలో, వైఎస్సార్ సీపీ మూడేళ్ల పాలనలో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై విశాఖ వేదికగా చర్చకు రావాలని మంత్రులు బొత్స, ధర్మాన, గుడివాడ అమర్‌నాథ్‌లకు వారు సవాల్ విసిరారు. ఈ చర్చలో తాము ఓడిపోతే అక్కడే విషం తీసుకుంటామని లేదా రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటామని బండారు ప్రకటించారు.

మంత్రి గుడివాడపై తీవ్ర విమర్శలు

అమరావతి రాజధాని విషయంలో భూములను త్యాగం చేసిన రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల దేవుడు దగ్గరకు వెళ్లి మొర పెట్టుకుంటున్నారని, వారిని అడ్డుకుంటామనడం అన్యాయమని టీడీపీ నేతలు అన్నారు. 2004, 2009లో గుడివాడ కుటుంబానికి టికెట్ ఇచ్చి ఆ కుటుంబాన్ని చంద్రబాబు ఆదుకున్నారని, చంద్రబాబు బిస్కెట్లు తిన్న వ్యక్తి అమర్‌నాథ్ అని బుద్దా వెంకన్న అన్నారు. అనకాపల్లిలో అమర్‌నాథ్ ఓడిపోవడం ఖాయమన్నారు. రైతులు పెట్టే అన్నం తినే వ్యక్తులమని, వారి కాళ్లు నాకేందుకు కూడా వెనుకాడమని బండారు చెప్పారు.

గునుపూడిలో వైఎస్సార్‌సీపీ జెండాదిమ్మ ధ్వంసం

ఎంపీటీసీ సభ్యుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మను కూల్చివేసిన అనంతరం చదును చేసిన ప్రాంతం

నాతవరం: అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలోని గునుపూడిలో వైఎస్సార్‌సీపీ జెండాదిమ్మను బుధవారం కొందరు ధ్వంసం చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. జెండాదిమ్మను ధ్వంసం చేయడంపై గునుపూడి ఎంపీటీసీ సభ్యుడు పోలుపర్తి వెంకటరమణ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గునుపూడిలో ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ జెండాదిమ్మను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆవిష్కరించారు. జెండాదిమ్మను ధ్వంసం చేయడంతో మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు అధిక సంఖ్యలో పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఈ విధ్వంసానికి పాల్పడినవారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడి ఫిర్యాదుతో ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అదే సమయంలో ఇరువర్గాల వారు రావడంతో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం రూరల్ సీఐ శ్రీనివాసరావు చెప్పారు.

జపాన్‌తో రక్షణ బంధం బలోపేతానికి జిమెక్స్



జపనీస్ మారీటైమ్ సెల్ఫ్-డిఫెన్స్ ఫోర్స్(జేఎంఎస్‌డీఎఫ్) రియర్ అడ్మిరల్ హిరాటా తొషియికి షేక్ హ్యాండ్ ఇస్తున్న సంజయ్ భల్లా

దొండపర్తి(విశాఖ దక్షిణ): మిత్ర దేశం జపాన్‌తో రక్షణ బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ద్వైపాక్షిక విన్యాసాలు నిర్వహిస్తున్నట్టు ఈస్టర్న్ ఫ్లీట్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ రియర్ అడ్మిరల్ సంజయ్ భల్లా చెప్పారు. తూర్పు నావికాదళంలో ఐఎన్ఎస్ సహ్యాద్రి నౌకలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 11 నుంచి 6వ ఎడిషన్ జిమెక్స్-2022 విన్యాసాలు ప్రారంభించినట్టు చెప్పారు. మూడు ఫేజ్‌లలో ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నామని, తొలి ఫేజ్‌లో అండమాన్ నికోబార్ ద్వీపం పశ్చిమ సముద్ర తీరానికి 130 నాటికల్ మైళ్ల దూరంలో సీ ఫేజ్ విన్యాసాల్లో భాగంగా త్రిముఖ వ్యూహాలతో యాంటీ ఎయిర్ ఫైరింగ్, యాంటీ సబ్‌మెరైన్ విన్యాసాలు చేసినట్టు తెలిపారు. ఇందులో జపాన్ నైకాదళం నుంచి హెలికాప్టర్ క్యారియర్ ఇజుమో, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ తకనామీ నౌకలు భాగస్వామ్యమయ్యాయన్నారు. భారత నావికాదళం నుంచి ఐఎన్ఎస్ సహ్యాద్రి, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ ఐఎన్ఎస్ కద్మత్, ఐఎన్ఎస్ కవరత్తి, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ రణ్‌విజయ్, ఆఫ్‌షోర్ పెట్రోల్ వెసెల్స్ సుకన్య, ఫ్లీట్ ట్యాంకర్ జ్యోతి మొత్తం ఆరు యుద్ధ నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయన్నారు. ప్రస్తుతం రెండో దశలో హార్బర్ ఫేజ్ ప్రారంభమైందని, ఈ సందర్భంగా ఇరుదేశాల నావికాదళ సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, కీలక అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. మూడో దశలో మళ్లీ సీ ఫేజ్ విన్యాసాలు జరుగుతాయన్నారు. నవంబర్‌లో జపాన్ నౌకాదళం నిర్వహించే ఫ్లీట్ రివ్యూలో భారత నౌకాదళం నుంచి యుద్ధ నౌకలు పాల్గొంటాయని సంజయ్ భల్లా వెల్లడించారు.

భారత్‌తో కలిసి పనిచేస్తాం..

జపాన్ మారిటైమ్ సెల్ఫ్-డిఫెన్స్ ఫోర్స్(జేఎంఎస్‌డీఎఫ్) రియర్ అడ్మిరల్ హిరాటా తొషియాకీ మాట్లాడుతూ పసిఫిక్ రీజియన్ గ్లోబల్ చాలెంజెస్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు జపాన్ సిద్ధంగా ఉందన్నారు. అంతర్జాతీయ సమాజంలో శాంతి నెలకొనేందుకు ద్వైపాక్షిక ప్రదర్శనలు దోహదపడతాయని చెప్పారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్‌ను హత్య చేసిన కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

రూ.10 వేల జరిమానా విధించిన అన్నమయ్య జిల్లా ఐదో అడిషనల్ జిల్లా కోర్టు

రామాపురం : మార్కెట్ యార్డు చైర్మన్ పెద్దిరెడ్డి వాసుదేవరెడ్డిని చంపిన కేసులో ముద్దాయికి అన్నమయ్య జిల్లా ఐదో అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి బుధవారం కఠిన జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధించింది. విజయవాడలో జరుగుతున్న టీడీపీ విజయభేరి సభకు వెళ్లొద్దంటూ లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ పెద్దిరెడ్డి వాసుదేవరెడ్డిని బాహుదా దళం నక్సలైట్లు పలుమార్లు హెచ్చరించారు. అయినా సభకు వెళుతున్నట్టు సమాచారం అందుకున్న నక్సలైట్లు.. రామాపురం మండలం బండపల్లి వద్ద 2004 ఫిబ్రవరి, 21న వాసుదేవరెడ్డిని కాల్చి చంపారు. ఘటనపై మృతుడి కుమారుడు పెద్దిరెడ్డి లక్ష్మీకరరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ వినయ్‌కుమార్‌రెడ్డి జనవరి రెండు, 2015న నిందితుడు సదిపిరాళ్ల నరసింహారెడ్డి అలియాస్ రాజశేఖర్(కడప, చిత్తూరు జిల్లా నక్సలైట్ల కమిటీ సభ్యుడు)ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారణ నిర్వహించిన ఐదో అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ బాషా బుధవారం ముద్దాయికి శిక్ష విధించారు.

తుంగభద్ర కాలువలోకి ఆటో పల్టీ

సాక్షి, బళ్లారి: బళ్లారి సమీపంలో బుధవారం ఆటో కాలువలోకి పల్టీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు వ్యవసాయ కూలీలు నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు కాలువలో గల్లంతయ్యారు. బళ్లారికి సమీపంలోని కొళగల్లు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు 20 మంది ఉదయమే ఒక ఆటోలో పనులకు బయలుదేరారు. తుంగభద్ర హెచ్‌ఎల్‌సీ గట్టుమీదకు చేరిన తర్వాత ఒక పొలం వద్ద 10 మంది కూలీలు దిగిపోయారు. డ్రైవర్ మిగిలిన 10 మందితో బయలుదేరారు. కొంత దూరం వెళ్లగానే ఆటో టైరు రాయి మీద వెళ్లడంతో అదుపు తప్పి హెచ్‌ఎల్‌సీ కాలువలోకి బోల్తాపడింది. ఆటోడ్రైవర్ భీమ, మహేష్ అనే బాలుడు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చారు. సమీపంలోని పొలంలో ఉన్న ఓ మహిళ పరుగున వచ్చి తన చీరను విసిరి కాలువలో మునిగిపోతున్న హేమావతి, ఈరమ్మ, శిల్పలను రక్షించింది. నింగమ్మ (35), దుర్గమ్మ (36), పుష్పావతి (16) నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి, (34), నాగరత్న (17), హులిగమ్మ (34) కాలువలో గల్లంతయ్యారు. వారి కోసం గాలిస్తున్నారు.

ఐవోసీఎల్‌తో ఏయూ అవగాహన ఒప్పందం

- ఏయూ విద్యార్థులకు రీసెర్చ్ ఫెలోషిప్‌లు
- పరిశోధనల్లో సంయుక్తంగా పనిచేసే అవకాశం



వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఐవోసీఎల్, ఏయూ ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: విద్య, పరిశోధన రంగాల్లో ప్రోత్సాహం అందించడం, కలసి పనిచేయడానికి విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐవోసీఎల్ రీసెర్చ్-డెవలప్‌మెంట్ విభాగం సంచాలకులు డాక్టర్ ఎస్.ఎస్.వి. కుమార్ సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)-నెట్, గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)లో అర్హత సాధించిన విద్యార్థులు, పరిశోధకులు తమ ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా కొంతకాలం ఏయూలో, మరికొంత కాలం ఐవోసీఎల్‌లో పనిచేసే అవకాశం కల్పిస్తారు. వీరికి ఫెలోషిప్‌లు సైతం ఐవోసీఎల్ అందిస్తుంది. ఐవోసీఎల్ పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ రామకుమార్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలు-పరిశ్రమల అనుసంధానం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా ఇంధన రంగ పరిశ్రమల అవసరాలు, సవాళ్లకు తగిన పరిష్కారాలు చూపే దిశగా పరిశోధనలు నిర్వహించాలన్నారు. జాతీయ స్థాయి సంస్థ అయిన ఐవోసీఎల్‌తో ఒప్పందం చేసుకోవడం, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందిస్తుండటం మంచి పరిణామమని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అభివర్ణించారు. పరిశ్రమలకు అవసరమైన విలువైన మానవ వనరులను అందించే బాధ్యతను ఏయూ సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు.

అమరావతిని మరో హైదరాబాద్ చేస్తారా?

- బూటకపు పాదయాత్రను అడ్డుకుంటాం
- నినదించిన ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు
- 17, 19 తేదీల్లో విద్యార్థులతో నిరసన



సంఘటితంగా నినాదాలిస్తున్న ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు


ఏయూక్యాంపస్: రైతుల పేరుతో చేపట్టిన బూటకపు పాదయాత్రను అడ్డుకుంటామని ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు నినదించారు. గతంలో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి ఎంతో నష్టపోయామన్నారు. టీడీపీ నాయకులు అమరావతిని మరో హైదరాబాద్‌గా మార్చాలని ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనికి కొన్ని రాజకీయ పార్టీలు వంతపాడటం రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడమేనని చెప్పారు. విశాఖపట్నంలోని ఏయూలో జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బుధవారం వారు సమావేశమయ్యారు. మూడు రాజధానులకే తమ మద్దతని చెప్పారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్య విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది రియల్టర్లు, పెట్టుబడిదారులు చేస్తున్న ఈ యాత్రను తాము అడ్డుకుంటామన్నారు. అధికార వికేంద్రీకరణతో రాష్ట్ర సమగ్ర వికాసం సాధ్యపడుతుందన్నారు. మూడు రాజధానులతో రాష్ట్రంలో మూడు ప్రాంతాలు ఎంతో అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. ఏయూ ఉద్యోగ సంఘం నాయకుడు డాక్టర్ జి.రవికుమార్ మాట్లాడుతూ పారిశ్రామిక, ఐటీ, వాణిజ్య, వ్యవసాయ రంగాల్లో విరాజిల్లుతున్న విశాఖను పరిపాలన రాజధానిగా చేసుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. ఉత్తరాంధ్ర విద్యార్థులకు మెరుగైన అవకాశాలు రావడానికి మూడు రాజధానుల నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అమరావతిలో జరుగుతున్న ఉద్యమం కేవలం తాత్కాలికంగా పెట్టుబడిదారులు నడిపిస్తున్న ఉద్యమంగా కనిపిస్తోందన్నారు. విద్యార్థి జేఏసీ కన్వీనర్ బి.కాంతారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని కోరారు. తద్వారా ఉత్తరాంధ్ర వలసలు తగ్గి, స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. రాజధాని ఏర్పాటుకు ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీన్ని అడ్డుకునే విధంగా బూటకపు పాదయాత్రలు చేయడం సరికాదని చెప్పారు. టీడీపీ నాయకులు ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచి వారి మనోభావాలను గౌరవించకపోవడం విచారకరమన్నారు. వారు వెంటనే స్పష్టమైన వైఖరి తెలిపాలని కోరారు. విశాఖ జిల్లాలోకి పాదయాత్రను ఎట్టిపరిస్థితుల్లోను అడుగు పెట్టనివ్వబోమని స్పష్టం చేశారు. ఈ నెల 17న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద, 19వ తేదీన ఎన్ఏడీ కూడలి వద్ద విద్యార్థులతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. డాక్టర్ ఎం.కళ్యాణ్, డాక్టర్ శాంతారావు, మురళి, విద్యార్థులు సాయికృష్ణ, భరత్, నవీన్‌దాస్, బాలాజీ, శివ, పృథ్వీ, మాధవ్‌రెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, జగన్, సోమశేఖర్ పాల్గొన్నారు.

రూ.50,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్‌ఐ

కర్నూలు (టౌన్): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు ఎస్‌ఐ పట్టుబడ్డారు. బుధవారం కర్నూలులో ఈ ఘటన జరిగింది. కోడుమూరు నియోజకవర్గంలోని సి.బెళగల్ మండలానికి చెందిన ప్రకాశ్ ఆచారికి తన ఇంటి పక్కన ఉన్న స్థలం విషయంలో మరొకరితో వివాదం నడుస్తోంది. న్యాయం చేయాలని సి.బెళగల్ ఎస్‌ఐ శివాంజనేయులును కలిసి స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించాడు. అయినా రూ.లక్ష ఇవ్వాలని ఎస్‌ఐ బాధితుడిని డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కర్నూలులోని ఏ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్ సమీపంలో నివసించే ఎస్‌ఐకి బాధితుడు ఫోన్ చేసి డబ్బులు తెచ్చినట్లు చెప్పడంతో స్కూల్ వద్దకు రావాలని కోరాడు. అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు లంచం సొమ్ము తీసుకుంటుండగా పట్టుకున్నారు.

గోవాలో అంతే

ఫిరాయింపుల సంస్కృతికి కేరాఫ్ అడ్రస్



దేశంలో అతి చిన్న రాష్ట్రం. అయినా పెద్ద పెద్ద రాజకీయ సంక్షోభాలు ఎదుర్కొంది. పార్టీల ఫిరాయింపులు, రాజకీయ అస్థిరత , మారే పొత్తులు, రాష్ట్రపతి పాలన, హంగ్ అసెంబ్లీ ఇలా అతి చిన్న రాష్ట్రంలో మ్యూజికల్ చైర్స్ సర్వసాధారణంగా మారాయి. తాజాగా కాంగ్రెస్‌కు చెందిన 8 మంది ఎమ్మెల్యేలు బీజేపీలోకి జంప్ చేయడంతో గోవాలో ఫిరాయింపు చరిత్రపై చర్చ మొదలైంది. 1961లో పోర్చుగీసు పరిపాలన నుంచి విముక్తి పొందిన గోవా మొదట్లో కేంద్ర పాలిత ప్రాంతంగా ఉండేది. 35 ఏళ్ల క్రితం 1987లో రాష్ట్రంగా అవతరించింది.ఇప్పటివరకు గోవా రాష్ట్రంలో 16 మంది ముఖ్యమంత్రులు మారారు. వారిలో రవి నాయక్ కేవలం ఆరు రోజులు, చర్చిల్ అలెమావో 18 రోజులు మాత్రమే అధికారంలో ఉన్నారంటే ఆ రాష్ట్రంలో ఫిరాయింపులు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. గోవా రాష్ట్రానికి 1989లో జరిగిన మొదటి అసెంబ్లీ అయిదేళ్ల కాలంలో ఏడుగురు ముఖ్యమంత్రులు మారారు.

బీజేపీ వచ్చాక పెరిగిన ఫిరాయింపుల సంస్కృతి

2000 సంవత్సరంలో మనోహర్ పరికార్ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఫిరాయింపుల పర్వం మరింత ఎక్కువైంది. అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ బలం పెంచుకోవడం కోసం బీజేపీ ఇతర పార్టీల ఎమ్మెల్యేలను లాగడం మొదలు పెట్టింది. 2017 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 17 స్థానాలతో అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ చిన్న పార్టీల మద్దతుతో బీజేపీ అధికారంలోకి వచ్చింది. పార్టీని బలోపేతం చేయడం కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వల విసిరింది. 2019లో 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంజీపీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. ఈ ఏడాది మొదట్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 20 స్థానాలు దక్కించుకుంది. ఇద్దరు ఎమ్మెల్యేలున్న ఎంజీపీ ముగ్గురు స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్‌కి 11, ఆప్‌కి 2, స్థానాలు వచ్చాయి. అయినప్పటికీ ఆపరేషన్ కమలం కొనసాగించింది. ఇప్పుడు కాంగ్రెస్‌లో 11 మంది ఎమ్మెల్యేలకు గాను ఏకంగా ఎనిమిది మంది అధికార పార్టీలోకి జంప్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తిస్తుందా ?

రాజకీయ ఎజెండాలకు అతీతంగా నేతలు చేతిలో జెండాలు మార్చేస్తున్నా చట్టపరంగా వారిపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం ఉండడం లేదు. 1985లో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ హయాంలో ఫిరాయింపు నిరోధక చట్టాన్ని తీసుకువచ్చారు. రాజ్యాంగానికి 52వ సవరణ చేయడం ద్వారా 10వ షెడ్యూల్‌లో చేర్చారు. ఏదైనా పార్టీకి చెందిన మూడింట రెండు వంతులు మంది ఎమ్మెల్యేలు ఒకేసారి మరో పార్టీలోకి ఫిరాయిస్తే దానికి చట్టబద్ధత ఉంటుంది. గోవాలో 11 మంది ఎమ్మెల్యేలకు 8 మంది వెళ్లిపోవడం వీరిపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వేటు పడే అవకాశం లేదు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినప్పటికీ ప్రజా ప్రతినిధిపై వేటు వేసే అధికారం రాజ్యాంగం స్పీకర్‌కి ఇచ్చింది. సర్వసాధారణంగా స్పీకర్ అధికార పార్టీకి చెందినవాడే కావడంతో వాళ్లు ఆడింది ఆట పాడింది పాటగా మారుతోంది. ఫిరాయింపుదార్లపై నిర్దిష్ట కాలపరిమితిలోనే నిర్ణయం తీసుకోవాలన్న నిబంధనలూ లేవు. దీంతో స్పీకర్లు కాలయాపన చేయడం చూస్తూనే ఉన్నాం. ఇలా ప్రతిపక్ష పార్టీ నుంచి అధికార పార్టీకి మారి దర్జాగా మంత్రి పదవులనుభవించిన వారెందరో!

బకింగ్‌హాం నుంచి వెస్ట్‌మినిస్టర్‌కు

రాణి పార్థివదేహం

వెంట నడిచిన రాజు చార్లెస్, రాకుమారులు విలియం, హ్యారీ





వెస్ట్‌మినిస్టర్ హాల్లో రాణి పార్థివదేహం. యాత్రలో పాల్గొన్న రాకుమారులు విలియం, హ్యారీ

లండన్: బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 అంతిమయాత్ర లాంఛనంగా మొదలైంది. రాజ కుటుంబీకులతో పాటు వేలాది మంది పౌరులు వెంట నడవగా రాణి పార్థివ దేహంతో కూడిన శవపేటిక లండన్‌లోని బకింగ్‌హాం రాజప్రాసాదం నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని వెస్ట్‌మినిస్టర్ హాల్‌కు చేరుకుంది. తల్లి పార్థివదేహాన్ని రాజు చార్లెస్–3 అనుసరిస్తుండగా కుమారులు ప్రిన్స్ విలియం, ప్రిన్స్ హ్యారీ ఆయన వెనకే కలిసి నడిచారు. పాతికేళ్ల క్రితం 1997లో తల్లి డయానా అంతిమయాత్ర సందర్భంగా అన్నదమ్ములిద్దరూ తండ్రితో కలిసి నడిచిన దృశ్యాలను ఈ సన్నివేశం గుర్తుకు తెచ్చింది. విలియం, హ్యారీ మధ్య కొంతకాలంగా విభేదాలున్న విషయం తెలిసిందే. నాయనమ్మ అస్తమయం నేపథ్యంలో వాటిని పక్కన పెట్టి శనివారం కూడా వారిద్దరూ విండ్సర్ ప్యాలెస్ బయట సతీసమేతంగా అభిమానులతో కలివిడిగా గడిపారు.

పుతిన్ కారుపై దాడి!

రష్యా అధ్యక్షుడు క్షేమం



మాస్కో: రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ ప్రయాణిస్తున్న కారుపై దాడి జరిగినట్లు వచ్చిన వార్తలు తీవ్ర కలకలం సృష్టించాయి. పుతిన్ ఇటీవలే అత్యాధునిక లిమోసిన్ కారులో ప్రయాణిస్తుండగా, ముందుభాగంలో ఎడమ వైపు చక్రం పెద్ద శబ్దంతో పేలిందని, వెంటనే పొగ వెలువడిందని కొన్ని వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని, క్షేమంగా ఉన్నారని వెల్లడించాయి. భద్రతా లోపాలకు బాధ్యులుగా గుర్తిస్తూ పుతిన్ సెక్యూరిటీ సర్వీసులోని కొందరిని అరెస్టు చేశారని, మరికొందరు అంగరక్షకులను విధుల నుంచి తొలగించారని జనరల్ ఎస్వీఆర్ టెలిగ్రామ్ చానల్ తెలియజేసింది. అయితే, ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందా? లేక నిజంగా పుతిన్‌ను అంతం చేయడానికి ఎవరైనా కుట్ర పన్నారా? అనేది నిర్ధారణ కాలేదు. ఇదిలా ఉండగా, పుతిన్‌కు అలైనా కబాయెవా(39) అనే ప్రియురాలు ఉన్నారు. ప్రస్తుతం ఆమె గర్భవతి అని సమాచారం. వారిద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, పుతిన్ ఒత్తిడి చేయడంతో అలైనా గర్భస్రావం చేయించుకున్నారని రష్యాలోని అనధికార వర్గాలు వెల్లడించాయి. పుతిన్‌తో ఆమె ఇప్పటికే పలువురు పిల్లలను కన్నట్లు తెలుస్తోంది. అలైనా చివరిసారిగా ఈ ఏడాది జూన్ మొదటివారంలో కనిపించారు. ఆ తర్వాత జాడ లేదు.

క్లుప్తంగా...

ఎయిర్ ఇండియా బోయింగ్ విమానం ఇంజిన్‌లో మంటలు



న్యూఢిల్లీ: మస్కట్ విమానాశ్రయం నుంచి భారత్‌లోని కొచ్చికి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న ఎయిరిండియా బోయింగ్ 737–800 విమానం ఇంజిన్‌లో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సిబ్బంది తక్షణం స్పందించడంతో పెను ప్రమాదం తప్పి విమానంలోని మొత్తం 151 మందీ క్షేమంగా బయట పడ్డారు. వెంటనే మంటలార్పేశారు. దీనిపై విచారణకు డీజీసీఏ ఆదేశించింది. విమానం నుంచి పొగలొస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

కూలీ డబ్బులు ఇవ్వలేదని రూ.కోటి కారు తగలబెట్టాడు

నోయిడా: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో రూ.2 లక్షల కూలీ పైసలివ్వలేదని యజమానికి చెందిన రూ.కోటి విలువైన బెంజ్ కారును తగలబెట్టాడో ప్రబుద్ధుడు! సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా అతన్ని గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెల్మెట్ పెట్టుకొని వచ్చి వీధిలో ఎవరూ లేని సమయం చూసి పెట్రోల్ పోసి కారును తగులబెట్టడం అందులో స్పష్టంగా కన్పించింది. అతన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. 2020లో ఇంట్లో టైల్స్ వేసిన తాలూకు రూ.2 లక్షల కూలీ ఇవ్వకుండా సతాయిస్తున్నాడని అతను ఆరోపిస్తున్నాడు.

మళ్లీ జాక్వెలిన్ విచారణ



న్యూఢిల్లీ: ప్రముఖ వ్యక్తులను మోసగించి, రూ.200 కోట్ల మేర వసూలు చేసిన కేసులో బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌తో పాటు పింకీ ఇరానీని ఢిల్లీ పోలీసు శాఖ ఆర్థిక నేరాల విభాగం అధికారులు విచారించారు. బుధవారం వారిని 8 గంటలపాటు ప్రశ్నించారు. వారి స్టేటమెంట్లలో చాలా అంశాలు సరిపోలడం లేదని, మరోసారి ప్రశ్నించాలని నిర్ణయించారు. ఈసారి ఇద్దరిని కలిపి విచారించనున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సుఖేశ్ చంద్రశేఖర్ ప్రస్తుతం జైలులో ఉన్నాడు. జాక్వెలిన్, మరో నటి నోరా ఫతేహీకి లగ్జరీ కార్లు, నగలు, గడియారాలతోపాటు కోట్ల విలువైన కానుకలను సుఖేశ్ ఇచ్చినట్లు తేలింది.

రూ.200 కోట్ల డ్రగ్స్ స్వాధీనం



అహ్మదాబాద్: పాకిస్తాన్‌కు చెందిన ఓ పడవలో రూ.200 కోట్ల విలువైన 40 కిలోల మాదకద్రవ్యాలను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, ఇండియన్ కోస్టు గార్డు సిబ్బంది సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్ తీరంలో ఈ పడవ లభ్యమైందని, డ్రగ్స్‌కు సంబంధించి ఆరుగురు పాకిస్తాన్ జాతీయులను అరెస్టు చేశామని అధికారులు బుధవారం ప్రకటించారు. అంతేకాకుండా ఈ డ్రగ్స్ సంచులను తీసుకెళ్లడానికి వచ్చిన ఢిల్లీ వాసులు సర్తాజ్ మాలిక్, జగ్గీ సింగ్ అలియాస్ విర్పాల్ సింగ్‌ను సైతం అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. చేపల పడవలో పాక్ నుంచి భారత్‌కు డ్రగ్స్ తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.



431 కిలోల బంగారం, వెండి

రహస్య లాకర్లలో దాచిన సంస్థ • ఈడీ సోదాల్లో వెలుగులోకి

న్యూఢిల్లీ: బ్యాంకు లోన్ మోసం కేసుకు సంబంధించి మనీ లాండరింగ్ అభియోగాలపై దర్యాప్తులో భాగంగా బుధవారం రక్ష బులియన్ అండ్ క్లాసిక్ మార్బుల్స్ అనే సంస్థ కార్యాలయాలపై దాడులు చేసిన ఈడీ బృందానికి కళ్లు బైర్లు కమ్మాయి! రహస్య లాకర్లలో ఏకంగా 431 కిలోల బంగారు, వెండి కడ్డీలు బయటపడ్డాయి. వీటిలో 91 కిలోలు బంగారు, 340 కిలోల వెండి కడ్డీలున్నాయి. వీటి విలువ కనీసం రూ.47.76 కోట్లు ఉంటుందని తేల్చారు. పరేఖ్ అల్యుమినెక్స్ లిమిటెడ్ అనే కంపెనీకి సంబంధించి కేసు దర్యాప్తులో భాగంగా ఈ దాడులు జరిగాయి. బ్యాంకుల నుంచి రూ.2,296.58 కోట్ల మేరకు మోసపూరితంగా రుణాలు తీసుకున్నట్టు 2018లో పరేఖ్ సంస్థపై కేసు నమోదైంది. తర్వాత పలు షెల్ కంపెనీల ముసుగులో ఈ మొత్తాన్ని విదేశాలకు తరలించాలన్నది అభియోగం. దీనికి సంబంధించి గతంలోనే కంపెనీ తాలూకు రూ.205 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశారు.

విద్వేషమే బీజేపీ సిద్ధాంతం

'జోడో' యాత్రలో రాహుల్ ధ్వజం

కొల్లం/తిరువనంతపురం: బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశంలో హింసాద్వేషాలను ప్రేరేపిస్తున్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. భారత్ జోడో యాత్రలో భాగంగా బుధవారం ఆయన కేరళలో కొల్లాం జిల్లాలోని పళ్లిముక్కు జంక్షన్ వద్ద జన సందోహాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. నారాయణ గురు, చట్టాంబి స్వామిగల్, అయ్యాంకలీ వంటి సంస్కర్తలు ఏనాడూ హింసాద్వేషాలను బోధించలేదన్నారు. ఆటో డ్రైవర్లు, జీడిపప్పు రైతుల ప్రతినిధులు, విద్యార్థులతో రాహుల్ సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆశీస్సులు తనలో కొత్త ఉత్సాహం నింపి బలాన్నిస్తున్నాయంటూ ట్వీట్ చేశారు. పేదల బతుకులను ఉద్ధరించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు.

నారాయణ గురు సమాధి వద్ద ప్రార్థనలు

కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో యాత్ర కేరళలో బుధవారం నాలుగో రోజుకు చేరింది. రాహుల్ ఉదయం 7.30కు తిరువనంతపురం జిల్లాలోని నవైకులమ్ జంక్షన్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. శివగిరి మఠంలో ప్రఖ్యాత సామాజిక సంస్కర్త, తత్వవేత్త నారాయణ గురు సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంబంధిత చిత్రాలను ఆయన ఫేస్‌బుక్‌లో పంచుకున్నారు. ''పేద ప్రజల బాగు కోసం నారాయణ గురు అహర్నిశలు శ్రమించారు. గాంధీతో సహా స్వాతంత్ర్య యోధులపై అమిత ప్రభావం చూపారు. వారికి స్ఫూర్తిగా నిలిచారు'' అంటూ కొనియాడారు.



శివగిరి మఠంలో రాహుల్‌కు స్వాగతం

మన భూభాగం చైనాకు ధారాదత్తం

ప్రధాని నరేంద్ర మోదీ 1,000 కిలోమీటర్ల భూభాగాన్ని చైనాకు ధారాదత్తం చేశారని రాహుల్ ఆరోపించారు. దాన్ని ఎలా స్వాధీనం చేసుకుంటారో కేంద్రం చెప్పాలని డిమాండ్ చేశారు. సరిహద్దులో 2020 నాటి పరిస్థితిని పునరుద్ధరించాలన్న భారత్ డిమాండ్‌ను చైనా అంగీకరించలేదంటూ ట్వీట్ చేశారు.

కొందరి చేతుల్లోనే అధికారం

మోదీ పాలనపై సోనియా ఆగ్రహం

న్యూఢిల్లీ: మోదీ పాలనలో ఎనిమిదేళ్లుగా దేశంలో అధికారమంతా కొందరు రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తల చేతుల్లోనే చిక్కుకుందని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ధ్వజమెత్తారు. ఇది దేశ ప్రజాస్వామ్యాన్ని, వ్యవస్థలను అణగదొక్కడమేనన్నారు. దేశంలో ''రాజ్యాంగ విలువలు, సూత్రాలు అపహాస్యం పాలవుతున్నాయి. రాజకీయ లబ్ధి కోసం జనాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవడానికి సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తున్నారు'' అంటూ హిందూస్తాన్ టైమ్స్ పత్రికకు రాసిన వ్యాసంలో మండిపడ్డారు. ''ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారిపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారు. ప్రభుత్వ సంస్థలను, కంపెనీలను ఒకరిద్దరు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేస్తుండడం దారుణం'' అన్నారు. బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలతోపాటు పౌర సమాజం దాడులకు గురవుతోందన్నారు. నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా ప్రజలంతా ఒకటవాలని పిలుపునిచ్చారు. మహిళలు సాధించాల్సింది ఎంతో ఉందన్నారు.

కశ్మీర్‌లో లోయలో పడిన బస్సు

11 మంది దుర్మరణం, 29 మందికి గాయాలు

జమ్మూ: జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్‌లో బుధవారం ఒక మినీ బస్సు ప్రమాదవశాత్తూ లోయలో పడిపోవడంతో 11 మంది మరణించారు. వీరిలో నలుగురు మహిళలున్నారు. మరో 29 మందికి గాయాలయ్యాయి. గలి మైదాన్ నుంచి పూంచ్‌కి వెళుతుండగా బ్రారి నల్లా ప్రాంతంలోని లోయలో ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. లోయలో పడిన బస్సు 250 అడుగుల వరకు వెళ్లి రాళ్లకు ఢీ కొనడంతో బస్సు నుజ్జు నుజ్జు అయింది. బస్సు సామర్థ్యానికి మించి ప్రయాణికుల్ని ఎక్కించడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు అందించిన సమాచారంతో ఆర్మీ, పోలీసులు రంగంలోకి దిగి సంయుక్తంగా సహాయ చర్యలు అందించి క్షతగాత్రుల్ని సమీప ఆస్పత్రులకి తరలించారు. గాయపడిన 29 మందిలో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు.జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

రాణి అంత్యక్రియలకు రాష్ట్రపతి

లండన్: బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 అంత్యక్రియలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరవనున్నారు. బ్రిటన్ ఆహ్వానం మేరకు 17వ తేదీ నుంచి 19 దాకా 3 రోజుల పాటు ఆమె ఆ దేశంలో పర్యటిస్తారని విదేశాంగ శాఖ బుధవారం వెల్లడించింది. సోమవారం వెస్ట్‌మినిస్టర్ అబేలో జరిగే అంత్యక్రియల్లో రాష్ట్రపతితో పాటు 500 మంది దాకా దేశాధినేతలు, ప్రముఖులు పాల్గొంటారు. అంతకుముందు ఆదివారం మధ్యాహ్నం రాణి భౌతికకాయానికి రాష్ట్రపతి నివాళులు అర్పిస్తారు. అనంతరం అక్కడి సంతాపాల పుస్తకంలో భారత ప్రభుత్వం తరఫున సందేశం రాస్తారు.

ఎలివేటర్ నుంచి కింద పడి

ఏడుగురు కూలీలు దుర్మరణం

అహ్మదాబాద్: నిర్మాణంలో ఉన్న భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ మీద నుంచి పడిపోయి ఏడుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మరొకరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అహ్మదాబాద్‌లోని గుజరాత్ యూనివర్సిటీ సమీపంలో నిర్మిస్తున్న భవనంలో బుధవారం ఈ దారుణం జరిగింది. 13వ అంతస్తులో ఎలివేటర్‌లో నిల్చొని కార్మికులు పనులు చేస్తున్నారు. ఆ సమయంలో ఎలివేటర్‌కు సపోర్ట్‌గా ఉన్న గోడ కుప్పకూలిపోయిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. దాంతో అందులో ఉన్న ఆరుగురు కూలీలు అంతెత్తు నుంచి కింద పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో ఐదో అంతస్తులో పని చేస్తున్న ఇద్దరు కూలీలు కూడా బ్యాలెన్స్ కోల్పోయి కింద పడిపోయారు. వారిలో ఒకరు మరణించగా మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు ఎల్.బి. జలా వెల్లడించారు.

స్వేచ్ఛా వాణిజ్యానికి చెల్లుచీటీ

సంపన్న దేశాల నయా పోకడ

- ఇకపై మిత్ర దేశాలతోనే వ్యాపారం
- విపరిణామమేనంటున్న నిపుణులు

దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి

ఇంతకాలం స్వేచ్ఛా వాణిజ్యం, గ్లోబలైజేషన్ అంటూ ఊదరగొట్టడమే గాక ప్రపంచ దేశాలన్నింటినీ అందుకు నయానో భయానో ఒప్పించిన సంపన్న పారిశ్రామిక దేశాలు ఇప్పుడు రూటు మారుస్తున్నాయి. 'మిత్ర' దేశాలతో మాత్రమే వ్యాపార బంధాలకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ విషయంలో అమెరికా ముందుంది. దీన్ని ఫ్రెండ్ షోరింగ్, రీ షోరింగ్ (వ్యాపారాల తరలింపు), నియర్ షోరింగ్ (పొరుగు దేశాల్లోనే పరిశ్రమలు నెలకొల్పడం) వంటి పేర్లతో పిలుస్తున్నారు. ''అన్ని వస్తువులనూ అమెరికానే తయారు చేయడం అసాధ్యం గనుక కాబట్టి నిరంతర సరఫరా కోసం నమ్మకమైన మిత్ర దేశాలతో కలిసి అడుగులు వేయాల్సిన టైమొచ్చింది'' అని అధ్యక్షుడు జో బైడెన్ ఇటీవల స్పష్టం చేశారు. అంతర్జాతీయ విపణిలో ఈ సరికొత్త మార్పు విపరిణామాలకే దారి తీస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ట్రంప్ హయాంలో అమెరికా, చైనా మధ్య తీవ్రమైన వాణిజ్య యుద్ధానికి తెర లేచింది. ఇరు దేశాలూ పరస్పరం ఆంక్షలు విధించుకుంటూ వచ్చాయి. ప్రపంచ వాణిజ్య సంస్థలన్నింటికీ వస్తూత్పత్తి కేంద్రమైన చైనాతో విభేదాలతో అమెరికా, మిత్ర దేశాలకు సరుకుల సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీన్నుంచి కోలుకోకముందే వచ్చి పడ్డ కరోనా అంతర్జాతీయ వాణిజ్యాన్ని రెండేళ్లపాటు అతలాకుతలం చేసింది. ఆ వెంటనే రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది.



..అలా మొదలైంది

ఇటీవలి పరిణామాల నేపథ్యంలో చైనా, రష్యా వంటి ప్రత్యర్థి దేశాలపై ఇక ఏ విషయానికీ ఆధారపడకూడదని అమెరికా, మిత్ర దేశాలు నిశ్చయానికి వచ్చాయి. దాంతో వాటిమధ్య ఫ్రెండ్ షోరింగ్ విస్తరిస్తూ వస్తోంది. నిర్నిరోధంగా సరుకుల ఉత్పత్తి, సరఫరా కోసం కలిసి పని చేయాలని అమెరికా, జపాన్, భారత్, యూరప్‌తో కలిసి 17 దేశాలు నిశ్చయించుకున్నాయి. పారదర్శకత, వైవిధ్యం, భద్రత, స్థిరత్వం అన్న నాలుగు సూత్రాల ఆధారంగా పని చేయాలని ఒప్పందం చేసుకున్నాయి. చైనాను దూరం పెట్టేందుకు ఇండో పసిఫిక్ ఎకనామిక్ ఫ్రేమ్‌వర్క్ పేరిట మిత్ర దేశాలతోకలిసి అమెరికా మరిన్ని వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. సెమీ కండక్టర్ల తయారీకి ఐరోపాలో ఏకంగా 4,300 కోట్ల పౌండ్ల పెట్టుబడులకూ సిద్ధపడింది. జీ7 దేశాలు కూడా వ్యూహాత్మక, అత్యవసర పరిశ్రమల తరలింపు కోసం ఏకంగా 60 వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించాయి. ఇవన్నీ 150 దేశాల్లో పట్టు సాధించే లక్ష్యంతో చైనా తెర తీసిన బెల్ట్ అండ్ రోడ్ విధానానికి విరుగుడు యత్నాలే.

అభివృద్ధికి విఘాతమే: రాజన్

ధనిక దేశాల ఫ్రెండ్లీ షోరింగ్ ధోరణి పేద, వర్ధమాన దేశాలకు గొడ్డలిపెట్టుగా మారగలదని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ హెచ్చరిస్తున్నారు. ''స్వేచ్ఛా వాణిజ్యం వల్ల భారీగా వచ్చిపడ్డ పెట్టుబడులతో ఈ దేశాలు బాగా లాభపడ్డాయి. సంపన్న దేశాల తిరోగమన విధానంతో ఇది తలకిందులవుతుంది'' అన్నది ఆయన అభిప్రాయం.

మనకు లాభమే!

ఫ్రెండ్లీ షోరింగ్ విధానంతో ఇండొనేసియా, మలేసియా, వియత్నాం, భారత్, బల్గేరియా, రొమేనియా వంటి దేశాలు లాభపడతాయని అంచనా. భారత్‌లో 300 కోట్ల డాలర్లతో ఇజ్రాయెల్ మైక్రో చిప్ ప్లాంట్ పెట్టనుంది. ఆస్ట్రేలియా కూడా ఖనిజాల సరఫరా ఒప్పందం చేసుకుంది. విధానాలను మరింత సరళతరం చేస్తే ఇలాంటి పెట్టుబడులు వెల్లువలా వచ్చిపడతాయన్నది ఆర్థికవేత్తల అంచనా.

75 ఏళ్ల గ్లోబలైజేషన్

రెండో ప్రపంచ యుద్ధానంతర పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యానికి అడ్డంకులు లేకుండా స్వేచ్ఛా వాణిజ్యానికి పునాదులు వేస్తూ భారత్ సహా 23 దేశాలు 1947 అక్టోబర్లో గాట్ ఒప్పందంపై సంతకాలు చేశాయి. 1995 నాటికి 125 దేశాలు ఇందులో చేరాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటు ద్వారా దీనికి సంస్థాగత రూపం ఏర్పడింది. చౌకగా శ్రమ శక్తి, ముడి సరుకులు లభించే ప్రాంతాలు, వస్తూత్పత్తి సామర్థ్యమున్న దేశాలకు బడా పరిశ్రమలు తరలి వెళ్లేందుకు ఇది ఉపయోగపడింది.

న్యూయార్క్, టోక్యో... కుబేరుల అడ్డాలు

ప్రపంచంలో 25వ స్థానంలో ముంబై

న్యూయార్క్: ప్రపంచంలో అపర కుబేరులు ఎక్కువగా ఉన్న నగరాల్లో న్యూయార్క్, టోక్యో, శాన్ ఫ్రాన్సిస్కో, లండన్ తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి. రెసిడెన్సీ అడ్వైజరీ సంస్థ 'హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ గ్రూప్' తాజా నివేదికలో ఈ మేరకు వెల్లడించింది. ధనవంతులకు అడ్డా అయిన మొదటి 10 నగరాల్లో 5 నగరాలు అమెరికాలోనే ఉండడం విశేషం. ఒక మిలియన్ డాలర్లు (రూ.7.94 కోట్లు) లేదా అంతకంటే ఎక్కువ ఆస్తి ఉంటే మిలియనీర్లుగా పరిగణిస్తారు.

- 2022లో తొలి అర్ధభాగంలో న్యూయార్క్ సిటీ 12 శాతం మిలియనీర్లను కోల్పోయింది. శాన్ ఫ్రాన్సిస్కోలో మిలియనీర్లు 4 శాతం పెరిగారు. లండన్‌లో 9 శాతం తగ్గిపోయారు.
- సౌదీ అరేబియా రాజధాని రియాద్, యునైటెట్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని షార్జాలో సంపన్నుల సంఖ్య వేగంగా పెరిగిపోతోంది.
- అబూ దాబీ, దుబాయ్ సిటీలు బడా బాబులను ఆకర్షిస్తున్నాయి. ధనవంతులు ఆయా నగరాల్లో నివసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అక్కడ తక్కువ పన్నులు, కొత్త కొత్త నివాస పథకాలు అమల్లోకి వస్తుండడమే ఉండడమే ఇందుకు కారణం.
- రష్యా ధనవంతులు యూఏఈకి వస్తున్నారు.
- సంపన్నుల నగరాల జాబితాలో చైనాలోని బీజింగ్, షాంఘై సిటీలు తొమ్మిది, పదో స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లోని ముంబై నగరం 25వ స్థానంలో నిలిచింది.
- ఈ ఏడాది సంపద తరలిపోతున్న దేశాల్లో రష్యా తర్వాత రెండో స్థానం చైనాదేనని 'హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ గ్రూప్' అంచనా వేసింది.

అక్షర వేడుక



జాతీయ హిందీ భాషాదినోత్సవాన్ని పాఠశాలల్లో బుధవారం వైభవంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు. అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అక్షర వేడుక జరిపారు. హిందీ 'అ' ఆకారంలో కూర్చొని రాజభాష ప్రాధాన్యం చాటిచెప్పారు.

– వంగర



కేజీబీవీ విద్యార్థినులకు విద్యుత్ షాక్

భోగాపురం కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు బుధవారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురయ్యారు. తీవ్రంగా గాయపడ్డారు.

- 8లో

వీఏఏపై సస్పెన్షన్ వేటు

దత్తిరాజేరు: ఎరువుల నగదు ప్రభుత్వానికి చెల్లించకుండా రూ.5 లక్షలతో పరారైన పెదకాద సచివాలయంలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ)రాఘవను సస్పెండ్ చేసినట్టు ఏఓ అనూరాధ తెలిపారు. ఈనెల 11వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించారు. దీనిపై విచారణ జరిపి సస్పెండ్ చేసినట్టు ఏఓ తెలిపారు.

న్యూస్‌రీల్

ఆర్ఐఓగా సత్యనారాయణ



ఆర్ఐఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారిగా మజ్జి సత్యనారాయణ(ఎఫ్ఏసీ)ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సత్యనారాయణ నెల్లిమర్ల సీకేఎంజే కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఆర్ఐఓగా పనిచేసిన మజ్జి ఆదినారాయణ పాతస్థానం డెంకాడ కళాశాలకు వెళ్లిపోయారు. ఆదినారాయణ నుంచి సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్, కళాశాల సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సూర్యకళ, శాంతకుమారి

విజయనగరం ఫోర్ట్: విజయనగరం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో అంగన్‌వాడీ పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. భోగాపురం, గంట్యాడ, ఎస్.కోట, వియ్యంపేట, విజయనగరం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు-4, ఆయాలు-38, మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఒకదానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 43 పోస్టులకు 46 మంది దరఖాస్తు చేయగా ఇంటర్వ్యూకు 41 మంది హాజరయ్యారు. ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి బి. శాంతకుమారి, సీడీపీఓలు ఉమాభారతి, ప్రసన్నలు ఇంటర్వ్యూలు జరిపారు.

36వేల మందికి వైఎస్సార్ చేదోడు



ఆమదాలవలసలో జగనన్న చేదోడు లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఈడీ

రేగిడి: జిల్లాలో వైఎస్సార్ చేదోడు పథకం కింద 36వేల మందికి ఆర్థిక సాయం అందించామని బీసీ కార్పొరేషన్ ఈడీ జి.పెంటోజీరావు అన్నారు. జగనన్న చేదోడు కింద రుణం పొంది మండలంలోని ఆమదాలవలస గ్రామంలో వారణాశి గణపతి చేస్తున్న వ్యాపారాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం 'సాక్షి' తో మాట్లాడుతూ వైఎస్సార్ చేదోడు పథకం కింద ఏడాదికి రూ.10 వేలు చొప్పున లబ్ధిదారులకు వడ్డీలేని రుణం అందిస్తున్నట్టు వెల్లడించారు. వైఎస్సార్ కాపునేస్తం కింద జిల్లాలో 16,760 మందికి లబ్ధిచేకూరిందని వివరించారు. ఈ పథకం ద్వారా 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు ఉన్న కాపు, తెలగ, ఒంటరి మహిళలకు రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం లబ్ధిచేకూర్చుతోందన్నారు. ఆర్థిక లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తోందని చెప్పారు. ప్రభుత్వ సాయంతో కుట్టుమిషన్లు, అప్పడాల తయారీ, చేగొడియాల తయారీ యూనిట్లను లబ్ధిదారులు విస్తరింపజేస్తున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు ఉన్నారు.

వేగవంతంగా భూ సేకరణ



భూ సేకరణ ప్రక్రియపై సూచనలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో తలపెట్టిన జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల పనులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో జేసీ మయూర్‌అశోక్‌తో కలిసి తోటపల్లి, తారకరామా, గజపతినగరం బ్రాంచ్ కెనాల్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, జాతీయ రహదారి పనులపై బుధవారం సమీక్షించారు. తోటపల్లి ప్రాజెక్టు పనులన్నీ అక్టోబర్ మొదటి వారానికి పూర్తిచేయాలని ఆదేశించారు. భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. సుజల స్రవంతికి కావాల్సిన భూముల వివరాలను రైతులకు స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో పార్వతీపురం, బొబ్బిలి, చీపురుపల్లి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు సుదర్శన దొర, వెంకటేశ్వరరావు, పద్మలత, ఈఈ, డీఈ పాల్గొన్నారు.

ఆకలి తీర్చుతున్న ఫుడ్ బ్యాంకులు



పారబోసిన ప్రతీ మెతుకుతో మరొకరి ఆకలి తీర్చవచ్చన్న మాట.. విజయనగరంలోని పాలకులు, అధికారులు, దాతల్లో ఓ కొత్త ఆలోచనను పుట్టించింది. ఫుడ్ బ్యాంకుల ఏర్పాటుకు నాంది పలికింది. ఇంటిలో ఏ శుభకార్యం జరిగినా పేదలకు పట్టెడన్నం పెట్టాలనుకునేవారు ఫుడ్ బ్యాంకులను సంప్రదిస్తున్నారు. తమకు తోచిన సహాయాన్ని, ఆహారాన్ని సమకూర్చుతున్నారు. పట్టణానికి వచ్చే అభాగ్యులు.. స్థానికంగా నివసించే పేదల ఆకలి తీర్చడంలో భాగస్వాములవుతున్నారు. అన్నదాన క్రతువును నిరంతరాయంగా కొనసాగించేందుకు తమవంతు సహకరిస్తున్నారు.



- విజయనగరంలో విజయవంతంగా ఫుడ్ బ్యాంకుల నిర్వహణ
- మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు
- స్వచ్ఛంద సంస్థల నేతృత్వంలో ప్రతిరోజు కనీసం 400 మందికి ఉచితంగా భోజనం
- ఆహార పంపిణీకి ముందుకొస్తున్న దాతలు
- పేదల కడుపునింపుతున్న దాతలు

నాడు



సాధారణ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు 2018 సంవత్సరం జూలై 11న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విజయనగరంలో రెండు అన్నా క్యాంటీన్‌లు ఏర్పాటు చేశారు. రూ.5కు భోజనం పెట్టేవారు. మిగతా ఖర్చును ప్రభుత్వం నిర్వాహకులకు చెల్లించేది. అందుకే రోజూ తినేవారి సంఖ్య 125 నుంచి 150 వరకు ఉంటే... లెక్కల్లో మాత్రం 250 నుంచి 300 వరకు చూపించేవారనే ఆరోపణలు అప్పట్లోనే గుప్పుమన్నాయి.

నేడు



ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేకుండా ఉచితంగా అన్నంపెట్టే ఫుడ్ బ్యాంక్‌లు విజయనగరంలో నాలుగుచోట్ల విజయవంతంగా పనిచేస్తున్నాయి. కరోనా తర్వాత గత ఏడాది ఆగస్టు 13 నుంచి రోజూ కనీసం 400 మంది ఆకలి తీర్చుతున్నాయి. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా వీటిని ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకారం అందిస్తున్నారు. సేవాభావంతో సాగుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, విజయనగరం/ విజయనగరం:

దానాల్లో అన్నదానం గొప్పదనేది నానుడి. అలాంటి బృహత్తర కార్యక్రమాన్ని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఓ యజ్ఞంలా కొనసాగిస్తున్నారు. విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో ప్రతిపాదించిన ఫుడ్‌బ్యాంకులపై కార్పొరేషన్ పాలకవర్గం తీర్మానం చేసింది. అలా ప్రయోగాత్మకంగా నాలుగు ప్రాంతాల్లో ఫుడ్‌బ్యాంకులు ఏర్పాటయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, కోట జంక్షన్, ఎస్‌సీఎస్ థియేటర్ రోడ్, పోలీస్ బ్యారక్స్ ప్రాంతాల్లో 2021, ఆగస్టు 13వ తేదీ నుంచి నిరాటంకంగా పేదల ఆకలిని తీర్చుతున్నాయి. ఆ ఫుడ్ బ్యాంకుల నిర్వహణకు వీలుగా ఒక్కోటి రూ.85వేల ఖర్చుతో షెడ్‌లను నిర్మించారు. దాతలు అందించే ఆహార పదార్థాలు పాడవ్వకుండా ఉంచేందుకు రిఫ్రిజిరేటర్‌లను ఏర్పాటు చేశారు.

ఒక్క రూపాయి కూడా చెల్లించనక్కర్లేదు....

నగరానికొచ్చే పేదలెవరైనా సరే ఒక్క రూపాయి కూడా చెల్లించనక్కర్లేకుండా నాలుగు ఫుడ్ బ్యాంకుల్లో ఆహారాన్ని అందిస్తున్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను పలు స్వచ్ఛంద సంస్థలు తీసుకున్నాయి. కోట కూడలి వద్ద గల ఫుడ్‌బ్యాంక్‌ను హోటల్ అసోసియేషన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఫుడ్‌బ్యాంక్ పంచముఖ ఆంజనేయస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఎస్‌సీఎస్ థియేటర్ వద్ద గల ఫుడ్‌బ్యాంకును జిల్లా గౌరీ సేవా సంఘం, పోలీస్ బ్యారక్స్ వద్ద గల ఫుడ్‌బ్యాంకు కన్యకాపరమేశ్వరి అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో సాగుతోంది. ఈ నాలుగు ఫుడ్‌బ్యాంకుల ద్వారా రోజూ కనీసం 400 మందికి ఉచితంగా ఆహారం అందిస్తున్నారు. తమ కుటుంబ సభ్యుల జన్మదిన వేడుకలు, వివాహ వార్షికోత్సవాలు ఇతరత్రా శుభకార్యాల సందర్భాల్లో అన్నదానం చేయాలనుకునేవారికి ఫుడ్ బ్యాంకుల్లో అవకాశం కల్పిస్తున్నారు.

దాతల భాగస్వామ్యంతో..

విజయనగరానికి ఏదో ఒక పనికోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చే పేదలకు ఉచితంగా ఆకలి తీర్చాలనేది ఫుడ్‌బ్యాంకుల లక్ష్యం. నాలుగు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశాం. వాటి ద్వారా ప్రతిరోజు పేదలకు ఆహారం పంపిణీ చేస్తున్నాం. ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావడం శుభ పరిణామం.

– రెడ్డి శ్రీరాములునాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

అక్రమాలకు తావు లేకుండా...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో తెరిచిన రెండు అన్నా క్యాంటీన్‌లు పేదలకు తిండి పెట్టే మాటేమోకానీ పలు అక్రమాలకు నెలవయ్యాయి. విజయనగరం మున్సిపల్ కార్యాలయం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ ప్రాంతాల్లోని అన్నా క్యాంటీన్‌లలో రోజూ భోజనం తినే వారి సంఖ్య 125 నుంచి 150 వరకు ఉంటే... లెక్కల్లో మాత్రం 250 నుంచి 300 వరకు చూపించేవారనే అపవాదు మూటగట్టుకున్నారు. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం అన్నా క్యాంటీన్‌ల పేరిట హడావుడి చేస్తున్నారు.



ఈ చిత్రంలో భోజనం అందుకుంటున్న వ్యక్తిపేరు శేఖర్. గొట్లాం గ్రామానికి చెందిన అతను మానసికంగా, శారీరకంగా అనారోగ్యం బారినపడ్డాడు. నా అనేవారు ఎవ్వరూ లేకపోవడంతో ఒంటరివాడయ్యాడు. రోజూ కోట కూడలి వద్ద ఉన్న ఫుడ్ బ్యాంకు నిర్వాహకులు అందజేస్తున్న ఆహారంతో ఆకలి తీర్చుకుంటున్నాడు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శ్రీనివాస్. విజయనగరంలోని దాసన్నపేటకు చెందిన అతను పెయింటింగ్ పనులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పుడప్పుడూ సమీపంలో ఎక్కడైనా పని ఉన్నపుడు మధ్యాహ్న సమయంలో ఫుడ్‌బ్యాంక్‌లో వడ్డించే ఆహారంతో ఆకలి తీర్చుకుంటున్నాడు. భోజనం శుభ్రంగా, రుచికరంగా ఉంటోందని చెబుతున్నాడు.



ఎస్‌సీఎస్ కూడలిలోని ఫుడ్‌బ్యాంకు వద్ద పేదలకు అన్నం వడ్డిస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు



ఎస్‌సీఎస్ జంక్షన్‌లో ఫుడ్‌బ్యాంక్ వద్ద ఆకలితీర్చుకుంటున్న దివ్యాంగుడు

సచివాలయ సేవలు భేష్



సచివాలయ సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృంద సభ్యులు

- నగరంలో పర్యటించిన కేంద్ర బృందం

విజయనగరం: రాష్ట్రంలో సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందిస్తూ పాలనలో నూతన ఒరవడికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యులు రాజు సరస్వత్, విజిత్ ప్రకాష్ భట్ అభిప్రాయపడ్డారు. నగరంలోని 17వ నంబర్ సచివాలయాన్ని వారు బుధవారం పరిశీలించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలు, నూతన వ్యవస్థ పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులపాటు జిల్లాలో తమ కమిటీ పర్యటిస్తుందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సచివాలయాల ద్వారా అందుతున్న పౌర సేవలను తెలుసుకుంటామని చెప్పారు. నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్, సీపీఓ బాలాజీ, సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపేటలో ఉన్న స్వామి వివేకానంద నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను బృంద సభ్యులు సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదుల్లో శీతలీకరణ యంత్రాలు, డిజిటలైజ్‌డు బోర్డులు, ఆంగ్ల బోధనాంశాలను పరిశీలించి ప్రభుత్వ తీరును ప్రశంసించారు.

17న రక్తదాన శిబిరాల నిర్వహణ

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో రక్తనిల్వలు పెంచేలా ఈ నెల 17న జిల్లావ్యాప్తంగా 9 చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఆస్పత్రులు, రక్తనిధి కేంద్రాలు, రక్తనిల్వ కేంద్రాలకు వెళ్లి యువకులు రక్తదానం చేయాలని కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇతర సంస్థల ఆధ్వర్యంలో శిబిరాలు సాగుతాయని చెప్పారు. రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

నేడు స్పెషల్ గ్రీవెన్స్

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన్ పరిషత్, వైద్య కళాశాలల్లో 194 పోస్టులు భర్తీ చేయనున్నారు. దరఖాస్తుదారుల మెరిట్ జాబితాను వైద్య ఆరోగ్యశాఖ వెబ్‌సైట్లో పెట్టారు. దీనిపై అభ్యంతరాల స్వీకరణకు గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి తెలిపారు. డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొని అభ్యర్థుల సందేహాలను నివృత్తిచేస్తారని చెప్పారు.

ఊరూరా ఉత్సవ ప్రచారం



పైడితల్లి ఉత్స ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ కిశోర్‌కుమార్, పాలకమండలి సభ్యులు

- జెండా ఊపి ప్రచార రథం ప్రారంభించిన ఆలయ ఈఓ
- అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు

విజయనగరం టౌన్: చల్లని తల్లి.. ఉత్తరాంధ్ర భక్తుల కల్పవల్లి... పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవ తేదీలు, పూజా వివరాలను ఊరూరా ప్రచారం చేసే రథాన్ని ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ముందుగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పసుపుకుంకుమలతో పూజలు జరిపారు. అనంతరం టెంకాయకొట్టి రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అమ్మవారి ప్రచార రథం ఆరురోజుల పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఊరూరా తిరుగుతూ ప్రజలకు పైడితల్లి అమ్మవారి పండగ తేదీలను, దీక్షలను వివరిస్తుందన్నారు. పైడిమాంబ దీక్షా పీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో పైడిమాంబ దీక్షాపరులు ప్రచారం చేస్తారన్నారు. అక్టోబర్ 10న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 11న సిరిమానోత్సవాలను ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో పైడితల్లి అమ్మవారి దేవస్థానం పాలకమండలి సభ్యులు వెత్సా శ్రీనివాసరావు, బలివాడ పార్వతి, రామ్‌సింగ్ సూరమ్మ, నక్కా జ్యోతి, చిల్లా పుష్ప, గంధం లావణ్య, సత్తి అచ్చిరెడ్డి, గొర్లె ఉమా తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి తొలి ప్రాధాన్యం

- వచ్చేఏడాది నుంచి ప్రారంభం కానున్న వైద్య కళాశాల తరగతులు
- జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు
- జిల్లా కేంద్రాస్పత్రిలో సెంట్రల్ ఓపీ రిజిస్ట్రేషన్ విభాగానికి భూమి పూజ



సెంట్రల్ ఓపీ రిజిస్ట్రేషన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్, ఎంపీ

విజయనగరం ఫోర్ట్: వైద్యరంగానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా కేంద్రాస్పత్రి ఆవరణలో సెంట్రల్ ఓపీ రిజిస్ట్రేషన్ భవన నిర్మాణానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ వైద్యకళాశాల తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. కేంద్రాస్పత్రిలోనే బోధనాస్పత్రి ప్రారంభం కావడం వల్ల రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. బోధనాస్పత్రిలో రూ.8.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు వెల్లడించారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం అధిక నిధులు వెచ్చించి వైద్య సదుపాయాలు సమకూర్చుతోందన్నారు. ఓ వైపు ప్రభుత్వ వైద్య కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణం శరవేగంగా సాగుతోందన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వైద్య కళాశాలను నిర్లక్ష్యం చేశాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్మోహన్ రెడ్డి జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, కేంద్రాస్పత్రి సూపరింటెండెంట్ కె.సీతారామరాజు, ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ కె.శివకుమార్, ఈఈ ఎం. సత్యప్రభాకర్, డీఈ కుమార్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కె.సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వసతిగృహ విద్యార్థికి పాముకాటు

చీపురుపల్లి: పట్టణంలోని సమీకృత బాలుర వసతిగృహానికి చెందిన విద్యార్థి కల్లం వెంకట్ పాముకాటుకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 12న వసతిగృహానికి సమీపంలో వెంకట్ పాము కాటుకు గురవడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖపట్టణంలోని కేజీహెచ్‌కు తరలించారు. సమీకృత బాలుర వసతిగృహంలో ఉంటున్న వెంకట్ అక్కడికి సమీపంలో గల రామాంజనేయకాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 12న సాయంత్రం 6 గంటల తరువాత చీపురుపల్లి పట్టణం నుంచి తిరిగి వెళ్తూ వసతిగృహానికి సమీపంలో పాముకాటుకు గురయ్యాడు. అయితే సాయంత్రం 6 గంటల సమయంలో వసతిగృహంలో ఉండాల్సిన విద్యార్థి విద్యార్థి బయట ఎలా ఉన్నాడనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటినా విద్యార్థి వసతిగృహానికి రాకపోయినప్పటికీ వసతిగృహ సంక్షేమాధికారులు పట్టించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యార్థి ఆరోగ్యం బాగానే ఉంది

ఇదే విషయమై వసతిగృహ సంక్షేమాధికారి సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి వెంకట్ ఈ నెల 12న సాయంత్రం పాఠశాల విడిచిపెట్టిన వెంటనే నేరుగా వసతి గృహానికి రాకుండా వ్యక్తిగత పనులపై పట్టణంలోకి వెళ్లాడని తిరిగి వస్తుండగా పాముకాటు వేసిందని తెలిపారు. తక్షణమే వెంకట్‌ను చీపురుపల్లి సీహెచ్‌సీలో చేర్పించి ప్రథమ చికిత్స అందించామని, ప్రస్తుతం విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు.

డుమ్మా కొడితే దొరికేస్తారమ్మా..!

- విద్యార్థుల హాజరు కోసం ప్రత్యేక యాప్
- డ్రాపవుట్స్‌పై నిఘా
- జిల్లాలోని 3,252 పాఠశాలల్లో అమలు


బాడంగి హైస్కూల్‌లో ప్రత్యే అవసరాల గల పిల్లలకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు


రామభద్రపురం చొక్కాపు వీధి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకొస్తోంది. ఈ మేరకు నాడు–నేడు, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, ఇంగ్లీషు మీడియం తప్పనిసరి చేసి అమలు చేస్తోంది. ఇలా విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి విద్యార్థుల డ్రాప్ అవుట్స్ తగ్గిస్తూ వారు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల హాజరు కోసం కొత్తగా స్టూడెంట్స్ అటెండెన్స్ యాప్‌ను రూపొందించింది. ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి 10 గంటల మధ్య ప్రతి పాఠశాలలో యాప్ ద్వారా ఉపాధ్యాయులు తరగతి గదిలో ప్రతి విద్యార్థి హాజరు నమోదు చేసి జిల్లా విద్యాశాఖాధికారికి పంపిస్తారు. హాజరు నమోదు కాని విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ మెసేజ్ వెళ్తుంది. దీని వల్ల ఇంట్లో బడికి వెళ్తున్నానని చెప్పి వెళ్లకుండా బయట తిరిగే ఆకతాయిల ఆటలకు చెక్ పడుతుంది. ఇటు ఉపాధ్యాయులు, అటు తల్లిదండ్రులకు విద్యార్థి ఎక్కడున్నాడో అర్థమవుతుంది. బడికి డుమ్మా కొట్టే అవకాశాలు తగ్గిపోతాయి.

అన్ని పాఠశాలల్లో యాప్‌లో అటెండెన్స్

జిల్లా వ్యాప్తంగా 3,252 పాఠశాలలు ఉండగా వాటిలో 1,68,140 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి ప్రతి రోజూ ఉపాధ్యాయులు ఉదయం 9గంటల నుంచి 10 గంటల మధ్య హాజరు తీసుకుంటారు. అటెండెన్స్ తీసుకున్న తర్వాత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తరగతుల వారీగా హాజరు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. గైర్హాజరైన విద్యార్థుల తల్లిందండ్రులకు తక్షణ సమాచారం వెళ్లడంతో స్కూల్ మానేసే విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గే అవకాశం ఉంటుంది. ఈ యాప్ అమలుతో విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు రావడం, అక్కడ ఎంత సేపు ఉంటున్నారనే అంశాలను ఈ యాప్ ద్వారా గుర్తించవచ్చు. తరచుగా స్కూల్ మానేసే పిల్లలపై ఉపాధ్యాయులు దృష్టిపెట్టి వారిని పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చే విధంగా చేసేందుకు అవకాశం ఉంటుందని పలువురు విద్యావేత్తలు, తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తంచేస్తునారు.


రామభద్రపురం ఉన్నత పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

విద్యార్థులు కచ్చితంగా హాజరవుతారు

పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య స్టూడెంట్స్ అటెండెన్స్ యాప్‌ను ఉపయోగిస్తున్నారు.దీని వల్ల స్కూల్‌కు రాని విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్‌లకు మెసేజ్ వెళ్తుంది. దీంతో విద్యార్థుల్లో కూడా భయం ఏర్పడి పాఠశాలలకు కచ్చితంగా హాజరవుతారు. ప్రతి రోజూ విద్యార్థిపై పర్యవేక్షణ ఉంటుంది.

ఎ తిరుమలప్రసాద్, ఎంఈవో, రామభద్రపురం

జేసీబీ కింద పడి వ్యక్తి ఆత్మహత్య


జేసీబీ కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన శ్రీను

బొండపల్లి: మండలంలోని కొండకిండాం గ్రామంలో గల క్వారీ వద్ద జేసీబీ (పొక్లెయినర్)ను స్టార్ట్ (అన్‌చేసి) దాని కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గరుడుబిల్లి గ్రామానికి చెందిన బుర్లె శ్రీను(30) కొద్ది సంవత్సరాలుగా కొండకిండాంలోని క్వారీలో జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం క్వారీ వద్ద గల జేసీబీని ఆన్‌చేసి ముందుకు వస్తున్న జేసీబీ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి మూడు సంవత్సరాల క్రితం పెళ్లి అయ్యింది. కుటుంబ కలహాలతో పాటు, కొన్ని ఆర్థికపరమైన సమస్యలు ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేసి ప్రాణం తీసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గజపతినగరం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మనస్తాపంతో యువకుడు...

విజయనగరం క్రైమ్: స్థానిక ప్రదీప్‌నగర్‌లో నివాసముంటున్న మనోజ్ కుమార్ (25) మనస్తాపంతో బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మనోజ్‌కుమార్ బీటెక్ వరకూ చదువుకున్నాడు. బ్యాంకింగ్‌కు సంబంధించి ఐబీపీఎస్ పరీక్షలు ఇటీవల రాశాడు. వాటి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. అందులో క్వాలిఫై కాకపోవడంతో మనస్తాపం చెంది బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కేంద్రాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మనోజ్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తల్లి జయలక్ష్మి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై విజయకుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నోడల్ సెంటర్‌గా ఎస్‌వీడీ కళాశాల

పార్వతీపురం టౌన్: స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నోడల్ రిసోర్స్ సెంటర్‌గా ఎంపిక చేసినట్లు కళాశాలల విద్యాశాఖ కమిషనర్ పోల భాస్కరరావు ఉత్తర్వులు జారీచేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు బుధవారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ,సాలూరు, వీరఘట్టం, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం కళాశాలలను, విజయనగరం జిల్లాలోని ఎస్‌కోట, చీపురుపల్లి, రాజాం, ఎంఆర్ సాంస్క్రీట్, విజయనగరం, గజపతినగరం కళాశాలలకు నోడల్ సెంటర్‌గా పార్వతీపురం ఎస్‌వీడీ కళాశాలను ఎంపిక చేశారని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో: ఇద్దరికి గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం కూడలి వద్ద బుధవారం సాయంత్రం జాతీయ రహదారిపై బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్.బూర్జవలస ఎస్సై జి.రాజేష్ తెలిపారు. రామభద్రపురం నుంచి పెదమానాపురం బైక్‌పై వస్తున్న శ్రీనివాస్‌ను గజపతినగరం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న ఆటో ఢీకొనడంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా విజయనగరం మహారాజా ఆస్పత్రికి 108లో తరలించినట్లు చెప్పారు. ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు స్వల్ప గాయాలవడంతో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించామన్నారు.

18న జాబ్‌మేళా

విజయనగరం పూల్‌బాగ్: హెచ్‌సీఎల్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఈనెల 18న స్థానిక గాజుల రేగలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐఓ ఎం.సత్యనారాయణ, డీవీఈఓ ఆర్ సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యేందుకు 2022-21-2021-22లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, ఎంపీసీలో 60 శాతం మార్కులు వచ్చిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎంపిక నిర్వహిస్తారని సెలెక్ట్ అయిన వారికి ఏడాది ఇంటర్న్‌షిప్ అనంతరం ఉద్యోగం కల్పిస్తారన్నారు. బిట్స్ పిలానీ, సస్త్ర, అమిటి యూనివర్సిటీలలో ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి క్వాంటిటీ టివ్ ఆప్టిట్యూడ్‌లో 10, లాజికల్ రీజనింగ్‌లో 10, వెర్బల్‌లో 10 ఉంటాయన్నారు. ప్రతి విభాగం నుంచి 4 మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్దేశిత అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుందన్నారు. ఈ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు పదవతరగతి, ఇంటర్‌మీడియట్ మార్కులలిస్టు, ఆధార్‌కార్డు జిరాక్స్‌కాపీలు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9441109636, 6301574739 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాణిశ్రీ

పార్వతీపురం టౌన్: భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం పెదభోగిలి గ్రామానికి చెందిన పల్లి వాణిశ్రీకి రామకృష్ణతో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భర్త ఆర్మీలో పనిచేస్తున్నాడు. మూడేళ్లుగా భార్యాపిల్లలను భర్త శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. ఆరు నెలుగా విధులకు హాజరు కాకుండా మద్యం మత్తులో తిరుగుతున్నాడు. దీంతో కొంతకాలంగా పిల్లల్ని తీసుకుని భర్తకు దూరంగా వాణిశ్రీ విజయనగరంలో ఉంటోంది. తనను పెంచిన అమ్మమ్మ చనిపోయిందని చివరి చూపుకోసం వాణిశ్రీ పెదభోగిలి రాగా విషయం తెలుసుకున్న రామకృష్ణ అక్కడికి వచ్చి అమ్మమ్మ వల్ల ఆమెకు వారసత్వంగా వచ్చిన 26సెంట్ల భూమిని అమ్మితే సుమారు రూ.కోటి వస్తుందని తెలుసుకున్నాడు. ఆ భూమి అమ్మేసిఒ రూ. 20లక్షలు తనకు ఇమ్మని భార్యను డిమాండ్ చేశాడు. దీంతో మనస్తాపం చెందిన వాణిశ్రీ ఇంట్లో ఉన్న చీమల మందు తాగేసింది. విషయం గమనించిన ఆమె మేనత్త వెంటనే 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	51,000-00
బంగారం(22సి. 10గ్రా.)	46,750-00
వెండి (కిలో)	60,400-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹ 280

కేజీబీవీ విద్యార్థినులకు విద్యుత్ షాక్

- ఒకరికి తీవ్రంగా, మరొకరికి స్వల్ప గాయాలు

భోగాపురం: మండలం కేంద్రంలోని కేజీబీవీలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు బుధవారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండలం కొటారివానిపాలెం గ్రామానికి చెందిన జయలక్ష్మి, పూసపాటిరేగ మండలం చల్లవానితోట గ్రామానికి చెందిన సరస్వతి మండల కేంద్రంలోని కేజీబీవీలో తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. పాఠశాలలో తరగతులు ముగియడంతో ఇద్దరు విద్యార్థినులు హాస్టల్ మేడపైన అరవేసిన దుస్తులను తీసుకునేందుకు సాయంత్రం 5 గంటలకు వెళ్లారు. మేడపైన అరవేసిన చున్నీ గాలికి ఎగిరి సన్‌స్లేడ్ వీద పడింది. ఇనుప రాడ్డుతో చున్నీని తీసేందుకు విద్యార్థినులు ప్రయత్నిస్తుండగా విద్యుత్ తీగకు ఇనప రాడ్డు తగలడంతో షాక్‌కు గురై ఒక్కసారిగా కింద పడిపోయారు. విషయం తెలుసుకున్న సీఆర్‌టీ కనకమహలక్ష్మి, డే వాచ్‌మన్ దుర్గాభవానిలు వెంటనే ఫోన్ ద్వారా ప్రిన్సిపాల్ బెహరా అరుణకు తెలియజేయగా ఆమె వెంటనే 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జయలక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ కేకేవీ విజయనాథ్, ఎస్సై కృష్ణమూర్తి, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఆర్ఐ రాజు పాఠశాలకు చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై సిబ్బందిని అడిగితెలుసుకుని విచారణ చేపట్టారు.

300 లీటర్ల సారా పట్టివేత


పట్టుకున్న సారాను చూపిస్తున్న రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి


పట్టుబడిన సారా, నిందితుడితో ఎస్సై జగదీష్‌నాయుడు

సాలూరు: మండలంలోని దత్తివలస సమీపంలో ఓ వ్యక్తి దగ్గర 300 లీటర్ల సారా పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు దత్తివలస గ్రామానికి చెందిన చప్పల శ్రీను ఆటోలో తరలిస్తున్న 15 క్యాన్లలో ఉన్న సారా పట్టుకున్నామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆటో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

80 లీటర్ల సారా సీజ్

కొమరాడ: మండలంలోని నయా పంచాయతీ గుడ్డం గ్రామానికి చెందిన కొండగొర్రి లక్ష్మణ సారా అమ్ముతున్నట్లు అందిన సమచారం మేరకు బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జగదీష్‌నాయుడు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నిందితుడి దగ్గర పట్టుబడిన 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై పేర్కొన్నారు.

సచివాలయ సేవల్లో ఈ-గవర్నెన్స్‌కు ప్రాధాన్యం

- సత్వర సేవలు, పారదర్శక పాలనకు వేదికగా వ్యవస్థ
- కేంద్ర బృందానికి వివరించిన కలెక్టర్ సూర్యకుమారి


కేంద్ర బృందానికి వివరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: సామాన్య ప్రజలకు సులభంగా..వేగంగా నాణ్యమైన సేవలందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు సుమారు 798 రకాల సేవలందిస్తోందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ పనితీరును పరిశీలించేందుకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు రాజు సరస్వత్, విజత్ ప్రకాశ్ భట్‌లు బుధవారం కలెక్టర్ సూర్యకుమారిని ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ పనితీరు, సామాన్య ప్రజలకు అందుతున్న సేవల గురించి వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఈ-గవర్నెన్స్ విధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ సేవలందిస్తున్నామని స్పష్టం చేశారు. మొత్తం సేవల్లో 540 సేవలకు సేవా పోర్టల్ ద్వారా, మరో 252 సేవలను సీఎస్‌సీ పోర్టల్ ద్వారా అందిస్తున్నామని కమిటీ సభ్యులకు తెలియజేశారు. జిల్లాలో 626 సచివాలయాల ద్వారా ఉన్నత చదువులు చదివిన సిబ్బంది సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే వారికి సహాయంగా క్షేత్ర స్థాయిలో వలంటీర్లు తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు.

ఎన్నో లక్ష్యాలను చేరుకున్నాం

సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి ఎన్నో లక్ష్యాలను చేరుకున్నామని కమిటీ సభ్యులకు కలెక్టర్ సూర్యకుమారి వెల్లడించారు. బాల్య వివాహాలను తగ్గించామని, రక్తహీనత సమస్యను అధిగమించామని, మధ్యలో బడిమానివేసే పిల్లల సంఖ్య బాగా తగ్గించామని, గృహ హింసను అరికట్టామని కరోనా సమయంలో నిర్ణీత కాలంలో జిల్లాలోని ప్రజలందరికీ వ్యాక్సినేషన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించగలిగామని వివరించారు. వాటితో పాటు వ్యవసాయ, వైద్య, విద్యారంగం సంబంధిత సేవలను సులభంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఆహార ఆధారిత పరిశ్రమలకు జిల్లా అనుకూలం

ఆహార సంబంధిత పరిశ్రమలు నెలకొల్పేందుకు జిల్లా చాలా అనుకూలమని అన్ని రకాల ఆహార ఉత్పత్తులు ఇక్కడ లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఆహార, వాణిజ్య పంటల గురించి కేంద్ర సభ్యులకు వివరించారు. జిల్లాలో ఎక్కువగా మామిడి, మొక్కజొన్న అందుబాటులో ఉంటుందని ఆ రెండు రకాల ఉత్పత్తులకు లాభదాయకమైన మార్కెటింగ్ పరిస్థితులు కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విధానంలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ఇటీవల కొన్ని ప్రతిపాదనలు కూడా రూపొందించామని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ఆహార సంబంధిత పరిశ్రమలు నెలకొల్పేందుకు ఉన్న అవకాశాలను, పరిస్థితులను కేంద్ర ప్రభుత్వానికి నివేదించి, తగిన సహాయ సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ మయూర్ అశోక్, సీపీఓ బాలాజీ, జెడ్పీ సీఈఓ అశోక్ కుమార్‌లు కేంద్ర కమిటీ సభ్యులకు సచివాలయ వ్యవస్థ రూపకల్పన, అందిస్తున్న సేవల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

జిల్లాలో మూడు రోజుల పాటు కమిటీ పర్యటన

సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలు, వ్యవస్థ పనితీరును పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన కమిటీ సభ్యులు మూడు రోజుల పాటు పర్యటించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయాలను సందర్శించి అక్కడ అందే సేవలపై పరిశీలిస్తారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పన్నులు చెల్లించండి

విజయనగరం: నగర ప్రజలందరూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ముగిసిన అర్ధ సంవత్సర కాల పరిమితికి సంబంధించిన పన్నులు చెల్లించాలని కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పన్నుల స్వీకరణకు ఈ నెల 15 నుంచి 30 వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు పన్ను సొమ్మును నగదుగా గాని లేదా ఫోన్ పే, గూగుల్ పే, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించుకోవచ్చన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



మార్కెట్‌లోని దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న ప్రజారోగ్య సిబ్బంది

విజయనగరం: ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు, వినియోగంపై ప్రజారోగ్య సిబ్బంది ప్రజలు, వర్తకులకు అవగాహన కల్పించారు. బుధవారం ఉదయం విజయనగరం మార్కెట్ ప్రాంతంలో కలియ తిరుగుతూ ప్లాస్టిక్ వస్తువుల విక్రయదారులను హెచ్చరిస్తూ, సరుకులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పాలిథిన్ కవర్లు, ఇతర పాలిథిన్ ఉత్పత్తులను వినియోగిస్తున్న ప్రజలను చైతన్యపరిచారు. పారిశుధ్య పర్యవేక్షకుల ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శులు ఒక టీమ్‌గా ఏర్పడి, నగరంలోని అనేక ప్రాంతాలలో పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుద్ధులు కావాలి

విజయనగరం టౌన్: క్రీస్తును స్తుతించి ప్రతి ఒక్కరూ పరిశుద్ధులు కావాలని ప్రముఖ సువార్త గాయకుడు డాక్టర్ ఆకుమర్తి డేనియల్ అన్నారు. బుధవారం స్థానిక స్టేడియం కాలనీలో నిర్వహించిన క్రీస్తు ఆరాధకుల కూటమి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీసెస్ బ్లెస్సింగ్ చర్చ్ రెవరెండ్ నిర్మల మందిరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డేనియల్‌ను సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, తదితరులు సత్కరించారు.

నిబంధనలు తప్పనిసరి



లారీల యజమానులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై దామోధరరావు

విజయనగరం క్రైమ్: లారీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఎస్సై దామోధరరావు సూచించారు. దాసన్నపేట నల్లచెరువు వద్ద లారీ అసోసియేషన్ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించడం, పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులేర్పడుతున్నాయన్నారు. కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలు నిలిపివేయాలని సూచించారు. అలాగే వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్సైలు భాస్కరరావు, హరిబాబునాయుడు, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి కోటేశ్వరరావు, లారీల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

శిశుగృహలో విజిలెన్స్ తనిఖీలు

విజయనగరం ఫోర్ట్: నగరంలోని కేఎల్‌పురంలోని శిశుగృహలో విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు బుధవారం తనిఖీలు నిర్వహించారు. శిశుగృహకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులెంత.. ఇంతవరకు ఎంత ఖర్చయింది.. డొనేషన్లు ఎంత వచ్చాయి.. తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా స్త్రీ, శిశు సాధికారత అధికారిణి బి. శాంతకుమారితో సమావేశమై శిశు గృహ నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని

భోగాపురం: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తులకు ఆదుకుని ప్రాణదాతలు కావాలని మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అర్జునరావు సూచించారు. ఏపీ ఉన్నతి విద్యామండలి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాసరావు బెహర, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ చల్లా త్రినాథరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- నగర పంచాయతీకి రూ. 34.97 కోట్ల ఏఐఐబీ నిధులు
- ట్యాంక్‌లు, వాటర్ గ్యాలరీలు, కుళాయిల ఏర్పాటుకు సన్నాహాలు
- త్వరలోనే పనుల ప్రారంభానికి చర్యలు

తాగునీరు ఇక పుష్కలం..



నెల్లిమర్ల: నగర పంచాయతీ ప్రజలకు పుష్కలంగా తాగునీటిని సరఫరా చేయడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోంది. పట్టణంలోని 20 వార్డులకు ఇప్పటికే ఎటువంటి అడ్డంకులు లేకుండా తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ భవిష్యత్‌లో శతశాతం అందించడానికి అవసరమైన అన్ని చర్యలనూ చేపడుతోంది. ఈ మేరకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) ద్వారా మంజూరైన రూ. 34.97 కోట్ల నిధులతో పట్టణంలో తాగునీటి ట్యాంకులు, ఇన్‌ఫిల్టరేషన్ బావులు, వాటర్ గ్యాలరీలు, పైపులైన్లు, కుళాయిల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో భవిష్యత్‌లో కూడా నెల్లిమర్ల పట్టణవాసులకు పుష్కలంగా తాగునీరు అందనుంది. వివరాల్లోకి వెళితే.. నెల్లిమర్ల, జరజాపుపేట మేజరు పంచాయతీలను కలిపి నెల్లిమర్ల నగర పంచాయతీగా 2013లో ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఇక్కడ 20 వార్డులున్నాయి. ప్రారంభంలో 21 వేల ఉన్న జనాభా ప్రస్తుతం 30వేలకు చేరింది. పట్టణవాసులకు తాగునీటిని సరఫరా చేయడానికి ప్రస్తుతం మూడు పథకాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఉన్న వాటిలో థామస్‌పేట పథకం పాడవడంతో అక్కడి నుంచి పంపింగ్ నిలిపివేశారు. చంపావతి నదిలోనున్న రెండు ఊటబావులతో పాటు స్టేట్‌బ్యాంక్ వద్దనున్న నేల బావి నుంచి ట్యాంకులకు నీటిని ఎక్కించి, కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కొండపేట, డైట్ కాలనీ, ఎల్‌డీ పేట, తదితర ప్రాంతాల్లో బోర్లను తవ్వించి, అక్కడికక్కడే తాగునీటిని అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణానికి మరింత పుష్కలంగా తాగునీరు సరఫరా చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. దీని కోసం ఏఐఐబీ ద్వారా అవసరమైన నిధులను మంజూరు చేయించింది.

చేపట్టనున్న పనులివే

ఏఐఐబీ మంజూరు చేసిన నిధులతో నగర పంచాయతీలో మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్మిస్తారు. చంద్రబాబు కాలనీలో 300 కేఎల్, జరజాపుపేటలో 500 కేఎల్, కొండపేటలో 200 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంక్‌ల నిర్మాణం చేపడతారు. స్థానిక చంపావతి నదిలో మూడు ఇన్‌ఫిల్టరేషన్ బావులను నిర్మించి, అక్కడ్నుంచి సదరు ట్యాంక్‌లకు నీటిని ఎక్కిస్తారు. వేసవిలో సైతం నీరు నిల్వ ఉండేలా నదిలో వాటర్ గ్యాలరీలను ఏర్పాటు చేస్తారు. ఈ నిర్మాణాలు పూర్తయిన తర్వాత అవసరమైన వార్డుల్లో వీధి కుళాయిలతో పాటు ఇంటింటి కుళాయిల ద్వారా సరఫరా చేస్తారు.

ఏడేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు

నగర పంచాయతీలో ఏఐఐబీ నిధులతో చేపట్టే పనుల కాంట్రాక్ట్‌ను ఎన్‌సీసీ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ దక్కించుకుంది. పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు పనులను పర్యవేక్షిస్తారు. ఈ మేరకు చంపావతి నదిలో ఎక్కడెక్కడ ఊటబావులు, వాటర్ గ్యాలరీలు నిర్మించాలనే విషయమై సంబంధిత అధికారులు తాజాగా పరిశీలించారు. అలాగే ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్మించే స్థలాలను తనిఖీచేశారు. వచ్చే నెలలో పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

నిధులు మంజూరు..



నెల్లిమర్ల నగర పంచాయతీలో తాగునీటి సౌకర్యాలకు ప్రభుత్వం ఏఐఐబీ నిధులు రూ 34.97 కోట్లు మంజూరుచేసింది. సదరు నిధులతో ట్యాంక్‌లు, పైప్‌లైన్, ఊట బావులు, కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు పర్యవేక్షణలో పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. పనులు పూర్తయితే భవిష్యత్‌లో పట్టణ వాసులకు తాగునీటికి ఇబ్బంది ఉండదు.

– పి. బాలాజీప్రసాద్, కమిషనర్, నెల్లిమర్ల నగరపంచాయతీ.

నిధులున్నా పనులు ప్రారంభించని టీడీపీ ప్రభుత్వం

తాగునీటి సౌకర్యాల కల్పనకు నిధులున్నప్పటికీ గత టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించలేదు. 2019లో అప్పటి ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు హడావుడిగా శంకుస్థాపన చేశారు. అనంతరం పనులు ప్రారంభించకుండా వదిలేశారు. దీంతో ఏఐఐబీ నిధులతో చేపట్టాల్సిన పనులు కేవలం శిలాఫలకానికే పరిమితమయ్యాయి. ఒక్క పథకమూ నిర్మించకపోవడంతో టీడీపీ ఐదేళ్ల పాలనలో వేసవిలో పట్టణవాసులు తాగునీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నిధులను మళ్లీ మంజూరుచేయించి, పనులు ప్రారంభిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కింది.

6ఏ కేసుపై విచారణ



ముంజేరు సచివాలయంలో విచారణ చేపడుతున్న విశాఖపట్నం జిల్లా డీఎస్ఓ సూర్యప్రకాశరావు

భోగాపురం: విశాఖపట్నం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి జి.సూర్యప్రకాశరావు విశాఖపట్నం జిల్లాలో నమోదైన 6ఏ కేసుకు సంబంధించి మండలంలోని ముంజేరు గ్రామ సచివాయలంలో బుధవారం విచారణ చేట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2022 మే 22న విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం మద్ది గ్రామంలో ఉన్న శ్రీసాయిలక్ష్మి అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్‌పై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో సరైన పత్రాలు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన 53 క్వింటాళ్ల బియ్యం బస్తాలతో పాటు మిల్లులో పోగు వేసిన 112 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించామని తెలిపారు. దీనిపై రైస్‌మిల్ నిర్వాహకుడిని ప్రశ్నించగా, విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన 12 మంది రైతులతో నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పాడన్నారు. ఈ మేరకు విశాఖపట్నం జిల్లా జేసీ కేఎస్ఎస్.విశ్వనాథ్ ఆదేశాల మేరకు ముంజేరు సర్పంచ్ పూడిక నూకరాజు ఆధ్వర్యంలో రైతులను విచారించినట్లు చెప్పారు. అయితే రైతులెవ్వరూ మిల్లు యజమానికి ధాన్యం అమ్మలేదని విచారణలో తేలిందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా సీఎస్‌డీటీ కృష్ణారావు, వ్యవసాయ సహాయకురాలు రాధ, ఉప సర్పంచ్ పిడుగు ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, క్షేత్ర సహాయకులు

విజయనగరం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని క్షేత్ర సహాయకుల యూనియన్ కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. విజయనగరం ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో రమణ అధ్యక్షతన క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి ఎ.జగన్‌మోహనరావు, కార్యదర్శి రమణ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం విజయవంతం కావడం వెనుక క్షేత్ర సహాయకుల పాత్ర కీలకమైనదన్నారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో క్షేత్ర సహాయకులకు రూ. 20 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతకు అందరం ఐక్యంగా ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20న కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన జీవన విధానం

- కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: సమాజ నిర్మాణంలో సమూల మార్పులు తీసుకొచ్చి మెరుగైన జీవన విధానానికి నాంది పలికేందుకే ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను రూపొందించిందని కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. నగరంలోని 32, 34వ సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, స్పందన వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. బాగా అభివృద్ధి చెందిన దేశంలో ఈ తరహా వ్యవస్థలు అమలవడంతో ప్రజా జీవనంలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ వల్ల కూడా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్యదర్శులు కేవలం తమది ఉద్యోగ బాధ్యత గానే కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.

రుణాలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు

- వైఎస్సార్ క్రాంతిపథం ఏసీ సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ సీతారామయ్య

నెల్లిమర్ల: వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా తీసుకునే రుణాలను మహిళలంతా సద్వినియోగం చేసుకునేలా గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, సహాయకులు అవగాహన కల్పించాలని ఆ పథకం ఏరియా కో ఆర్డినేటర్ జి. సీతారామయ్య సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రుణాలను వినియోగించుకుని, స్వయం సహాయక సంఘాలన్నీ ఆర్థికంగా బలోపేతమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన లబ్ధిదారులకు బ్యాంక్ రుణాలు ఇప్పించాలని సూచించారు. ఏపీఎం ఎల్. సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో స్త్రీనిధి మేనేజరు వై. ఎర్రినాయుడు, ఎస్‌వీఈపీ ఏపీఎం పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి సంస్థ వితరణ



విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్న సంస్థ సభ్యులు

విజయనగరం రూరల్: విజయనగరానికి చెందిన షిర్డీ సాయి సంస్థ విద్యార్థులకు అమృత హస్తం (అల్పాహారం) పథకాన్ని అందిస్తూ ధాతృత్వాన్ని చాటుకుంటోంది. కార్పొరేషన్ పరిధిలోని జమ్ము మండల ప్రాథమిక పాఠశాలలో 2022–23 సంవత్సరానికి గాను బుధవారం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించింది. నాలుగేళ్లుగా ఈ పథకంలో భాగంగా విద్యార్థులకు ప్రతి రోజూ అల్పాహారాన్ని అందిస్తోంది. ఈ ఏడాది సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందించడం జరుగుతుందని సంస్థ నిర్వాహకుడు కె.హరగోపాల్ తెలిపారు. అనంతరం ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులకు పలక, భోజనం పళ్లాలు, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రామ్మోహన్, ఉపాధ్యాయులు అనురాధ, ప్రశాంత్ కుమార్, ఎస్ఎంసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాలు భేష్

- కేంద్ర బృందం ప్రశంసలు



రైతుభరోసా కేంద్రం వద్ద కేంద్ర బృంద సభ్యులు, జిల్లా అధికారులు

విజయనగరం రూరల్: రైతు ప్రయోజనాలే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన రైతుభరోసా కేంద్రాల పనితీరును కేంద్ర బృందం ప్రశంసించింది. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం విజయనగరం మండలం దుప్పాడ గ్రామంలోని రైతుభరోసా కేంద్రాన్ని కేంద్ర బృంద సభ్యులు రాజు సరస్వత్, విజత్ ప్రకాష్‌భట్ పరిశీలించారు. ఒక చిన్న గ్రామంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రైతుల ఇంటి ముంగిటకే సేవలందించడంపై వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులకు అందుతున్న సేవల వివరాలను పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కియోస్క్ యంత్రం ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారకాల కేటాయింపు, ఈ క్రాప్ నమోదు, రైతులు, వారి భూముల వివరాలు, తదితర వాటిని పరిశీలించారు. విత్తనాలు, ఎరువులకు రైతులు డిజిటల్ పేమెంట్ చేసే అవకాశం ఉండడంపై దేశంలో ఇలాంటి విధానం ఎక్కడా లేదని ప్రశంసించారు. పసల్ బీమా యోజన పథకంలో భాగంగా పంటలకు కల్పిస్తున్న బీమాపై ఆరా తీశారు. గోదాం సదుపాయం, స్టాకు వివరాలు కియోస్క్‌లో పరిశీలించారు. అలాగే గ్రామంలో పశు సంపద, పాల ఉత్పత్తి, వినియోగంపై ఆరా తీశారు. మండలంలో ఉన్న ఆర్‌బీకేలు, వాటి ద్వారా రైతులకు సేవలందిస్తున్న సిబ్బంది వివరాలు, అధికారుల పర్యవేక్షణ వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. పంటల కొనుగోలు, గిట్టుబాటు ధరపై ప్రశ్నించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, పశు సంవర్ధక సహాయకులతో మాట్లాడారు. వారి విద్యార్హతలు, అనుభవం, రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ, జిల్లా ఉద్యానవన శాఖాధికారి జమదగ్ని, జిల్లా సచివాలయాల సేవల సమన్వయకర్త అశోక్, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చార్మినార్ సెట్



టొంపలపేటలో ఏర్పాటు చేసిన చార్మినార్ సెట్

నెల్లిమర్ల రూరల్:

గణేష్ ఉత్సవాల్లో భాగంగా నెల్లిమర్ల మండలంలోని టొంపలపేటలో ఏర్పాటు చేసిన వినాయకుడి సెట్ ఆకట్టుకుంటోంది. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చార్మినార్ ఆకారంలో మంటపం ఏర్పాటు చేసి విద్యుత్ కాంతులతో అలంకరించారు. నెల్లిమర్ల–రణస్థలం ప్రధాన రహదారి కావడంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు చార్మినార్ సెట్ వద్ద సెల్ఫీలు దిగుతున్నారు.

విద్య, వైద్య రంగాల్లో బాలరాజు కృషి అమోఘం

- నేచర్ సంస్థ ప్రతినిధి బంగారుబాబు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న బంగారుబాబు

విజయనగరం ఫోర్ట్:

నేచర్ సంస్థ స్వర్గీయ బాలరాజు విద్య, వైద్య రంగాల్లో చేసిన కృషి అమోఘమని సంస్థ ప్రతినిధి బంగారుబాబు తెలిపారు. బుధవారం స్థానిక నేచర్ సంస్థ కార్యాలయంలో స్వర్గీయ బాలరాజు ద్వితీయ వర్ధంతి కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారుబాబు మాట్లాడుతూ, హెచ్ఐవీ అంటే భయపడిన రోజుల్లోనే బాలసహయోగ ప్రాజెక్ట్ ద్వారా బాలరాజు ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేచర్ సంస్థ ప్రతినిధులు మీనా, దుర్గ, కృష్ణారావు, చంద్రశేఖర్, సుబ్బలక్ష్మి, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

నెల్లిమర్ల రూరల్:

మండలంలోని బొప్పడాం ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో అలరించారు. హిందీ ప్రాముఖ్యతను వివరిస్తూ 50 మంది విద్యార్థులు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నగేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కారిపోతున్న అంగన్‌వాడీ కేంద్రం



కేంద్రంలో వర్షం నీరు

భోగాపురం: మండలంలోని ముంజేరు పంచాయతీ సబ్బన్నపేటలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్‌కు భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా ప్రాథమిక పాఠశాలకు చెందిన వంట గదిలో సెంటర్ నిర్వహిస్తున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వంటగది కారిపోతోంది. కనీసం కూర్చోవడానికి కూడా వీల్లేకపోవడంతో బుధవారం కేంద్రానికి వచ్చిన చిన్నారులను ఇంటికి పంపించేశారు.

జేఎన్‌టీయూ వీసీ రాక రేపు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ – విజయనగరం యూనివర్సిటీ వీసీగా అదనపు బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు యూనివర్సిటీకి శుక్రవారం రానున్నారని వర్సిటీ రిజిస్ట్రార్ జి.స్వామినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన యూనివర్సిటీ అభివృద్ధి పనులపై సమీక్షిస్తారని పేర్కొన్నారు. మంజూరైన నిధుల వినియోగం కోసం బిల్డింగ్ కమిటీ ఏర్పాటు, యూనివర్సిటీ లోగో విడుదల, వెబ్‌సైట్ లాగిన్, ఏటీపీఎల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తారని తెలిపారు.

నేటి నుంచి ఆందోళన కార్యక్రమాలు

విజయనగరం పూల్‌బాగ్: బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నేటి నుంచి 24 వరకు చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలతో పాటు 27న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వి. లక్ష్మి, రెడ్డి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకు జీపీఎస్ వద్దు..

విజయనగరం పూల్‌బాగ్: ఆటోలకు జీపీఎస్ ట్రాకర్ల ఏర్పాటును తప్పనిసరి చేయొద్దని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎ. జగన్‌మోహనరావు కోరారు. బుధవారం స్థానిక కోట జంక్షన్ వద్ద డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె. సురేష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రాముడు, శ్రీను, బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ గణపతి హోమం

విజయనగరం టౌన్: నగరంలోని హుకుంపేట ముత్యాల గణపతి యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 25 శిరస్సులు కలిగిన గణనాథునికి బుధవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎంపీ కొత్తపల్లి గీత అరెస్టు

- ఆమె భర్త రామకోటేశ్వరరావు కూడా..
- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన కేసులో ఇద్దరికీ 5 ఏళ్లు జైలు శిక్ష

సాక్షి, హైదరాబాద్/సాక్షి, పాడేరు: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను మోసం చేసిన కేసులో అరకు మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు కొత్తపల్లి గీత, ఆమె భర్త పి.రామకోటేశ్వరరావును సీబీఐ అధికారులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. తప్పుడు పత్రాలతో పీఎన్‌బీ నుంచి రుణం తీసుకొని, దానిని ఇతర అవసరాలకు మళ్లించారన్న ఫిర్యాదుపై నమోదైన కేసులో వీరిద్దరికి హైదరాబాద్ సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చింది. వీరికి సహకరించిన బ్యాంక్ అధికారులు బీకే జయప్రకాశన్, కేకే అరవిందాక్షన్‌లకు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. విశ్వేశ్వర ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.2 లక్షల జరిమానా విధించింది.గీత, రామకోటేశ్వరరావు డైరెక్టర్లుగా ఉన్న విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లోని పీఎన్‌బీ బంజారాహిల్స్ బ్రాంచ్ నుంచి 2008 డిసెంబర్ 30న రూ.42.79 కోట్లు రుణం తీసుకుంది. బ్యాంకు అధికారులతో కుమ్మక్కై తప్పుడు పత్రాలు సమర్పించి ఈ రుణం పొందారని, ఆ డబ్బును ఇతర అవసరాలకు మళ్లించి మోసం చేశారని పీఎన్‌బీ అధికారులు గుర్తించారు. వారి ఫిర్యాదు మేరకు కొత్తపల్లి గీత, పి.రామకోటేశ్వరరావు, విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, బ్యాంక్ అధికారులు జయప్రకాశన్, అరవిందాక్షన్‌తో పాటు డాక్యుమెంట్లు తయారు చేసిన ఎస్.రాజ్‌కుమార్‌పై బెంగళూరులోని సీబీఐ బ్యాంకింగ్ నేరాల విభాగం 2015 జూన్‌లో కేసు నమోదు చేసింది. 2015 జూలైలో సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది. సీబీఐ అధికారులు అదే రోజు రాత్రి రామకోటేశ్వరరావు, జయప్రకాశన్, అరవిందాక్షన్‌లను అరెస్టు చేసి, చంచల్‌గూడ జైలుకు తరలించారు. కొత్తపల్లి గీతను బుధవారం అరెస్టు చేసి చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించినట్లు సమాచారం.

గ్రూప్–1 అధికారి నుంచి రాజకీయాల్లోకి

గ్రూపు–1 అధికారి అయిన కొత్తపల్లి గీత గతంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం రాజకీయాల్లో చేరారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున అరకు ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి, చివరకు పార్టీని వీడారు. అనంతరం ఆమె జనజాగృతి పార్టీని స్థాపించి కొన్నాళ్లు తెలుగుదేశం పార్టీకి అనుబంధంగా పనిచేశారు. ఆమెకు ప్రజాదరణ కరవవడంతో ఆ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్నారు.

వికేంద్రీకరణే..!

▶ మొదటి పేజీ తరువాయి

సాకారం చేసిన మహా సామాజిక విప్లవం గురించి మాట్లాడనుంది. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సింహభాగం పదవులు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తమదేనని చాటనుంది. 2019 ఎన్నికల్లో 50 శాతానికిపైగా ఓట్లు.. 151 శాసనసభ స్థానాలు, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు ఆఖండ విజయాన్ని చేకూర్చారు. 2019 మే 30న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించాక.. ఎన్నికల మేనిఫెస్టో అమలు, అభివృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించారు. ఇప్పటికే 98.44 శాతం హామీలను అమలు చేసి.. ఎన్నికల మేనిఫెస్టోకు అసలైన నిర్వచనం చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి.. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి.. ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. 1.30 లక్షల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించారు. ఇటీవల వీరి ప్రొబేషన్ కూడా పూర్తి కావడంతో పూర్తి స్థాయిలో వేతనాలు ఇస్తున్నారు. ప్రజల సౌకర్యం, పరిపాలనా సౌలభ్యం కోసం 13 జిల్లాల స్థానంలో కొత్తగా 26 జిల్లాలను ఏర్పాటు చేసి పరిపాలనను వికేంద్రీకరించారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (నగదు బదిలీ) రూపంలోనే లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1.65 లక్షల కోట్లు జమ చేశారు. రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు.

అక్కచెల్లెమ్మలకు అన్ని విధాలా ఆసరా

2014 ఎన్నికల తర్వాత బాబు మోసంతో డ్వాక్రా సంఘాలన్నీ అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఈ పరిస్థితిలో తన పాదయాత్రలో అక్కచెల్లెమ్మల కష్టాలు కళ్లారా చూసిన వైఎస్ జగన్ వారిని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఎన్నికల నాటి వరకు బ్యాంకుల్లో ఉన్న వారి అప్పులను నాలుగు విడతలుగా చెల్లిస్తూ వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేశారు. దీనికి తోడు 45 ఏళ్ల వయసు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750.. వరుసగా నాలుగేళ్లు ఇస్తూ వైఎస్సార్ చేయూత పథకానికి శ్రీకారం చుట్టారు. చిరు వ్యాపారాల ద్వారా మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సహించారు.

పండుగలా వ్యవసాయం.. కాదనగలరా?

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారు. ఒక దశలో వ్యవసాయం దండగ అని చెప్పారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే 'బాబు మాటలు తప్పు' అని నిరూపిస్తూ విప్లవాత్మక సంస్కరణలు, మార్పులు తీసుకొచ్చారు. రైతు భరోసా పథకంతో రైతన్నలకు పెట్టుబడి సాయం అందిస్తూ వస్తున్నారు. 10,750 ఆర్బీకే (రైతు భరోసా కేంద్రం)లు ఏర్పాటు చేసి రైతులకు విత్తనం మొదలు పంట కొనుగోలు వరకు అండగా నిలుస్తున్నారు. 7.13 లక్షల మంది రైతులకు వ్యక్తిగత యంత్ర పరికరాలు అందజేసేలా కార్యాచరణ రూపొందించారు.

మన పిల్లలు గ్లోబల్ స్టూడెంట్స్..

'పేద పిల్లలకు మనం ఇవ్వగలిగే ఆస్తి ఒక్క చదువు మాత్రమే. వారిని ఉన్నత చదువులు చదివిస్తే అది వారి తల రాత మారుస్తుంది' అని గట్టిగా నమ్మిన సీఎం వైఎస్ జగన్ ఆ దిశగా విప్లవాత్మక పథకాలు, కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అమ్మ ఒడి, సంపూర్ణ పోషణ, గోరుముద్ద, విద్యా కానుక, మనబడి నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, సబ్జెక్ట్ టీచర్స్ కాన్సెప్ట్, బైజూస్‌తో ఒప్పందం, ఎనిమిదవ తరగతి పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, బై లింగువల్ టెక్ట్స్ బుక్స్ పంపిణీ, టీచర్లకు స్కిల్స్ అప్‌గ్రేడేషన్ ప్రోగ్రాం, ఉన్నత విద్యలో విద్యా దీవెన, వసతి దీవెన, కరిక్యులమ్‌లో మార్పులు చేపట్టారు. ఇలా వీటన్నింటి కోసం ఈ మూడేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏకంగా రూ.53 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలన్న లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తున్నారు. 2025లో సీబీఎస్ఈ బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యేలా ఈ నవంబర్‌లో 8వ తరగతి విద్యార్థులు 4.72 లక్షల మందికి రూ.606.18 కోట్ల ఖర్చుతో బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారు. వీరికి విద్యను బోధించే 50,194 మంది టీచర్లకూ రూ.64.46 కోట్లతో ట్యాబ్‌లు ఇవ్వనున్నారు.

మీ ఆరోగ్యం.. మా బాధ్యత

ప్రభుత్వ ఆస్పత్రులను నాడు–నేడు కింద ఆధునికీకరించి.. మెరుగైన వైద్యం అందించే దిశగా పలు చర్యలు తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఎవరూ ఊహించని విధంగా పలు మార్పులు చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొంది.. విశ్రాంతి తీసుకునే సమయంలో వైద్యుల సూచన మేరకు ఆరోగ్య ఆసరా పథకం కింద సాయం చేస్తున్నారు. కొత్తగా 16 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, పీహెచ్‌సీల ద్వారా కొత్తగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. తద్వారా గ్రామీణుల ముంగిటకు వైద్యాన్ని తీసుకెళ్లారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాల దిశగా అడుగులు

ఇన్ఫోసిస్, అసెంచర్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ వంటి ఐటీ దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో కొత్తగా కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నాయి. మరెన్నో చిన్న, మధ్య స్థాయి కంపెనీలు యూనిట్లు ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో ఐటీ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర పారిశ్రామిక రంగంలో నూతన శకాన్ని లిఖిస్తూ రూ.1,26,622.23 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఒక్క గ్రీన్ ఎనర్జీ రంగంలోనే రూ.81,043 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. సత్యవీడు, కొప్పర్తి సెజ్‌లలోని పరిశ్రమల్లో లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకున్నారు.

నాటికి, నేటికి ఎంత తేడా!

టీడీపీ సర్కార్ హయాంలో ఏ సంక్షేమ పథకం కింద లబ్ధి పొందాలన్నా.. జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అర్హతే ప్రమాణికంగా ఇతర పార్టీలకు ఓట్లేసిన వారికి సైతం సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి.. ప్రతి ఇంటికీ వెళ్లి చేసిన మంచిని వివరించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఎమ్మెల్యేలు ఇలా ప్రజల మధ్యకు వెళ్లినప్పుడు వారు ఏవైనా సమస్యలు చెబితే వాటిని పరిష్కరించడానికి, అక్కడ ప్రాధాన్యత పనులను తక్షణమే చేపట్టడానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నారు.

అన్ని ప్రాంతాలూ అభివృద్ధి కావాలి

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలతో పాటు అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధిలో భాగంగా వికేంద్రీకరణ ద్వారా మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అమరావతిని శాసన రాజధానిగా, విశాఖను పరిపాలన రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా చేయాలని భావిస్తున్న విషయం తెలిసిందే. అభివృద్ధితో పాటు పాలన వికేంద్రీకరణ దిశగా అడుగులు వేయాల్సిన ఆవశ్యకత గురించి వివరించనుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్క హైదరాబాద్‌ను మాత్రమే అభివృద్ధి చేయడంతో రాష్ట్ర విభజనతో మనకు ఎంతగా నష్టం జరిగిందో స్పష్టమవుతోంది. లక్షల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇలాంటి పొరపాటు ఇకపై జరక్కుండా ఉండాలంటే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడం అత్యంత ఆవశ్యకం అనే విషయం గురించి పాలక పక్షం సభలో స్పష్టీకరించనుంది. అభివృద్ధి అంతా ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం అవ్వడం ద్వారా కలిగే చేటు గురించి ఉదాహరణలతో వివరించాలని నిర్ణయించింది.

9 గంటలకు అసెంబ్లీ

గురువారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీ, 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రశ్నోత్తరాలతో పాటు ఇటీవల మృతి చెందిన మాజీ సభ్యులకు సంతాప తీర్మానాలతో ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీ, మండలి సమావేశాలు ఐదు రోజుల పాటు జరిగే అవకాశం ఉంది. ప్రశ్నోత్తరాల అనంతరం శాసన సభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశమై, సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలి.. ఏయే అంశాలను చర్చకు చేపట్టాలో ఖరారు చేయనుంది. అసెంబ్లీ ఉప సభాపతిగా అధికార పక్షం ఇప్పటికే విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉప సభాపతి ఎన్నిక ఏ తేదీన చేపట్టాలో కూడా శాసన సభా వ్యవహారాల సలహా కమిటీలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

గ్రామాల్లో నేటి నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

అక్టోబరు 2 వరకు రోజుకో అంశంపై అవగాహన

సాక్షి, అమరావతి: స్వచ్ఛ భారత్‌లో భాగంగా గురువారం నుంచి పంచాయతీరాజ్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో 16 రోజులపాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతోంది. గ్రామాల్లో సైతం పట్టణాల తరహాలో ఇంటింటా చెత్త సేకరణతో పాటు పూర్తి పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు 2 నుంచి జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా వ్యక్తిగత ఆరోగ్యం, సామాజిక ప్రయోజనాల గురించి ప్రజలకు వివరిస్తారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పే సమస్యలు, అభిప్రాయాలతో సర్పంచి, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో గ్రామ పరిశుభ్రత ప్రణాళిక రూపొందిస్తారు. అక్టోబరు 2న ప్రత్యేక గ్రామ సభ ఏర్పాటు చేసి ఈ ప్రణాళికకు ఆమోదం తీసుకుంటారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

16 రోజుల పాటు జరిగే రోజువారీ కార్యక్రమాలు..

సెప్టెంబరు 15 : పంచాయతీలవారీగా స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ పెద్దలు, పొదుపు సంఘాల మహిళలు సమావేశమై ఆ గ్రామంలో నిర్వహించే కార్యక్రమాలపై చర్చిస్తారు.
సెప్టెంబరు 16 : స్థానికులతో కలిసి పారిశుద్ధ్యంపై ర్యాలీలు
సెప్టెంబరు 17 : గ్రామ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కలిసి గ్రామంలో పరిశుభ్ర ప్రాంతాల సందర్శన, వాటి శుభ్రతకు చర్యలు
సెప్టెంబరు 19 : ప్రత్యేకంగా రోడ్ల శుభ్రం చేసే కార్యక్రమాలు
సెప్టెంబరు 20 : గ్రామంలో ఎక్కువ చెత్త వేసే అవకాశం ఉన్న వ్యక్తుల నుంచి గ్రామం పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరిస్తామని హామీ తీసుకునే కార్యక్రమాలు
సెప్టెంబరు 21 : గ్రామంలోని పారిశుద్ధ్య యంత్రాల పనితీరు పరిశీలన
సెప్టెంబరు 22 : స్థానిక ప్రజాప్రతినిధులు చెత్త శుద్ధి కేంద్రాల సందర్శన
సెప్టెంబరు 23 : ఇంటింటి నుంచి చెత్తను సేకరించే క్లాప్ మిత్రలకు మరో విడత అవగాహన కార్యక్రమాలు
సెప్టెంబరు 24 : గ్రామంలో రోడ్లపై నీటి నిల్వకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో శుభ్రం చేసే కార్యక్రమాలు
సెప్టెంబరు 26 : మంచి నీటి చెరువులు, బోర్లు, బావుల పరిసర ప్రాంతాలను శుభ్రం చేసే కార్యక్రమాలు
సెప్టెంబరు 27 : ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన కార్యక్రమాలు
సెప్టెంబరు 28 : గ్రామంలో జరిగే పారిశుద్ధ్య కార్యక్రమాల్లో విద్యార్థులను, ఎన్జీవోలను భాగస్వామ్యం చేయడం
సెప్టెంబరు 29 : గ్రామంలోని పాఠశాలలో పారిశుద్ధ్యంపై క్విజ్, డిబేట్ తదితర పోటీలు
సెప్టెంబరు 30 : గ్రామంలోని ప్రముఖుల భాగస్వామ్యంతో గ్రామ పరిశుభ్రత ప్రణాళికపై చర్చ
అక్టోబరు 01 : గ్రామంలోని అందరి భాగస్వామ్యంతో గ్రామ పరిశుభ్రత ప్రణాళికకు తుది రూపు
అక్టోబరు 02 : ప్రత్యేక గ్రామ సభలో గ్రామ పరిశుభ్రత ప్రణాళికకు ఆమోదం

కొత్తగా 4 వేల డిజిటల్ లైబ్రరీలు

- గ్రామ, వార్డు సచివాలయాలకు అనుబంధంగా గ్రంథాలయాలు
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

అమరావతి: రాష్ట్రంలో త్వరలో 4 వేల డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయనున్నట్లు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ప్రతి గ్రామ/వార్డు సచివాలయానికి అనుబంధంగా ఒక గ్రంథాలయం ఉండాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన అని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో సీఎం ఉన్నారని, విద్యార్థులకు అందుబాటులో ఉండేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దాలని చెప్పారు. మంత్రి బొత్స బుధవారం జిల్లా గ్రంథాలయాల చైర్మన్లు, కార్యదర్శులతో గ్రంథాలయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గ్రంథాలయాల అప్‌గ్రేడేషన్, మరమ్మతులు తదితర అంశాలపై ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని అన్నారు. లైబ్రరీల్లో ఉన్న సమస్యలు పరిష్కారిస్తామని చెప్పారు. చైర్మన్లు, కార్యదర్శులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజల్లో.. ప్రధానంగా విద్యార్థుల్లో చదివే జిజ్ఞాస పెరిగేలా చైర్మన్లు చొరవ చూపాలన్నారు. పిల్లలు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకొనేలా చూడటంలో లైబ్రరీలు తొలి సాధనం కావాలని సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.శేషగిరిరావు, గ్రంథాలయ విభాగం డైరెక్టర్ ప్రసన్న కుమార్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

పలువురు ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జిల్లాలకు అనుగుణంగా అటవీ శాఖను పునర్వ్యవస్థీకరించిన ప్రభుత్వం.. అందుకు అనుగుణంగా ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేసింది.

'రీ సర్వే పారదర్శకంగా ఉండాలి'

కొత్తూరు: భూముల రీ సర్వే పారదర్శకంగా ఉండాలని జిల్లా సర్వే, ల్యాండ్ సెటిల్‌మెంట్ శాఖ ఏడీ ప్రభాకరరావు అన్నారు. కొత్తూరులో తహసీల్దార్ పి.బాల అధ్యక్షతన బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం కంటే ముందుగానే రీ సర్వే పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుతం చేస్తున్న రీ సర్వే గ్రామాల్లో అన్ని వివరాలతో సర్వే చేయాలని తెలిపారు. ఇబ్బందులను అధిగమించి రీ సర్వే పూర్తి చేయాలన్నారు.

నేడు ఇంజినీర్ల దినోత్సవం

అరసవల్లి: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని గురువారం ఇంజినీర్ల దినోత్సవాన్ని ఘనంగా జరిపేందుకు జిల్లాలో పలు శాఖలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఎస్ఈ కార్యాలయం వద్ద మోక్షగుండం విగ్రహం వద్ద, పీఆర్‌తో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ తదితర శాఖల ఇంజినీర్లంతా సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పీఆర్ ఇంజినీర్ల సంఘ నేత కెసిహెచ్.మహంతి తెలియజేశారు. అలాగే జిల్లా కేంద్రంలో అటు విద్యుత్ శాఖ, జలవనరుల శాఖ, ఆర్‌అండ్‌బీ తదితర ఇంజినీరింగ్ విభాగాలున్న శాఖాధికారులు కూడా ఆయా కార్యాలయాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఈకేవైసీ నమోదు తప్పనిసరి

పాతపట్నం: రైతులంతా విధిగా ఈకేవైసీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) కే.శ్రీధర్ అన్నారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 వరకు ఈ పంట నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఈ సమయం లోపల రైతులందరూ విధిగా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. పొటాష్, ఎరువులు రైతు భరోసా కేంద్రాలకు పంపించామన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులు విధిగా వేలిముద్రలు కూడా వేయాలన్నారు.

పాముకాటుకు మేకల కాపరి బలి



మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదన

కాశీబుగ్గ: పలాస మండలం పెద్దనారాయణపురం గ్రామానికి చెందిన మేకల కాపరి లావేటి ఆదినారాయణ(63) బుధవారం పాముకాటుకు గురై మృతి చెందారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆదినారాయణ బుధవారం డబ్బెకు పైగా మేకలను ఒక్కడే మేతకు తీసుకెళ్లారు. ఊరి నుంచి బయల్దేరి బంటుకొత్తూరు గ్రామం వరకు ఉన్న వంశధార కాలువ గుండా వెళ్తుండగా ఆయనను పాము కాటు వేసింది. ఆయన భయంతో కేకలు వేసి వెనక్కి పడిపోవడంతో స్థానికులు అతడిని గుర్తించి ద్విచక్ర వాహనంపై పలాస సామాజిక ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గం మధ్యలో బ్రాహ్మణ తర్లా వచ్చేసరికి ఆయన పూర్తిగా స్పృహ కోల్పోయారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తీసుకురాగా డ్యూటీ డాక్టర్ హేమచందర్ ఆయనను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై పలాస సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ మదే రమేష్ మాట్లాడుతూ నాగుపాములు, తాచుపాములు కరిస్తే సుమారు మూడు గంటల వరకు ప్రాణాపాయం ఉండదని, కానీ ఏదైనా అరుదైన రకం పాము కరిస్తే నిమిషాల వ్యవధిలోనే చనిపోయే అవకాశం ఉందన్నారు.

మృతుడికి భార్య పారమ్మ, కుమార్తెలు కాంతమ్మ, యశోద, కుమారులు సింహాద్రి, జగన్నాయకులు ఉన్నారు. భర్త మృతి విషయం తెలిసి భార్య పారమ్మ గుండెవిలసేలా రోదించారు. అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు మాట్లాడుతూ మేకల కాపరి కుటుంబానికి ప్రభుత్వం సాయం చేయాలని కోరారు.

పాముకాటు వేస్తే..

- విష సర్పాలు కాటు వేసిన శరీర భాగంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది. నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లుగా ఉంటుంది. గొంతులో ఏదీ దిగని పరిస్థితి ఏర్పడుతుంది.
- నోటి ద్వారా చొంగ కారడంతో పాటు కళ్లు మగతగా మారి శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.
- రెండు గాట్లు పడితే విషపూరితమైన పాము కాటేసినట్లు గుర్తించాలి.
- నోరు, ముక్కు ద్వారా రక్తం బయటకు వస్తుంది. వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలి.
- అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉన్నందున బాధితుడికి ధైర్యం చెప్పాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- రైతులు పొలం గట్లపై నడిచే సమయంలో చెప్పులు ధరించాలి.
- కర్రతో చప్పుడు చేస్తూ నడవటం వల్ల అలికిడికి పాములు వెళ్లిపోతాయి.
- రాత్రిపూట పొలానికి వెళ్లే రైతులు తమతో పాటు టార్చిలైటు తప్పక తీసుకెళ్లాలి. మోటారు స్టార్టర్ వద్ద పాములు ఉండే అవకాశం ఉంది.
- ధాన్యం గాదెలు, గడ్డి కుప్పలు, కర్రలు, పిడకలు నిల్వ చేసే ప్రాంతాలు, తడిగా ఉన్నచోటకు కప్పలు, ఎలుకలు చేరుతాయి. వాటిని తినేందుకు పాములు వస్తుంటాయి. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎలాంటి పిచ్చిమొక్కలు, చెత్తా లేకుండా చూసుకోవాలి.
- పొలాలు, నదీ పరీవాహక సమీప ప్రాంతాలు, ఊరి శివారున ఉన్న ఇళ్లలోకి పాములు చేరే ప్రమాదం ఉంది. కిటికీలకు, తలుపులకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి.

విషపూరిత పాములు

- నాగుపాము కాటేసిన 10 నుంచి 20 నిమిషాల్లో నోటి నుంచి నురగ రావటం, శరీరం మొద్దుబారిపోవటం, ఊపిరి తీసుకోవటం కష్టంగా మారుతుంది.
- రక్తపింజరి కాటేసిన రెండు గంటల్లో విషం రక్తంలో కలుస్తుంది.
- కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్తంలో కలుస్తుంది.
- పీహెచ్‌సీల్లో పాము కాటు విరుగుడు మందులు అందుబాటులో ఉన్నాయి. పాము కాటుకు గురైన వెంటనే సమీపంలోని ఆస్పత్రికి చేర్చాలి. ఎంత ఆలస్యం చేస్తే ప్రాణానికి అంత ప్రమాదం.
- పసర మందులు, నాటు వైద్యం, మంత్రతంత్రాలు అంటూ ఆలస్యం చేయకుండా వీలైనంత తొందరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. పాము కాటు వేసిన భాగంలో రక్తప్రసరణ జరగకుండా కట్టుకట్టాలి. అవసరం అనుకుంటే మూడు, నాలుగు రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచాలి.



విదేశీ కలల సాకారానికి..

- జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా విద్యార్థులకు సాయం
- జిల్లా నుంచి సుమారు 1000 మంది వరకు అర్హులు
- సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తుకు గడువు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునః ప్రారంభించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 వరకు గడువు పెట్టింది. విదేశాలకు వెళ్లి చదవాలనుకునే వారికి ఇది చక్కటి అవకాశం. కోవిడ్ కాలంలో ఎవరూ గడప దాటలేదు. ఇప్పుడు మళ్లీ విదేశాల బాట పట్టేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆసక్తి ఉన్నా ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు ప్రభుత్వం సాయం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జ్ఞానభూమి పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించింది.

జిల్లా నుంచి విదేశాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. దాదాపు వెయ్యి మంది వరకు మన విద్యార్థులు ఎంఎస్, పీజీ, పీహెచ్, ఎంబీబీఎస్ తదితర కోర్సులు చదివేందుకు విదేశాలకు వెళ్లాలనుకుంటున్నారు. వీరిలో చాలా మందికి ఆర్థిక ఇబ్బందులు అవరోధంగా నిలుస్తున్నాయి. అలాంటి వారిని ఈ పథకం ఆదుకుంటుంది.

- ప్రపంచ ర్యాంకింగ్‌లో టాప్ 100 విశ్వవిద్యాలయాల్లో సీటు పొందిన వారికి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేస్తారు.
- 101 నుంచి 200వ ర్యాంకింగ్ ఉన్న విశ్వ విద్యాలయాల్లో ప్రవేశం పొందిన వారికి రూ.50 లక్షలు, లేదా 50 శాతం ఫీజులో ఏది తక్కువ అయితే ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సాయం అందించనుంది.
- ఆయా సామాజిక వర్గాలకు చెందిన 35 ఏళ్లలోపు వారు అర్హులు.
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండి, ఎంపికైన వారికి నాలుగు విడతల్లో వారికి కేటాయించిన మొత్తాన్ని విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.
- ఏటా రెండుసార్లు ఆన్‌లైన్ విధానంలో ఎంపిక ఉంటుంది. ఇంటర్, డిగ్రీ, పీజీ, కోర్సుల్లో 60 శాతం మార్కులు, లేదా తత్సమాన గ్రేడ్ కలిగి ఉండాలి. అర్హులైన విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సెప్టెంబరు నెలాఖరులోగా http:jnanabhumi.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో అర్హులైన వారు జగనన్న విదేశీ విద్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి ఆర్.గడ్డమ్మ తెలిపారు.

పాడిని కాపాడాలి..

- సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం
- ముందస్తు జాగ్రత్తలతో పశు సంపద భద్రం
- వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి:ఏడీ కరుణాకరరావు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి వాణి

పాతపట్నం: వర్షాకాలంలో పశువులకు చాలా రకాల సమస్యలు వస్తాయి. ప్రధానంగా గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కలిగి ఉంటే సకాలంలో చికిత్స అందించి పశువులను కాపాడుకోవచ్చు. లేదంటే పశు సంపదను కోల్పోవాల్సి వస్తుంది. ఈ సీజన్‌లో వచ్చే పశువ్యాధులు, నివారణపై పశుసంవర్ధక శాఖ ఏడీ మంచు కరుణకరరావు, కొరసవాడ వైద్యుడు పారశెల్లి అనిల్ కుమార్, సీడి వైద్యురాలు బి.వాణిలు పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వర్షాకాలం పశుగ్రాసం సాగుకు అనుకూలంగా ఉంటుందని, వర్షాధారంగా ఎస్ఎస్‌జీ, యంపిచారీ, ఆఫ్రికల్ బాల్, అలసంద, పిల్లిపెసర వంటి పశుగ్రాసాన్ని సాగుచేసుకోవాలని సూచించారు. పశుగ్రాసంతో పాటు రోజుకు కనీసం 50 గ్రాముల ఖనిజ లవణ మిశ్రమం అందివ్వాలని తెలిపారు. వ్యాధులపై వారు ఇలా వివరించారు.

గొంతువాపు వ్యాధి

ఈ సీజన్‌లో పశువుల్లో ప్రధానంగా కనిపించే వ్యాధి గొంతువాపు. దీన్ని గురక వ్యాధి అని కూడా అంటారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. గొంతు, మెడపై వాపు కనిపిస్తుంది. శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది.

చికిత్స: సల్ఫాడిపోజిన్ ఇంజెక్షన్ బాగా పనిచేస్తుంది.

నివారణ: ఏటా తొలకరిలోనే ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాకోవాలి.

జబ్బవాపు వ్యాధి

ఆరోగ్యంగా, దృఢంగా ఉన్న యుక్త వయసు పెయ్యలకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. పశువు శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాల్లో వాపు, రక్తంలో విషపదార్థాల ప్రభావం వల్ల ఒక్కోసారి పశువులు మరణిస్తాయి.

చికిత్స: పెన్సులిన్, ఆక్సిటెట్రాసైక్లిన్ వంటి యాంటీబయోటిక్స్ వేయించాలి.

కుందేటిర్రి వ్యాధి

దీని లక్షణాలు ఒకే విధంగా కాకుండా ఒక్కో పశువులో ఒక్కో రకంగా ఉంటాయి. కొన్ని పశువులు మేత తింటూ నెమరు వేసినట్లు నటిస్తాయి. తడబడుతూ తూలుతూ నడుస్తాయి. వస్తువులను గుద్దుకుంటాయి. గుండ్రంగా తిరుగుతూ ఉంటాయి. తరచూ ఫిట్స్ వచ్చి పడిపోతుంటాయి. కంటిలో పొర వస్తుంది.

చికిత్స: ట్రిక్వీన్, బెరినిల్, ఎంట్రీసైడ్ ప్రొసాల్ట్ వంటి మందులు వాడాలి. బి.కాంప్లెక్స్, ఐరన్‌తో కూడిన మందులు వాడాలి. జోరీగల వ్యాప్తిని అరికట్టాలి.

అఫ్లో టాక్సికోసిస్ వ్యాధి


గడ్డి, తవుడు, దాణా పదార్థాలపై బూజు చేరడం వల్ల అఫ్లోటాక్సిన్ అనే విషపదార్థం విడుదలై పశువులకు హాని చేస్తాయి. ఈ వ్యాధి సోకితే కళ్ల నుంచి నీరు కారడం, తొడ, జబ్బలు మొదలైన ప్రాంతాల్లో చర్మం ఎరుపుగా ఉంటుంది. వెంట్రుకలు రాలి మచ్చలు ఏర్పడడం, విరోచనాలు కావడం జరుగుతుంది.

నివారణ: గడ్డి, దాణా, తేమ, తడికి గురికాకుండా జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి.

ఇలా జాగ్రత్తలు తీసుకోవాలి..

వర్షాకాలంలో పశువులను పాకల్లోనే ఉంచాలి. బురద, చిత్తడి నేలల్లో తిరగకుండా చూడాలి. పరిశుభ్రమైన నీరు తాగించాలి. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. లేగదూడలను వ్యాధి ప్రబలిన పశువులకు దూరంగా ఉంచాలి. మేత, దాణా తగు మోతాదులో ఇవ్వాలి. ఎలాంటి వ్యాధి లక్షణాలున్నా వెంటనే సంబంధిత పశువైద్యాధికారిని సంప్రదించి చికిత్స అందించాలి. ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలు వేయించాలి. పాకలు తడి లేకుండా పొడిగా ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం వేళ పశువులకు దోమలు కుట్టకుండా వేపాకులతో దూపం వేయించాలి. తడిసిన, కుళ్లిన గడ్డిని, దాణాను పశువులకు వేయరాదు.

కలుషిత ఆహారం వద్దు..



వర్షాకాలంలో నీరు, మేత కలుషితం కావడంతో పశువులు వ్యాధుల బారిన పడుతుంటాయి. కాబట్టి మేత, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. వర్షంలో పశువులు తడవకుండా చూసుకోవాలి. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పశువులను శాలల్లోనే కట్టాలి. మేతకు తీసుకువెళ్లె సమయంలో పాము కాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. పాడి సంరక్షణపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు వేయించాలి.

– మంచు కరుణకరరావు, ఏడీ, పశుసంవర్ధక శాఖ, పాతపట్నం

క్లుప్తంగా

గంటా అనుచరుడు దొరబాబు ఇంట్లో సీఐడీ సోదాలు

ఏయూ క్యాంపస్: అమరావతి అసైన్డ్ భూముల కుంభకోణంలో అరెస్టయిన ఏయూ దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్) కె.దొరబాబు ఇంట్లో సీఐడీ పోలీసులు బుధవారం తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే సీఐడీ పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. టీడీపీ హయాంలో గంటాకు అనుచరునిగా ఉంటూ అమరావతి అసైన్డ్ భూముల వ్యవహారంలో దొరబాబు పాత్ర ఉండటంతో సీఐడీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఏయూ దూరవిద్య కేంద్రంలో ఆయన గదిని ఏయూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఏయూ దూరవిద్య కేంద్రం అధికారులు సీజ్ చేశారు.

రవాణా శాఖ కమిషనర్‌గా ఆంజనేయులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్‌గా పీఎస్ఆర్ ఆంజనేయులును ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్న ఆయనను పూర్తి అదనపు బాధ్యతలతో రవాణా శాఖ కమిషనర్‌గా నియమిస్తూ సీఎస్ సమీర్ శర్మ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

నారాయణకు మధ్యంతర ముందస్తు బెయిల్



సాక్షి, అమరావతి: అమరావతి రాజధాని ముసుగులో దళిత, బలహీనవర్గాల రైతులకు చెందిన 1,100 ఎకరాల అసైన్డ్, లంక భూములను కాజేసిన వ్యవహారంపై సీఐడీ నమోదు చేసిన కేసులో టీడీపీ మాజీ మంత్రి పొంగూరు నారాయణకు హైకోర్టు బుధవారం మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 14 వరకు మూడు నెలలు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మూడు నెలలూ నారాయణను అరెస్ట్ చేయవద్దని సీఐడీని ఆదేశించింది. తుది విచారణను డిసెంబర్ 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ 2020లో నమోదు చేసిన ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యంపై కోర్టు బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. రాజధానికి సంబంధించిన మరో కేసులో హైకోర్టు పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసి, చికిత్సకు అమెరికా వెళ్లేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. ఈ వాదనను ఏఏజీ తోసిపుచ్చారు. పిటిషనర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదై ఉన్నందున, ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. ప్రయాణానికి ఒక్క రోజు ముందు పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. వాదనలు విన్న కోర్టు నారాయణకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

అనంతబాబు డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో డిఫాల్ట్ బెయిల్ కోరుతూ ఎమ్మెల్సీ అనంతబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పోలీసులు 90 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయనందున డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలంటూ అనంతబాబు దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై జస్టిస్ రవి బుధవారం విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కలిగినీడి చిదంబరం వాదనలు వినిపిస్తూ.. 90 రోజులకు రెండు రోజుల ముందు పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారని, సాంకేతిక కారణాలతో కోర్టు దానిని తిరస్కరించిందని తెలిపారు. ఇది అసంపూర్ణ చార్జిషీట్ కిందకే వస్తుందని, అందువల్ల డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చార్జిషీట్‌లో లోపాలున్నాయని కోర్టు తిరస్కరించిందని, వాటిని సవరించి తిరిగి దాఖలు చేశామన్నారు. గడువులోపు దాఖలు చేసిన చార్జిషీట్‌ను సాంకేతిక కారణాలతో కోర్టు తిరస్కరిస్తే, దానిని సకాలంలో దాఖలు చేసినట్లుగానే భావించాలన్నారు. ఈ కేసులో ఫోరెన్సిక్ నివేదికలు అందాల్సి ఉందన్నారు. ఈ కేసులో తాను ఎవరినీ సమర్థిస్తూ వాదనలు చెప్పడంలేదని, కోర్టుకు సహాయకారిగా వ్యవహరిస్తున్నానని న్యాయమూర్తి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నేరచరిత్రను పరిగణనలోకి తీసుకోండి

అనంతబాబు బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ డ్రైవర్ సుబ్రహ్మణ్యం తల్లి నూకరత్నం ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయగా, ఆమె తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. అనంతబాబుకు నేర చరిత్ర ఉందన్నారు. పోలీసులు గడువు లోపే చార్జిషీట్ దాఖలు చేశారని తెలిపారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే కేసులో రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలంటూ అనంతబాబు దాఖలు చేసిన మరో పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేశారు.

భూ ఆక్రమణలపై కన్నెర్ర!

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పంచాయతీ, మునిసిపాలిటీ, అటవీ, రెవెన్యూ భూముల నుంచి ఆక్రమణదారులను ఖాళీ చేయించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పంచాయతీ భూముల ఆక్రమణదారులను ఆరు నెలల్లో ఖాళీ చేయించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించింది. మునిసిపాలిటీ, అటవీ భూములను ఆక్రమించుకున్న వారిని రెండు నెలల్లోగా గుర్తించి ఆ తరువాత ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఆక్రమణదారులను ఖాళీ చేయించిన తరువాత తిరిగి కబ్జాల బారిన పడకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పింది. ఆక్రమణదారులను ఖాళీ చేయించే విషయంలో నిబంధనలు అనుసరించాలని అధికారులకు సూచించింది. పంచాయతీ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల పేరు మీద క్రమబద్ధీకరించరాదని, వాటిని ఆక్రమించుకున్న వారిని ఖాళీ చేయించాల్సిందేనంటూ జగ్పాల్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు 2011లోనే విస్పష్టమైన తీర్పు ఇచ్చిందని హైకోర్టు గుర్తు చేసింది. సుప్రీం తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం అదే ఏడాది జీవో 188 జారీ చేసి ఆక్రమణల తొలగింపునకు నిబంధనలు రూపొందించిందని తెలిపింది. అయినప్పటికీ అధికారులు ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోలేదని ఆక్షేపించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు వెలువరించింది.

ఆక్రమణలపై పలు వ్యాజ్యాలు దాఖలు..

జీవో 188 జారీ అయినప్పటికీ ప్రభుత్వ భూములు, నీటి వనరులు, అటవీ, క్రీడా స్థలాలు, శ్మశానాల స్థలాలను ఆక్రమణల నుంచి అధికారులు కాపాడటం లేదని, ఈ విషయంలో తగిన ఆదేశాలు ఇవ్వాలంటూ న్యాయవాది బుస్సా రాజేంద్ర హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఇదే అంశంపై పలు పిల్‌లు దాఖలయ్యాయి.



వీటన్నింటిపై సీజే ధర్మాసనం ఉమ్మడిగా విచారణ జరిపింది. ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ భూములకు విముక్తి కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఈ పరిస్థితి మారాలి...

'జగ్పాల్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం 2011లో జీవో 188 జారీ చేసింది. ఆ జీవో ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ (ఆస్తుల పరిరక్షణ) రూల్స్‌ను తెచ్చింది. వీటి ప్రకారం పంచాయతీ భూములను మూడు రకాలుగా వర్గీకరించింది. 1.సొంతవి, సేకరించిన భూములు 2. దానంగా, విరాళంగా, పంచాయతీలకు బదిలీ చేసిన భూములు 3. పంచాయతీకి చెందిన భూములు. ఏటా పంచాయతీ పరిధిలోని భూముల వివరాలను సేకరించి గెజిట్‌లో ప్రచురించాలి. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి ఖాళీ చేయించాలి. ఆక్రమణల గుర్తింపు, తొలగింపు కోసం కలెక్టర్ నేతృత్వంలోని హైపవర్ కమిటీ మూడు నెలలకొకసారి సమావేశమై ఆక్రమణల తొలగింపు పురోగతిని సమీక్షించాలి. నిబంధనలు ఇంత స్పష్టంగా ఉన్నా దురదృష్టవశాత్తు అధికారులు వీటిని అమలు చేయడం లేదు. దీంతో ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఏటా పెరిగిపోతున్నాయి. హైకోర్టులో పెద్ద సంఖ్యలో వ్యాజ్యాలు దాఖలవుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు నిబంధనలను అమలు చేయడం లేదు. ఈ పరిస్థితి మారాలి. ఆక్రమణదారుల చెర నుంచి ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. పంచాయతీ, మునిసిపాలిటీ, అటవీ, రెవెన్యూ భూముల నుంచి ఆక్రమణదారులను ఖాళీ చేయించాలి' అని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆక్రమణదారులను ఖాళీ చేయించే ముందు నోటీసు ఇచ్చి వారి వాదన వినాలని స్పష్టం చేసింది. నిర్దిష్ట సమయం నిర్ణయించుకుని ఆక్రమణదారులను ఖాళీ చేయించాలని మునిసిపల్ అధికారులకు తేల్చి చెప్పింది. పంచాయతీ కార్యదర్శులంతా జీవో 188 ప్రకారం ఆక్రమణదారులను ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. పంచాయతీ భూముల నుంచి ఆక్రమణదారులను ఆరు నెలల్లో ఖాళీ చేయించాలని నిర్దేశించింది.

వక్ఫ్ భూములను ఈ జాబితాలో చేర్చలేం..

ధర్మాసనం మొదట తన ఉత్తర్వులను పంచాయతీ, మునిసిపల్, అటవీ భూములకే పరిమితం చేయగా రెవెన్యూ, దేవదాయశాఖ భూములను కూడా జత చేయాలని రెవెన్యూ శాఖ తరఫు న్యాయవాది పోతిరెడ్డి సుభాష్‌రెడ్డి కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ రెవెన్యూ భూములను ఆక్రమణల తొలగింపు ఉత్తర్వుల్లో చేర్చింది. దేవదాయ శాఖ భూములపై వేరుగా విచారణ జరుపుతామని తెలిపింది. ఈ సమయంలో ప్రభుత్వ మరో న్యాయవాది ఖాదర్ బాషా జోక్యం చేసుకుంటూ వక్ఫ్ భూములు కూడా పెద్ద సంఖ్యలో ఆక్రమణల్లో ఉన్నాయని, వాటిని కూడా ఆ ఉత్తర్వుల్లో చేర్చాలని కోరారు. అయితే ధర్మాసనం అందుకు నిరాకరిస్తూ వక్ఫ్ భూముల విషయంలో బహుళ వివాదాలుంటాయని, అందువల్ల వాటిని ఈ ఉత్తర్వుల పరిధిలోకి తీసుకురాలేమని పేర్కొంది.

పాదయాత్రలో పెత్తందారులే

- మంత్రి చెల్లుబోయిన ధ్వజం

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత చంద్రబాబు రాజకీయ ప్రస్థానంలో కుట్రలు, కుతంత్రాలే ప్రధాన అజెండాలని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. తనకు దక్కని అధికారం ఎదుటి వారి దగ్గర ఉండకూడదనే దురుద్దేశంతో ప్రజలను నిత్యం అశాంతికి గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఐదేళ్ల అధికారంలో ఉండి రాజధానితో వ్యాపారం చేశారని మండిపడ్డారు. రైతుల పేరుతో చేపట్టిన పాదయాత్రలో వారిని పీడించే పెత్తందారులే ఉన్నారని చెప్పారు. అందులో నడుస్తున్న వారు ఎప్పుడైనా ఒక్క ఎకరం పొలాన్నైనా పండించారా? అని ప్రశ్నించారు. బెంజి కార్లు, బౌన్సర్లతో పాదయాత్ర చేయడాన్ని చూస్తుంటే వాస్తవాలు అర్థమవుతున్నాయని చెప్పారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

త్యాగం కాదు.. లాభాపేక్షతోనే

పాదయాత్ర చేస్తున్న వారు అమరావతి కోసం భూములు త్యాగం చేయలేదు. లాభాపేక్షతోనే ఇచ్చారు. చంద్రబాబు మోసంలో వారికి భాగస్వామ్యం ఉంది. లాభం వస్తుంది, మావాడు, మాకోసం చేస్తున్నాడని భూములిచ్చారు. కానీ రాజధాని అనేది రాష్ట్ర ప్రజల ఆస్తి, హక్కు. దాన్ని సంరక్షించాల్సిన బాధ్యత నాయకులపై ఉంటుంది. చంద్రబాబు వల్ల ప్రజలకు జరిగిన అన్యాయం, ద్రోహాన్ని బాధ్యతగల నాయకుడిగా సీఎం జగన్ సరిదిద్దుతున్నారు. అందుకే విశాఖలో పరిపాలన రాజధాని, కర్నూలులో న్యాయ రాజధాని, అమరావతిలో శాసన రాజధానిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మూడు ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెబుతుంటే అడ్డుకునే కార్యక్రమాన్ని చేపట్టి సమర్థించుకోవడం సిగ్గుచేటు. గతంలో రాజధానిగా అమరావతిని తప్పుబట్టిన పవన్ కల్యాణ్, వామపక్షాలు, ఇతర పార్టీలు నారా రూటులో సాగుతున్నాయి.

ఎన్టీఆర్ పథకాలకు బాబు తిలోదకాలు..

తాను చేపట్టిన రాజధానిని కొనసాగించాలని చెబుతున్న చంద్రబాబు నాడు ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రెండు రూపాయిలకే కిలో బియ్యం, మద్యపాన నిషేధానికి ఎందుకు తిలోదకాలు ఇచ్చారు? ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన నాటి నుంచి బాబు కుట్రలను కొడాలి నాని వెల్లడిస్తుంటే సహించలేక పోతున్నారు. సీఎం కుటుంబంపై విమర్శలను ఖండించిన వారిని టీడీపీ నేతలు దూషించడం సిగ్గుచేటు. చంద్రబాబుకు ధైర్యం ఉంటే అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధం కావాలి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 98.44 శాతం హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే.

రాజధానిపై మోసగించింది బాబే

- రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ధ్వజం
- ఎక్కడనేది నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే
- కోర్టులు జోక్యం చేసుకునే అవకాశం లేదు



జంగారెడ్డిగూడెం: రాజధాని విషయంలో ప్రజలను, రైతులను మోసగించిన విపక్ష నేత చంద్రబాబు సీఎం జగన్‌పై నిందలు మోపుతున్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మండిపడ్డారు. రాజధాని ఎక్కడ ఉండాలో నిర్ణయించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందన్నారు. సీఎం జగన్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికే మూడు రాజధానులను ప్రకటించినట్లు చెప్పారు. బుధవారం జంగారెడ్డిగూడెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

కోర్టుకు ఆ అధికారం ఉందా..?

రాష్ట్ర ప్రభుత్వ అధికారాల్లో జోక్యం చేసుకునేందుకు కోర్టుకు ఉన్న హక్కులు ఏమిటి? న్యాయమూర్తుల తీర్పును నేను వ్యతిరేకించడం లేదు. ఒకసారి ఆలోచించాలి. రాజధాని విషయం రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయమా? కోర్టులు చేసే నిర్ణయమా? రాజధాని ఎక్కడ ఉండాలో నిర్ణయించుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదే. పరిపాలనా విధుల్లో కోర్టులు జోక్యం చేసుకునే అవకాశం లేదు. మూడు నెలల్లో రాజధానిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించే అధికారం కూడా లేదు. నిధులను బట్టి అధికారంలో ఉన్న ప్రభుత్వాలు నిర్ణయం తీసుకుంటాయి. ఈ రెండింటిపై విరుద్ధమైన తీర్పులు ఇచ్చాయి. తీర్పుపై కచ్చితంగా కామెంట్ చేస్తాం. న్యాయమా.. కాదా? అని కామెంట్ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. న్యాయమూర్తులను మేము కామెంట్ చేయడం లేదు. తీర్పును మాత్రమే కామెంట్ చేస్తున్నాం. అంబేడ్కర్ చెప్పినట్లు రెండు రాజధానులు, మూడు రాజధానులు పెట్టుకోవడం తప్పేమీ కాదు. అంబేడ్కర్ ఆనాడే దక్షిణాదిలో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలని సూచించారు. రాజధానుల విషయంలో రాజ్యాంగంలో సవివరంగా పేర్కొన్నారు.

33 వేల ఎకరాలు అవసరమా..?

రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాలు అవసరమా? హైదరాబాద్ లాంటి రాజధానిని సుమారు 5 వేల ఎకరాల్లో నిర్వహిస్తుండగా రాష్ట్రంలో రాజధానికి 33 వేల ఎకరాలు అవసరమా? చంద్రబాబు ఆయన కోటరీకి మేలు చేయడానికి, భూములతో వ్యాపారం చేసేందుకే పెద్ద ఎత్తున సేకరించారు. చంద్రబాబుకు దళితులు, పేదలంటే చులకన. అమరావతి ప్రాంతంలో 29 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని ప్రభుత్వం భావిస్తే అందుకు అడ్డుపడి స్టే తెచ్చారు.

బాబు కుటిల రాజకీయాలు..

చంద్రబాబు కుటిల రాజకీయాన్ని ప్రజలు గమనించాలని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల బూత్ కమిటీ కన్వీనర్ బీవీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రాజధానిపై చట్టసభలో తేల్చుకుందాం

- నిబద్ధత ఉంటే చంద్రబాబు అసెంబ్లీకి రావాలి: మంత్రి మేరుగ నాగార్జున
- పాదయాత్రలో పేదలు ఎక్కడున్నారు?



సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత చంద్రబాబు నిజంగా నిబద్ధత కలిగిన నాయకుడైతే అసెంబ్లీకి రావాలని, రాజధాని విషయంపై అక్కడే చర్చించి తేల్చుకుందామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున సూచించారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతిలో రాజధాని వద్దని ప్రభుత్వం చెప్పడం లేదన్నారు. అమరావతితో పాటు వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ కూడా సమానంగా అభివృద్ధి చెందాలనే మూడు రాజధానులను తెచ్చామన్నారు. రెండు కళ్ల సిద్ధాంతంతో రాష్ట్ర విభజనకు కారణమైన చంద్రబాబు ఐదేళ్లలో రాజధానిని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అమరావతి ప్రాంత ప్రజలను, బడుగు, బలహీన వర్గాలను చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని ధ్వజమెత్తారు. అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదని అడ్డుకున్న చంద్రబాబు, బడుగు, బలహీన వర్గాలకు స్థానం లేని రాజధాని ఎవరి కోసమో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని పేరుతో ఉద్యమం చేసే వారిలో ఎంత మంది రైతులున్నారని ప్రశ్నించారు. రోలెక్స్ వాచీలు ధరించి ఆడి కార్లలో తిరిగే ధనవంతులు మినహా పాదయాత్రలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు లేరన్నారు. రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లో ఏ ఇంటి తలుపు తట్టినా ప్రభుత్వం నుంచి సహాయం అందిందో లేదో తెలుస్తుందన్నారు. చంద్రబాబు చివరకు భగవంతుడిని కూడా అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వికేంద్రీకరణ, మూడు రాజధానుల విధానంతోనే తమ ప్రభుత్వం ప్రజల ముందుకు వెళ్తుందని చెప్పారు.

ఏప్రిల్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

విజయవాడలో నిర్మించ తలపెట్టిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 14న ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి నాగార్జున వెల్లడించారు. దేశంలో ఏ నాయకుడూ చేయని విధంగా అంబేడ్కర్ భావజాలాన్ని అందిపుచ్చుకుని ముఖ్యమంత్రి జగన్ సామాజిక మహా విప్లవానికి తెర తీశారని చెప్పారు. అవసరం తీరాక దళితులను కాళ్లతో తన్నే చంద్రబాబు చివరకు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులోనూ వివక్ష చూపించారని మండిపడ్డారు.

బెంజ్ కార్లు.. బౌన్సర్లు!

- రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే పాదయాత్ర: మంత్రి కారుమూరి
- సమానాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సాక్షి, అమరావతి: రోలెక్స్ వాచ్‌లు, బెంజ్ కార్లు, బౌన్సర్లతో చంద్రబాబు బృందం సాగిస్తున్న పాదయాత్రను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. వందల ఎకరాల అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కాజేసిన వారితోపాటు రైతుల భూములను ముందుగానే సొంతం చేసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులే యాత్రలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా జరిగిన అభివృద్ధితో ఏపీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. అలాంటి పరిస్థితి మళ్లీ ఉత్పన్నం కారాదనే దూరదృష్టితోనే ముఖ్యమంత్రి జగన్ మూడు ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఒక్క అమరావతిలోనే రూ.లక్షల కోట్లు వెచ్చిస్తే మిగిలిన ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడి శ్రీలంక పరిస్థితి ఉత్పన్నమయ్యేదన్నారు. ప్రజలు దీన్ని ముందుగానే గమనించి చంద్రబాబును ఇంటికి సాగనంపారని తెలిపారు. రాజధానిపై నిర్ణయించుకునే హక్కు రాష్ట్రానికే ఉంటుందని కేంద్ర ప్రభుత్వం చెబుతుంటే ఇక్కడి బీజేపీ నాయకులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

త్వరలో రైతులకు ధాన్యం డబ్బులు..

రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు, మాల్స్‌లో అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు మంత్రి కారుమూరి తెలిపారు. పల్నాడు, తిరుపతి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని పెట్రోల్ బంకుల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీలు జరిపి 29 కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు చెప్పారు. విజయవాడ, విశాఖలో మాల్స్‌పై 156 కేసులు నమోదు చేశామన్నారు. తూనికలు కొలతలు శాఖలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు 15 మంది ఎస్ఐలను డిప్యూటేషన్‌పై తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సీఎం యాప్ ద్వారా స్థానిక మార్కెట్లు, రైతు బజార్లు, నిత్యావసర సరుకుల ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సమర్థంగా ధరలను నియంత్రించినట్లు తెలిపారు. త్వరలోనే రైతులకు చెల్లించాల్సిన రూ.300 కోట్ల ధాన్యం బకాయిలను విడుదల చేస్తామని చెప్పారు. విభజన తర్వాత ఏపీ పౌరసరఫరాల శాఖకు రావాల్సిన రూ.600 కోట్ల బకాయిలను చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. సమావేశంలో తూనికలు, కొలతలు జాయింట్ కంట్రోలర్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో కాదు.. సభలో చర్చిద్దాం

చంద్రబాబుకు అంబటి సవాల్

అమరావతి పెద్ద స్కాం..



సాక్షి, అమరావతి: పోలవరంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. 'వీధుల్లో చర్చ ఎందుకు? శాసనసభ వేదికగా చర్చిద్దాం రండి' అని సూచించారు. ప్రతిపక్ష నేతగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలనుకుంటే సభకు హాజరై పోలవరంపై చర్చలో పాల్గొనాలన్నారు. మళ్లీ సీఎం అయ్యాకే శాసనసభలో ప్రవేశిస్తానంటూ మంగమ్మ శపథం చేసిన చంద్రబాబు టీడీపీ ఎమ్మెల్యేలను మాత్రం సభకు పంపి రాద్ధాంతంతో ప్రచారం కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. ఆయనకు ఒక విధానం, ఆయన పార్టీ ఎమ్మెల్యేలకు మరో విధానమా?' అని ప్రశ్నించారు. రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా సభా ప్రాంగణంలోకి మాత్రమే వచ్చానంటూ చంద్రబాబు సమర్థించుకుంటున్నారని ధ్వజమెత్తారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అంబటి మీడియాతో మాట్లాడారు.

పోలవరం పాపం బాబుదే..

పోలవరం పనుల్లో జాప్యానికి ముమ్మాటికీ చంద్రబాబే కారణం. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, నాటి మంత్రి దేవినేని ఉమా అవివేక నిర్ణయాలే అందుకు కారణం. గోదావరి వరదను మళ్లించేలా స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌లు కట్టకుండా డయాఫ్రమ్‌వాల్ చేపట్టి చంద్రబాబు చారిత్రక తప్పిదం చేశారు. ఫలితంగా రూ.రెండు వేల కోట్ల నుంచి రూ.మూడు వేల కోట్ల నష్టం వాటిల్లింది. 2018 నాటికే పోలవరాన్ని పూర్తి చేస్తామన్న ప్రగల్భాలు ఏమయ్యాయి? కేంద్రమే నిర్మించాల్సిన పోలవరం బాధ్యతలను ఎందుకు చేపట్టారు? ఈ ప్రశ్నలకు జవాబివ్వాలని పదేపదే కోరినా చంద్రబాబు, దేవినేని ఉమా నోరెత్తడం లేదు.

విద్వేషాలను రగిల్చే యాత్ర..

అమరావతి రైతుల పేరుతో ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రెండు చేతుల సంపాదించుకోవడానికే మోతుబరులు పాదయాత్రలు చేస్తున్నారు. అమరావతి కుంభకోణానికి పునాది వేసిందే చంద్రబాబు. గతంలో అమరావతిపై మాజీ సీఎస్, బీజేపీ నేత ఐవైఆర్ కృష్ణారావు రచించిన పుస్తక ఆవిష్కరణ సభలో పవన్ కల్యాణ్‌తో కలసి పాల్గొన్న సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ నేతలు అది ప్రజా రాజధాని కాదని, అదో పెద్ద స్కాం అని ఆరోపణలు చేశారు. ఇప్పుడు వారే అమరావతి పాదయాత్రకు మద్దతు పలకడం ఏమిటి?

ఒక్క రైతైనా ఉన్నారా?

అమరావతి పాదయాత్రలో ఒక్క రైతైనా ఉన్నారా? సామాన్యులు ఎవరైనా ఉన్నారా? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎవరైనా ఉన్నారా? మాజీ మంత్రులు నారాయణ, గంటా అసైన్డు భూములను లాక్కుని విలువైన ప్లాట్లు దక్కించుకోవడం వాస్తవం కాదా? ఇది దళితులను మోసం చేయడం కాదా? అమరావతిని ధనికుల రాజధానిగా సృష్టించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

మూడు రాజధానులే మా విధానం..

రాష్ట్ర విభజనకు ముందు జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ భవిష్యత్‌లో విభజన వాదాలు పుట్టకుండా పరిపాలనను వికేంద్రీకరించాలని నివేదిక ఇచ్చింది. ఆ ప్రకారమే రాష్ట్రంలో మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అమరావతిని శాసన, కర్నూలును న్యాయ, విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా సీఎం జగన్ ప్రకటించారు. అదే మా విధానం. అమరావతిలో గజం భూమిని రూ.50 వేలకు, రూ.లక్షకు అమ్ముకుని రెండు చేతులా సంపాదించాలనే కాంక్షతో స్వార్థపరులే వెంకటేశ్వర స్వామిని ఊరేగిస్తూ పాదయాత్ర చేస్తున్నారు. ఈ దొంగలను వెంకన్న క్షమించడు. ఈ ఫేక్ పాదయాత్ర అద్భుతంగా జరుగుతున్నట్లు ఎల్లో మీడియా ప్రచారం చేస్తోంది. చంద్రబాబు ఎప్పుడు డబ్బులు ఇవ్వకపోతే అప్పుడు ఆ పాదయాత్ర ఆగిపోతుంది.

రైతుల ముసుగులో రాజకీయ యాత్ర

- టీడీపీపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ధ్వజం
- ప్రజాదరణ ఉంటే బౌన్సర్ల అవసరం ఏముంది?
- పేదలకు చోటు లేని రాజధాని ఎవరి కోసం?

సాక్షి, అమరావతి: రాజధాని రైతుల పేరుతో టీడీపీ రాజకీయ యాత్ర నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, పార్టీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి వ్యాఖ్యానించారు. పేదలు, బలహీన వర్గాలకు చోటు లేని రాజధాని ఎందుకోసమని ప్రశ్నించారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే విపక్ష నేతలు అడ్డుకున్నారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మేలు జరిగిందా లేదా అన్నది ఆలోచన చేయాలన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

విజ్ఞులైన ప్రజలంతా ఆలోచించాలి

పాదయాత్ర ఎందుకు చేస్తున్నారు? ఉత్తరాంధ్ర, రాయలసీమకు వ్యతిరేకంగానే కదా? పాదయాత్రకు నిజంగా ప్రజాదరణ ఉంటే బౌన్సర్ల అవసరం ఏముంది? అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని బీజేపీ మేనిఫెస్టోలో కూడా పేర్కొన్నారు. అమరావతిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా చంద్రబాబు కుట్ర చేశారు. సీఆర్‌డీఏ చట్టాన్ని సవరించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఎం జగన్ చర్యలు చేపట్టడం పేదల పట్ల ఆయన అంకితభావానికి నిదర్శనం. సీఎం జగన్ జనరంజక పాలనతో టీడీపీకి దిక్కు తోచడం లేదు. శాశ్వతంగా రాజకీయ సమాధి తప్పదన్న భయంతో చంద్రబాబు విద్వేషపూరిత రాజకీయాలకు పురి గొల్పుతున్నారు. కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి కోసం పాకులాడటం దిగజారుడుతనానికి పరాకాష్ఠ. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానులపై నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు చెబుతున్న అమరావతి నిర్మాణానికి ఇవాళ్టి ధరల ప్రకారం దాదాపు రూ.లక్షన్నర కోట్లు కావాలి. ఏళ్ల తరబడి పనులు కొనసాగించాలి. ఒక్క రాజధాని నిర్మాణం కోసమే దాదాపు రూ.6 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాలను వదిలేసి ఒక్క అమరావతినే అభివృద్ధి చేయడం సబబా? దీన్ని విజ్ఞులైన ప్రజలంతా ఆలోచించాలి.

దమ్ముంటే అసెంబ్లీకి రండి..

అధికారం చేపట్టిన మూడేళ్లలోనే ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చిన నాయకుడు ఈ దేశంలో మరెవరూ లేరు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. ఏపీ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఉంది. టీడీపీ నాయకులు దిగజారి మాట్లాడుతూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. మీకు దమ్ముంటే అసెంబ్లీకి రండి. ఈ మూడేళ్లలో ప్రజలకు ఏమేం చేశామో చెబుతాం. చంద్రబాబుకు అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేదు. ఇలాంటి విపక్షనేత ఉండడం మన దౌర్భాగ్యం.

మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నాం

- అసెంబ్లీ వేదికగా సంక్షేమాభివృద్ధిని వివరిస్తాం
- చంద్రబాబు అసెంబ్లీ సమావేశాలకు రావాలి
- ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి



సాక్షి, అమరావతి: అభివృద్ధితో దూసుకుపోతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మొహం చూపించలేకే చంద్రబాబు సభకు రావడం లేదని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. చర్చ అంటూ బయట సవాళ్లు విసరడం కాదని, చంద్రబాబు సహా ప్రతిపక్షం సభకు వచ్చి చర్చించాలని కోరారు. అభివృద్ధి వికేంద్రీకరణే తమ విధానం అని, మూడు రాజధానుల మాటకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 9 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతాయని, ఎన్నిరోజులు జరగాల నేది 10 గంటలకు జరిగే బీఏసీ సమావేశంలో ఫిక్స్ అవుతుందని చెప్పారు. పలు కీలక అంశాలను ఈ సమావేశాల్లో ప్రవేశ పెట్టనున్నామని, ప్రతిపక్షాలు కూడా సభకు రావాలని కోరుకుంటున్నామని తెలిపారు. సభలో ఎటువంటి చర్చకైనా తాము సిద్ధం అని చెప్పారు. వాళ్ల దగ్గర మాట్లాడటానికి ఏమీ లేక గైర్హాజరవుతున్నారని తెలిపారు. అమరావతి పాదయాత్ర ఉద్దేశం ఏమిటో.. దాని వెనుక ఎవరున్నారో అందరికీ తెలుసన్నారు. ఒకసారి హైదరాబాద్‌ను కోల్పోయి మన రాష్ట్రం నష్టపోయిందని, మళ్లీ మళ్లీ అదే తప్పు చేసేది లేదన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్నింటినీ అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరిస్తామని ప్రసాదరాజు పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలపై గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. ప్రతిపక్షం లేవనెత్తే ప్రతి అంశంపై సమాధానం చెప్పటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మూడు రాజధానుల విషయంలో గత అసెంబ్లీ సమావేశాల్లోనే సీఎం జగన్ చాలా స్పష్టంగా చెప్పారని, అభివృద్ధి వికేంద్రీకరణపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మూడు రాజధానులకు ప్రజల మద్దతు ఉందన్నారు.

క్లుప్తంగా

నేడు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవం

బాపట్ల: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ 54వ స్నాతకోత్సవం గురువారం బాపట్ల కళాశాలలో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. స్నాతకోత్సవ ఏర్పాట్లపై బుధవారం కళాశాలలో సమావేశం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. స్నాతకోత్సవంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన 22 మందికి, అండర్ గ్రాడ్యుయేట్‌లో 10 మందికి బంగారు పతకాలు అందజేస్తామన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ.ప్రతాప్‌కుమార్ రెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్పొరేటర్ భర్త


శ్రీధర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): జీవీఎంసీ 41వ వార్డు టీడీపీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ భర్త కోడిగుడ్ల శ్రీధర్ బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్ సీపీ రీజినల్ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు.

'బాలల సంరక్షణ కేంద్రాలకు అనుమతి తప్పనిసరి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు చెప్పారు. ఏ సంస్థ అయినా సరే బాలల సంరక్షణ కేంద్రాన్ని నిర్వహించాలని భావిస్తే బాలల న్యాయ చట్టం నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు తరచూ బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీలు చేస్తూ వసతులు సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

21న జస్టిస్ రాజా ఇలంగో పదవీ విరమణ

సాక్షి, అమరావతి: ఏపీ రియల్ ఎస్టేట్ అప్పీలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా ఉన్న మాజీ న్యాయమూర్తి జస్టిస్ రాజా ఇలంగో పదవీ కాలం ఈ నెల 21తో ముగియనుంది. అదేరోజు ఆయన పదవీ విరమణ చేయనున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులిచ్చారు.

తెనాలిలో కొనసాగిన అమరావతి యాత్ర


తెనాలి గాంధీచౌక్‌లో పాదయాత్ర

తెనాలిటౌన్/ తెనాలి అర్బన్: అమరావతిని మాత్రమే రాజధానిగా కొనసాగించాలనే డిమాండ్‌తో.. అరసవల్లికి అమరావతి జేఏసీ చేపట్టిన పాదయాత్ర బుధవారం తెనాలి నియోజకవర్గంలో కొనసాగింది. ఉదయం దుగ్గిరాలలో ప్రారంభమైన యాత్ర చింతలపూడి, నందివెలుగు మీదుగా మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో తెనాలి శివారులోని వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీకి చేరుకుంది. భోజన విరామం తర్వాత ఐతానగర్ మీదుగా తెనాలి పట్టణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని పోలీసులు అభ్యంతరం తెలిపారు. పాదయాత్రలో ఉన్న టీడీపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగి.. ఐతానగర్ రోడ్డులోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ప్రకాశం రోడ్డు, బోసు రోడ్డు, చినరావూరు తోట, జగ్గడిగుంటపాలెం మీదుగా పెదరావూరు చేరుకుని కల్యాణమండపంలో బస చేశారు. యాత్రలో జేఏసీ కన్వీనర్ గద్దె తిరుపతిరావు, శివారెడ్డి, పువ్వాడ సుధాకరరావు, మాజీ మంత్రులు ఆలపాటి రాజా, నక్కా ఆనందబాబు, దేవినేని ఉమా తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్య పథకం అమలుకు ఉత్తర్వులిచ్చాం

హైకోర్టుకు ఎస్జీపీ నివేదన

సాక్షి, అమరావతి: ముస్లిం విద్యార్థులకు విదేశీ విద్య పథకాన్ని అమలు చేసేందుకు తాజాగా ఉత్తర్వులు జారీ చేశామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్జీపీ) చింతల సుమన్ బుధవారం హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, విదేశీ విద్య పథకంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని మూసివేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

జనాభా తగ్గినా డేంజరే..

ఐరోపా దేశాల్లో ఈ సమస్య ఎక్కువ.. | అక్కడ జనాభా సరాసరి వయసు పెరుగుతోంది | జపాన్‌లో జనాభా తగ్గుదల ఆందోళనకరం.. | అక్కడ పనిచేసేవాళ్లు తగ్గుతున్నారు

ప్రపంచ దేశాల ముందు కొత్త సవాళ్లు

మన దేశానికి కనుచూపుమేరలో ఆ సమస్య లేదు

(ఎం. విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

జనాభా పెరగడమే అన్ని సమస్యలకు మూలమని ఇప్పటివరకు అందరిదీ అదే భావన. ఇప్పుడు ప్రపంచానికి సవాళ్లు విసురుతున్న అంశాల్లో జనాభా తగ్గుదల కూడా చేరింది. ఈ సమస్య అభివృద్ధి చెందిన దేశాల్లోనే ముందుగా వచ్చింది. ఆర్థికంగా, సాంకేతికంగా బలమైన వ్యవస్థలున్న జపాన్‌లాంటి దేశమే ఇప్పుడీ సమస్య ఎదుర్కొంటోంది. ఆసియా ఖండంలో ప్రస్తుతం జపాన్ ఒక్కటే ఈ సమస్యను ఎదుర్కొంటుండగా.. ఐరోపా ఖండంలో చాలా దేశాలను పీడిస్తోంది. జనాభా తగ్గుదల నమోదు కావడమంటే.. దేశ జనాభా సరాసరి వయసు పెరగడం. తద్వారా పనిచేసేవాళ్ల సంఖ్య తగ్గిపోతోంది. ఫలితంగా ఆర్థికాభివృద్ధి కుంటుపడటం, ప్రజారోగ్యం మీద ఖర్చు పెరగడంతో పన్నుల భారం పెరుగుతుండటం ఆయా సమాజాల్లో ఇప్పుడు కనిపిస్తోంది. అదే మన దేశంలో ప్రస్తుత సరాసరి వయసు 28.4ఏళ్లు. ఇది ఇప్పుడు మనకు కలిసొచ్చే అంశం.

పుడుతున్న ప్రతి వెయ్యి మందిలో మనోళ్లు 171 మంది

ప్రపంచంలో ప్రతి నాలుగు నిమిషాలకు దాదాపు వెయ్యి మంది పుడుతున్నారు. వీరిలో అత్యధికంగా 171 మంది మన దేశంలోనే ఊపిరిపోసుకుంటున్నారు. ఆ తర్వాత 102 మందితో చైనా రెండో స్థానంలో.. 56 మందితో మూడో స్థానంలో నైజీరియా ఉన్నాయి. అలాగే, పాకిస్తాన్ 47 మందితో నాల్గో స్థానంలో.. 31 మందితో కాంగో ఐదో స్థానంలో నిలిచింది. ఇలా టాప్-5లో ఆసియా, ఆఫ్రికా దేశాలే ఉన్నాయి.

- ఇక 140 కోట్ల జనాభా ఉన్న భారత్ ఈ జాబితాలో తొలిస్థానంలో ఉండటం పెద్ద ఆశ్చర్యం కాదు. ఎందుకంటే.. ప్రపంచ సరాసరి బర్త్‌రేట్ కంటే కొద్దిగానే ఎక్కువ. మన దేశంలో బర్త్‌రేట్ 17.7 ఉంటే, ప్రపంచ బర్త్‌రేట్ 16.8 ఉంది.
- అదే చైనా ప్రపంచ జనాభాలో నంబర్‌వన్. కానీ, జననాల సంఖ్య మన కంటే తక్కువగా ఉంది. అక్కడ ఇప్పటికే జనాభా పెరుగుదల మందగించింది. ఇదే తీరు కొనసాగితే.. జనాభా పెరుగుదల ఆగిపోవడం ఎంతోదూరంలో లేదని నిపుణుల అంచనా.
- ఇక నైజీరియా కథ వేరు. ఇక్కడ బర్త్‌రేట్ (34.2) ప్రపంచ బర్త్‌రేట్‌కు రెట్టింపుగా ఉంది. పేదరికం ఎక్కువగా ఉండటం, మహిళలు విద్యకు దూరంగా ఉండటమే ఇందుకు కారణం.

సంపద పెరిగితే జనాభా పెరుగుదల డౌన్

సంపద పెరిగిన దేశాల్లో బర్త్‌రేట్ తగ్గుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ జనాభా పెరుగుదల వేగం మందగించడం 1960లో మొదలైంది. ఇదే తీరు కొనసాగితే.. 2100 సంవత్సరానికి జనాభా పెరుగుదల ఆగిపోతుందని, ఆ తర్వాత ప్రపంచ జనాభా తగ్గుదల ప్రారంభమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. జనాభా తగ్గుదల మొదలైతే ప్రపంచ జనాభా సరాసరి వయసు పెరగడం మొదలవుతుంది. ఇది జరిగితే సమాజానికి వృద్ధాప్యలు వస్తాయి. చాలా దేశాలు ఇప్పుడీ సమస్యను ఎదుర్కొంటున్నాయి. 2050 నాటికి ప్రపంచంలో 20 దేశాల జనాభా ప్రమాదకరస్థాయిలో తగ్గుతుందని ఐక్యరాజ్య



సమితి అంచనా. కానీ, జనాభా తగ్గుదల అంశం మన దేశంలో కనుచూపుమేరలో లేదు.

- యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలతో పోలిస్తే పేద దేశంగా పరిగణించే బల్గేరియాలో జనాభా తగ్గుదల ప్రమాదకర స్థాయిలో ఉంది. ఇక్కడ గత మూడు దశాబ్దాల్లో జనాభా 20 శాతం తగ్గిపోయింది. మరో 30 ఏళ్లలో 22.5 శాతం తగ్గుతుందని ఐరాస అంచనా.
- ఇక ఉక్రెయిన్‌లోనూ బర్త్‌రేట్ బాగా తగ్గుతోంది. దేశం నుంచి వలసలూ పెరుగుతున్నాయి. ఫలితంగా వచ్చే 30 ఏళ్లలో దాదాపు 20 శాతం జనాభా తగ్గొచ్చు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధ ప్రభావాన్ని కలిపితే జనాభా మరింత వేగంగా తగ్గొచ్చు. మరోవైపు.. జనాభా తగ్గుతున్న దేశాలన్నీ ఐరోపా ఖండంలో ఉన్నవే. ఆసియాలో ఈ సమస్యలేదు. కానీ, జపాన్ కథ భిన్నంగా ఉంది. 2008లో 12.68 కోట్లు ఉన్న జనాభా ప్రస్తుతం 12 కోట్లకు తగ్గిపోయింది. 2050 నాటికి 10.58 కోట్లకు తగ్గుతుందని అంచనా. జనాభా తగ్గుదల అంటే.. దేశంలో చనిపోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటమే. పుట్టుకలు తగ్గుతున్నకొద్దీ.. జనాభా సరాసరి వయసు పెరుగుతుంది. అంటే పనిచేయగలిగే వయస్సున్న జనాభా తగ్గుతారు. 1950లో జపాన్ జనాభా సరాసరి వయసు 22ఏళ్లు. అదే 2020లో 48కు, ఇప్పుడు 49 ఏళ్లకు పెరిగింది. ఈ విషయంలో జపాన్‌ది తొలిస్థానం. ఫెర్టిలిటీ రేట్ (ఒక మహిళ జన్మనిస్తున్న పిల్లల సంఖ్య) ప్రస్తుతం 1.4 ఉంది. ఇది ప్రపంచ సరాసరిలో సగానికంటే తక్కువ.

ప్రతి వెయ్యి పుట్టుకల్లో ఏ దేశంలో ఎన్ని?

దేశం	ఖండం	జననాలు
భారత్	ఆసియా	171.62
చైనా	ఆసియా	102.84
నైజీరియా	ఆఫ్రికా	56.50
పాకిస్తాన్	ఆసియా	47.23
కాంగో	ఆఫ్రికా	31.90
ఇండోనేషియా	ఆసియా	31.20
యూఎస్ఏ	అమెరికా	30.42
ఇథియోపియా	ఆఫ్రికా	25.44
బ్రెజిల్	అమెరికా	22.27
బంగ్లాదేశ్	ఆసియా	21.52

2050 నాటికి ప్రమాదకర స్థాయిలో జనాభా తగ్గనున్న దేశాలు..

దేశం	తగ్గుదల శాతం
బల్గేరియా	22.5
లిథుయేనియా	22.1
లాట్వియా	21.6
ఉక్రెయిన్	19.5
సెర్బియా	18.9
బోస్నియా	18.2
క్రొయేషియా	18.0
మల్దోవా	16.7
జపాన్	16.3
అల్బేనియా	15.8
రొమేనియా	15.5
గ్రీస్	13.4
ఎస్తోనియా	12.7
హంగరీ	12.6
పోలండ్	12.0
జార్జియా	11.8
పోర్చుగల్	10.9
మెసడోనియా	10.9
క్యూబా	10.3
ఇటలీ	10.1

మన దేశానికి ప్రయోజనాలెన్నో..

మన దేశం విషయానికొస్తే.. ఇక్కడ జనాభా పెరుగుతోంది. 140.2 కోట్ల మందితో రెండో స్థానంలో ఉంది. ప్రపంచ జనాభాలో భారత్ వాటా 17.7 శాతం. దేశంలో ఏటా ఒక శాతం చొప్పున పెరుగుతోంది. త్వరలోనే చైనాను అధిగమిస్తామని నిపుణుల అంచనా. జనాభా పెరుగుదలతో పాటే మన జనాభా సరాసరి వయసూ పెరుగుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం..

- 1970లో దేశ జనాభా సరాసరి వయసు 19.3 ఏళ్లుగా నమోదైంది.
- 2015లో 26.8 ఏళ్లకు.. 2022లో 28.4, 2025లో 30 ఏళ్లు, 2030లో 31.7, 2050లో 38.1 ఏళ్లకు పెరుగుతుందని నిపుణుల అంచనా.
- గట్టిగా పనిచేయగలిగే వయస్సున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటంవల్ల ఆర్థికాభివృద్ధి వేగంగా పెరుగుతోంది.
- వీరికి పని కల్పించడం ప్రభుత్వాల ముందున్న పెద్ద సవాలు.
- ఈ నేపథ్యంలో.. జనాభా తగ్గుదల సమస్య మనకు ఇప్పట్లో లేకపోయినా, శతాబ్దం తర్వాత మనదీ ఐరోపా దేశాల పరిస్థితే అని అంచనా.

హిరమండలం ఎత్తిపోతలకు గ్రీన్‌సిగ్నల్

- రూ.176.35 కోట్లతో పరిపాలన అనుమతి ఇచ్చిన ప్రభుత్వం
- గొట్టా బ్యారేజ్ జలవిస్తరణ ప్రాంతం నుంచి రోజుకు 1,400 క్యూసెక్కుల ఎత్తిపోత



సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లాలో వంశధార ఫేజ్-2, స్టేజ్-2 ఆయకట్టు రైతులకు ముందస్తు ఫలాలను అందించడం.. ఫేజ్-1 స్టేజ్-2 ఆయకట్టు, నారాయణపురం ఆనకట్ట ఆయకట్టును స్థిరీకరించడం, ఉద్దానం ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా హిరమండలం ఎత్తిపోతలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ఎత్తిపోతల పథకం పనులు చేపట్టడానికి రూ.176.35 కోట్లతో పరిపాలన అనుమతి ఇస్తూ బుధవారం జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. వంశధార నదిలో గొట్టా బ్యారేజ్ వద్ద నీటి లభ్యతపై 2007 ఆగస్టులో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మళ్లీ అధ్యయనం చేసింది. ఇందులో గొట్టా బ్యారేజ్ వద్ద 105 టీఎంసీల లభ్యత ఉన్నట్లు తేల్చింది. ఇందులో రాష్ట్ర వాటా 52.5 టీఎంసీలు. వంశధార స్టేజ్-1, స్టేజ్-2ల ద్వారా 34.611 టీఎంసీలను మాత్రమే వినియోగించుకుంటున్నారు. రాష్ట్ర వాటాలో ఇంకా 17.439 టీఎంసీలను వాడుకోవడానికి అవకాశం ఉంది. ఆ నీటిని వాడుకోవడానికి వంశధార ఫేజ్-2 స్టేజ్-2ను జలయజ్ఞంలో భాగంగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. ఈ ప్రాజెక్టుపై ఒడిశా సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. నేరడి బ్యారేజ్ స్థానంలో కాట్రగడ్డ వద్ద సైడ్ వియర్‌ను నిర్మించి.. వరద కాలువ ద్వారా హిరమండలం రిజర్వాయర్ (19.5 టీఎంసీల సామర్థ్యం)కు మళ్లించి.. వంశధార పాత ఆయకట్టు 2,10,510 ఎకరాలను స్థిరీకరించడంతోపాటు కొత్తగా 45 వేల ఎకరాలకు నీళ్లందించే పనులను చేపట్టారు. సైడ్ వియర్ వల్ల ఎనిమిది టీఎంసీలను మాత్రమే హిరమండలం రిజర్వాయర్‌కు తరలించవచ్చు.

గొట్టా బ్యారేజ్ నుంచి కుడికాలువ మీదుగా..

నేరడి బ్యారేజ్‌కు వంశధార ట్రిబ్యునల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ.. ట్రిబ్యునల్ తీర్పుపై ఒడిశా సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో దాన్ని కేంద్రం నోటిఫై చేయలేదు. ఈ నేపథ్యంలో నేరడి బ్యారేజ్ నిర్మాణానికి ఒడిశా సర్కార్‌ను ఒప్పించడం కోసం భువనేశ్వర్ వెళ్లిన సీఎం వైఎస్ జగన్.. ఆ రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్‌తో దౌత్యం జరిపారు. ఓ వైపు నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటూనే మరోవైపు ప్రాజెక్టు ముందస్తు ఫలాలను అందించడం కోసం గొట్టా బ్యారేజ్ నుంచి రోజుకు 1,400 క్యూసెక్కుల చొప్పున వందరోజుల్లో 10 నుంచి 14 టీఎంసీలను తరలించేలా ఎత్తిపోతల పథకం చేపట్టడానికి ప్రతిపాదనలు పంపాలని మే 10న జలవనరుల శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. గొట్టా బ్యారేజ్ జలవిస్తరణ ప్రాంతం నుంచి 1,400 క్యూసెక్కులను 650 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోసి.. వంశధార కుడికాలువలో 2.4 కిలోమీటర్ల వద్దకు ఎత్తిపోస్తారు. ఈ నీటిని హిరమండలం రిజర్వాయర్‌కు తరలించడానికి వీలుగా 2.5 కిలోమీటర్ల పొడవున కుడికాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 2,265 క్యూసెక్కులకు పెంచుతారు. వందరోజుల్లో 10 నుంచి 12 టీఎంసీలను హిరమండలం రిజర్వాయర్‌లోకి తరలిస్తారు. తద్వారా వంశధారలో వాటా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని వంశధార స్టేజ్-1, స్టేజ్-2ల కింద 2,55,510 ఎకరాలకు నీళ్లందించడంతోపాటు వంశధార-నాగావళి అనుసంధానం ద్వారా నారాయణపురం ఆనకట్ట కింద ఉన్న 37 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తారు. హిరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానానికి తాగునీటి కోసం 0.712 టీఎంసీలను సరఫరా చేస్తారు.

అసెంబ్లీ సమావేశాలకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులతో మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ సమీక్ష

సాక్షి, అమరావతి: గురువారం నుంచి జరగనున్న ఆంధ్రప్రదేశ్ శాసన మండలి, శాసన సభ సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ అన్ని శాఖల కార్యదర్శులను కోరారు. సమాచార, సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా పెరిగిపోయిన నేపథ్యంలో యావత్ ప్రజల దృష్టి ఈ సమావేశాలపై ఉంటుందనే విషయాన్ని అధికారులు అందరూ గుర్తించాలని చెప్పారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ హాల్లో పలు శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులతో వారు వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సభ్యులు అడిగే ప్రశ్నలకు సకాలంలో సరైన సమాధానాలను అందిస్తూ వారి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అటువంటి సత్సంప్రదాయం కొనసాగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గత సమావేశాల్లో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలలో కొన్నింటికి ఇంకా సమాధానాలు అందజేయాల్సి ఉందని, వాటిని ఈ సమావేశాల్లో అందజేయాలని చెప్పారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు అందజేసేందుకు ప్రతి శాఖ ఒక లైజనింగ్ అధికారిని నియమించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేల మెడికల్ బిల్లుల చెల్లింపుపై ఆర్థిక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న మాజీ ప్రజా ప్రతినిధులకు వారు నివాసం ఉంటున్న ప్రాంతంలోనే ఔషధాలను అందజేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.

పటిష్టంగా నిఘా ఏర్పాట్లు

ప్రశాంత వాతావరణంలో సమావేశాలు కొనసాగేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్‌లు.. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని కోరారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడా లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సభ్యులు బస చేసే ప్రాంతాలు మొదలు వారు సమావేశాలకు హాజరయ్యేంత వరకు రాకపోకలకు అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు, చీఫ్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి, శాసన సభ సెక్రటరీ పి.బాలకృష్ణమాచార్యులు, శాసన మండలి ఓఎస్డీ కె.సత్యనారాయణరావు, పలు శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఉన్నతాధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహేంద్రతనయ వ్యయం రూ.852.44 కోట్లకు సవరణ

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లాలో అత్యంత వెనుకబడిన పలాస, నందిగం, మెలియపుట్టి మండలాలకు వరదాయిని అయిన మహేంద్రతనయ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.852,44,96,000కు ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మహేంద్రతనయ నదిపై మెలియపుట్టి మండలం చాపర వద్ద రెగ్యులేటర్ నిర్మించి.. 13.575 కిలోమీటర్ల పొడవున తవ్వే వరద కాలువ ద్వారా నీటిని రేగులపాడు వద్ద రెండు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే రిజర్వాయర్‌కు తరలించేలా చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులకు 2007 జనవరి 4న రూ.127 కోట్లతో ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. ఈ పనులను రూ.123.25 కోట్లతో ఏడాదిలో పూర్తిచేసేలా ఎస్వీఈసీ-ఇందూ (జేవీ) సంస్థ 2008 ఫిబ్రవరి 18న ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 24,600 ఎకరాలకు నీళ్లందించాలన్నది లక్ష్యం. కానీ భూసేకరణ సమస్యల వల్ల గడువులోగా పనులను పూర్తిచేయలేదు. పనుల్లో జాప్యం జరగడం వల్ల అంచనా వ్యయాన్ని రూ.471.85 కోట్లకు సవరిస్తూ 2018 ఆగస్టు 9న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పనులు పూర్తిచేయలేని కాంట్రాక్టు సంస్థ.. ఒప్పందాన్ని రద్దుచేయాలని ప్రభుత్వాన్ని కోరింది. దీంతో ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దుచేసింది. భూమి ధరలు, చేయాల్సిన పనుల పరిమాణం, స్టీలు, సిమెంటు, డీజిల్ ధరలు పెరగడంతో అంచనా వ్యయాన్ని రూ.471.85 కోట్ల నుంచి రూ.852.44 కోట్లకు సవరించాలని నార్త్ కోస్ట్ విభాగం సీఈ జూలై 1న పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

వారిపై కఠిన చర్యలు తీసుకోండి

- సీఎం సతీమణి భారతిపై దుష్ప్రచారం చేస్తున్నారు
- డీజీపీకి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పద్మ ఫిర్యాదు
- టీడీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా, సోషల్ మీడియా కుట్ర ఇది



డీజీపీకి ఫిర్యాదు చేస్తున్న వాసిరెడ్డి పద్మ

సాక్షి, అమరావతిబ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ డీజీపీని కోరారు. ఆమె బుధవారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి కలిసి ఈమేరకు ఫిర్యాదు చేశారు. వైఎస్ భారతి గతంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ నిందాపూర్వకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నవారు, యూట్యూబర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ పోస్టులను సోషల్ మీడియా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పద్మ విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా, సోషల్ మీడియా వైఎస్ భారతిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పారిశ్రామికవేత్త, సామాజిక సేవాతత్పరురాలు భారతిపై దుష్ప్రచారం చేయడాన్ని యావత్ సమాజం ఖండిస్తోందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం టీడీపీ ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తోందన్నారు. మహిళలను అడ్డంపెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుకునే ఎవరికైనా కఠినమైన సంకేతాలు పంపాల్సిన అవసరం ఉన్నందునే డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వరద గోదావరి

ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 13.74 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

సాక్షి, అమరావతి/ధవళేశ్వరం/చింతూరు/పోలవరం రూరల్/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ప్రవాహం మరింత పెరిగింది. బుధవారం ఉదయం 10 గంటలకు నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేసిన అధికారులు.. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. సాయంత్రం 6 గంటలకు బ్యారేజ్‌లోకి 13,74,840 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటిమట్టం 14.40 అడుగులకు చేరింది. గోదావరి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు 8,800 క్యూసెక్కులు విడుదల చేస్తూ మిగిలిన 13,66,040 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. పరివాహక ప్రాంతం (బేసిన్)లో ఎగువన వర్షాలు తగ్గడంతో గోదావరిలో వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. వరదను పోలవరం వద్ద ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్న అధికారులు.. 48 గేట్ల ద్వారా 11,62,898 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం 33.930 మీటర్లకు చేరుకుంది.


పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద వరద ప్రవాహం

ప్రకాశం బ్యారేజ్ నుంచి 2.74 లక్షల క్యూసెక్కులు కడలిలోకి

పశ్చిమ కనుమల్లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా, ఉపనదుల్లో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయిని, జూరాల, తుంగభద్రల్లోకి వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం 6 గంటలకు 3,51,446 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. ఈ ప్రాజెక్టు స్పిల్ వే పదిగేట్లను పదడుగులు ఎత్తి 2,79,830, కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 62,374.. కలిపి 3,42,204 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి 2,80,397 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. జలాశయం 16 గేట్లను పదడుగులు ఎత్తి 2,36,400, క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 32,480.. కలిపి 2,68,880 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి 2,85,181 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు 11,031 క్యూసెక్కులు విడుదల చేస్తూ మిగిలిన 2,74,150 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

50,284 మంది ఆప్షన్ల నమోదు

ఈఏపీ సెట్ కౌన్సెలింగ్‌లో తొలి రోజు 11,98,871 ఆప్షన్లు

సాక్షి, అమరావతి: ఈఏపీ సెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదు తొలి రోజు 50,284 మంది ఆప్షన్లను నమోదు చేశారు. 1,02,133 మంది రిజిస్టర్ చేసుకోగా మిగతా వారు ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంది. మొత్తంగా 11,98,871 ఆప్షన్లను ఇచ్చారు.

ఇంటర్, పాఠశాల విద్యల ఏకీకరణపై కమిటీ

జాతీయ నూతన విద్యావిధానాన్ని అనుసరించి రాష్ట్రంలో పాఠశాల, ఇంటర్ విద్యల ఏకీకరణపై ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు గత నెలలో ఏర్పాటైన కమిటీ ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. త్వరలోనే దీనిపై విద్యా శాఖ నిర్ణయం తీసుకోనుంది.

నేడు టెట్ ఫైనల్ 'కీ' విడుదల

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) తుది 'కీ' గురువారం వెలువడుతుందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతరం నార్మలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి.. వారంలో ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు.

రచ్చే.. చర్చ వద్దు

- ఎమ్మెల్యేలకు చంద్రబాబు దిశానిర్దేశం
- ఎలా గొడవ చేయాలనే విషయంపై రోజంతా మంతనాలు
- రాజధాని అంశంపైనే రగడ చేయాలని నిర్ణయం
- 15 రోజులు సభ జరపాలని పట్టుబట్టాలని బాబు సూచన
- తాను సభకు రానని వెల్లడి



సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలు స్తంభించేలా గొడవ చేయాలని టీడీపీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. మూడు రాజధానుల అంశంపై ప్రభుత్వం బిల్లు పెట్టినా, చర్చ పెట్టినా అందులో పాల్గొనకుండా అసెంబ్లీని రద్దు చేయాలని డిమాండ్ చేయాలని పదే పదే స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బుధవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఉదయం నుంచి రాత్రి వరకు చంద్రబాబు చర్చలు జరిపారు. సభకు ఆటంకం కలిగించేలా ఏం చేయాలనే విషయంపై ఎమ్మెల్యేలతో చంద్రబాబు చర్చించారు. మూడు రాజధానుల అంశాన్ని రిఫరెండంగా తీసుకుని అసెంబ్లీని రద్దు చేయాలనే డిమాండ్‌ను శాసన సభ, మండలిలో పెట్టి దానిపైనే గొడవ చేయాలని నిర్ణయించారు. సభ జరగకుండా అడ్డుకోవాలని, ఇందుకోసం మొదటి రోజే మూడు రాజధానులపై అసెంబ్లీ రద్దు డిమాండ్‌ను లేవనెత్తి అధికారపక్షాన్ని అడ్డుకోవాలని నిర్ణయించారు. గత సమావేశాల్లో శాసన సభ నిబంధనలకు విరుద్ధంగా సభలోకి చిడతలు తీసుకెళ్లి వాయించినట్లు ఈసారి కూడా అలాంటిది ఏదైనా చేసి సభను అడ్డుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. నిరుద్యోగం – యువత ఆందోళన, జగన్ పాలనలో పన్నుల బాదుడు, వరి వేసుకుంటే ఉరే, ఇసుక, మద్యం దోపిడీ వంటి అంశాలపై చర్చకు పట్టుబట్టాలని చంద్రబాబు సూచించారు. వీటిపైనా చర్చకు పట్టుబట్టి గొడవకు దిగాలని సూచించినట్లు తెలిసింది. శాసనమండలిలోనూ ఇవే అంశాలను లేవనెత్తి సభను అడ్డుకోవాలని సూచించారు. గొడవ చేయడం ద్వారానే మీడియాలో ఫోకస్ అవ్వాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజులు నిర్వహించాలని బీఏసీలో డిమాండ్ చేయాలని, తక్కువ రోజులు సమావేశాలు జరపడాన్ని ప్రశ్నించాలని చంద్రబాబు ఎమ్మెల్యేలకు సూచించారు. గతంలో చెప్పినట్లుగానే అసెంబ్లీ సమావేశాలకు తాను దూరంగా ఉంటానని చంద్రబాబు చెప్పారు. కానీ ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తానని, వాటికి అనుగుణంగా పని చేయాలని సూచించారు.

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
గురువారం ॥ 15-9-2022

విజయపథం

గేమింగ్‌లో గెలుపు జెండా


పాయల్ ధారే

'ఉమన్ గేమర్! వినడానికి కొత్తగా ఉంది' అని ఒకరు ఎగతాళిగా నవ్వారు.

'ఆడడం బాగానే ఉంటుందిగానీ, కెరీర్‌కు బాగుండదు' అని గంభీరస్వరంతో నిరాశ పరిచారు మరొకరు. అంతా అయోమయంగా ఉంది.

అలా అని ఆగిపోలేదు. ఓనమాలు నేర్చుకుంటూనే, కొత్త విషయాలపై పట్టు సంపాదిస్తూనే మేల్-డామినేటెడ్ స్పేస్ అనుకునే గేమింగ్‌లో బిగ్గెస్ట్ యూట్యూబ్ ఉమన్ గేమర్(ఇండియా)గా గెలుపు జెండా ఎగరేసింది పాయల్ ధారే...

కరోనా మహమ్మారి పదునుగా కోరలు చాస్తున్న సమయంలో, లాక్‌డౌన్ రోజుల్లో మధ్యప్రదేశ్‌లోని చింద్వారాకు చెందిన పాయల్ ధారే గేమింగ్-ఫోకస్డ్ ఛానల్‌కు శ్రీకారం చుట్టింది. నిజం చెప్పాలంటే యూట్యూబ్ వీడియో ప్లాట్‌ఫామ్‌పై లైవ్‌స్ట్రీమింగ్ కంటెంట్ గురించి ఆమెకు అంతగా అవగాహన లేదు. కాలేజీలో స్నేహితులతో కలిసి 'పబ్జీ' గేమ్ ఇష్టంగా ఆడేది. 'పబ్జీ'ని నిషేధిస్తారనిగానీ, గేమింగ్‌ను తాను కెరీర్‌గా ఎంచుకుంటాననిగానీ అనుకోలేదు పాయల్. గేమింగ్‌పై ఇష్టం పెరుగుతున్న క్రమంలో తన మనసులో మాటను ఇంట్లో చెప్పింది.

'గేమింగ్‌నే కెరీర్‌గా ఎంచుకుంటాను'

తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. 'చదువుపై దృష్టి పెట్టు' అని మందలించారు.

వారిని ఒప్పించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఎట్టకేలకు తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. అలా తొలి విజయం సాధించింది పాయల్. తాము ఉండే చింద్వారా పట్టణంలో ఇంటర్నెట్ కనెక్టివిటీ అంతంత మాత్రమే. మొదట్లో ఇన్‌స్టాగ్రామ్‌లో గేమింగ్ సెషన్స్ క్లిప్స్‌ను పోస్ట్ చేసేది. 100కి ఫాలోవర్స్‌తో తన మీద తనకు నమ్మకం వచ్చింది.

ఈ సమయంలోనే యూట్యూబ్‌లో ప్రయత్నించమని స్నేహితులు, ఫాలోవర్స్ నుంచి ఒక సూచన వచ్చింది. 'ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం సులభం కాబట్టి మొదట దాన్నే ఎంచుకున్నాను. మీ గేమింగ్ స్కిల్స్‌కు యూట్యూబ్ అనేది సరియైన వేదిక అనే సలహాతో పాయల్ గేమింగ్ పేరుతో యూట్యూబ్ ఛానల్ మొదలు పెట్టాను' అంటుంది పాయల్.

ఛానల్ మొదలైన తరువాత రకరకాల విషయాలు స్వయంగా నేర్చుకోవడం మొదలుపెట్టింది. ప్రేక్షకుల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేది. లైవ్‌స్ట్రీమింగ్ గురించి ఎన్నో రోజులు రిసెర్చ్ చేసింది. ఎలాంటి కంటెంట్‌ను ప్రజలు ఇష్టపడుతున్నారు? లైవ్‌స్ట్రీమింగ్ పనితీరు ఎలా ఉంటుంది? ఇప్పుడున్న గేమింగ్ ఛానల్స్‌కు భిన్నంగా ఎలా ప్రయత్నించవచ్చు....ఇలా రకకరాల విషయాలపై లోతైన పరిశోధన చేసింది.

పాయల్ కాస్త సిగ్గరి. నలుగురి ముందు మాట్లాడాలంటే భయం. కెమెరా ఫేస్ చేయాలంటే కష్టం. 'ఒకటి సాధించాలని బలంగా అనుకొని బరిలోకి దిగితే, వారిలోని రెండు లోపాలు మాయమవుతాయి' అంటారు. పాయల్ విషయంలోనూ అదే జరిగింది. బరిలోకి దిగిన తరువాత కెమెరాను హాయిగా ఫేస్ చేయడం నేర్చుకుంది. బెటర్ ఇంటర్నెట్ కోసం సొంత పట్టణం వదిలి, అక్కడికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతానికి మారాలనుకున్నప్పుడు తల్లిదండ్రులు వద్దని గట్టిగా చెప్పారు. వారిని ఒప్పించడానికి చాలా సమయమే పట్టింది. అయితే ఇక్కడికి మారిన తరువాత సబ్‌స్క్రైబర్‌ల సంఖ్య బాగా పెరిగింది. మొదట్లో తనకు పేరున్న గేమర్స్‌లాగా పర్సనల్ కంప్యూటర్ సెటప్ లేదు. లైవ్‌స్ట్రీమ్, అప్‌లోడ్‌కు తన దగ్గర ఉన్న ఫోన్ తప్ప మరో మార్గం లేదు. ఇప్పుడు మాత్రం తన దగ్గర డ్యూయల్ మానిటర్స్‌తో కూడిన మంచి పీసీ సెటప్ ఉంది. 'పాయల్ గేమింగ్' ఛానల్ 2.5 మిలియన్ సబ్‌స్క్రైబర్‌లతో దూసుకుపోతుంది. ఈ విజయాన్ని పాయల్ ఊహించలేదు. అయితే ఇది అంత సులువుగా దక్కిన విజయం కాదు.

'సబ్‌స్క్రైబర్‌లు కొద్దిమంది మాత్రమే ఉన్నప్పుడు పెద్దగా ఎవరి దృష్టి ఉండదు. అయితే ఆ ఛానల్ విజయవంతంగా దూసుకుపోతున్నప్పుడు అందరి దృష్టి దానిపైనే ఉంటుంది. ప్రోత్సహించే వారి కంటే రాళ్లు రువ్వే వాళ్లే ఎక్కువగా ఉంటారు. నా లైవ్‌స్ట్రీమ్స్‌పై కొందరు హేట్ కామెంట్స్ చేశారు. కొందరు బాడీ షేమింగ్ చేశారు. మొదట్లో బాధపడేదాన్ని. వారు ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారనే విషయం అర్థమైన తరువాత వాటిని తేలికగా తీసుకున్నాను' అంటుంది పాయల్.

విజయం కోసం పోరాటం ఎంత ముఖ్యమో, ఆ విజయాన్ని నిలుపు కోవడం కోసం గట్టిగా నిలబడడం కూడా అంతే ముఖ్యం. పాయల్ ధారే ప్రస్తుతం అదే ప్రయత్నంలో ఉంది.

రంగుల ప్రయాణం

'రిస్క్ తీసుకోకపోతే గ్రోత్ ఉండదు'
కవితారాజేశ్‌కు ఆమె భర్త చెప్పిన మాట.
ఆ స్ఫూర్తితోనే రిస్క్ తీసుకున్నారామె.
ఒక రిస్క్ తర్వాత మరొక రిస్క్.
రిస్క్ అంటే...
'ప్రమాదం వెంట పరుగెత్తడం కాదు
ప్రయోగాలతో కలిసి ప్రయాణం చేయడం'
ఇది ఆమె చెబుతున్న కొత్త నిర్వచనం.
హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్
బాధ్యతల్లో ఆమెది తనదైన ప్రత్యేక శైలి.
ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆమెది రంగులలోకం.
సక్సెస్‌కి కలర్ ఉండదు...
అన్ని రంగుల కలయికే సక్సెస్.
కెమికల్ కలర్స్ నుంచి ఎకో ఫ్రెండ్లీ కలర్స్
వరకు సాగిన ఆమె సక్సెస్‌ఫుల్ జర్నీ.


కవితా రాజేశ్

''మాది మెదక్ జిల్లా జోగిపేట. నేను పుట్టింది పెరిగింది హైదరాబాద్‌లోనే. ఐఐఎమ్‌సీ నుంచి బీకామ్ ఆనర్స్ చేశాను. ఎల్ఎల్‌బీ కూడా చేశాను. ఉద్యోగం, లా ప్రాక్టీస్ కంటే పెద్దగా ఏదైనా చేయాలని ఉండేది. లైఫ్ హాయిగా గడిపేయాలనుకుంటే ఏదీ సాధించలేం. రిస్క్ అని భయపడుతూ ఉంటే జీవితం కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంటుంది. రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. అందులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి కూడా ప్రిపేర్ కావాలి. గెలిచి తీరడమే మన లక్ష్యం అయి ఉండాలి. ఇక రెండో ఆప్షన్ కోసం పక్కకు చూడకూడదు. మనవంతుగా పని చేస్తూ ఉంటే గెలుపు మనదై తీరుతుంది. కొన్ని సార్లు గెలుపు ఆలస్యం కావచ్చేమో కానీ గెలుపు రాకుండా ఉండదని నా నమ్మకం. మా నాన్న వయసు రీత్యా ఆయన నడిపిస్తున్న పెయింట్స్ ఇండస్ట్రీ అప్పటికే ఇబ్బందుల్లో ఉంది. మొదలు పెట్టడమే సిక్ ఇండస్ట్రీతో ఎలా అనే ఆందోళన ఉన్నప్పటికీ సాహసం చేశాను. మా హజ్బెండ్, అత్తగారు కూడా ప్రోత్సహించారు. లాభమైనా, నష్టమైనా అంతా కుటుంబంలోనే కాబట్టి మొదలు పెట్టమనే భరోసా ఇచ్చారు నాన్న. అలా ఓం సాయి ఆంధ్రా పెయింట్స్‌ని టేకోవర్ చేశాను. ఏడాదికే లాభాల్లోకి వచ్చింది పరిశ్రమ. లాభాల్లోకి వచ్చిన వెంటనే రిలాక్స్ అయితే పరిశ్రమను విస్తరణ ఆగిపోతుంది. మాకు లెర్నింగ్ పీరియడ్ మూడేళ్లపాటు సాగింది. బాలానగర్‌లో ఎనిమిది వందల చదరపు అడుగుల విస్తీర్ణంలో మొదలైంది నా రంగుల ప్రస్థానం. ఇప్పుడది పదివేల చదరపు అడుగుల పరిశ్రమ. ఎలీప్ ఇండస్ట్రియల్ పార్కులో గోల్డ్‌సీల్ గుర్తింపుతో నడుస్తోంది. ఐఎస్‌బీ గోల్డ్‌మ్యాన్ సాచె ప్రోగ్రామ్, ఎలీప్‌తో ప్రయాణం నన్ను బాగా తీర్చిదిద్దాయి.

ఇవాంకతో భేటీ

గోల్డ్ మ్యాన్ సాచ్ టెన్ థౌజండ్స్ నుంచి వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2019కి హాజరయ్యే అవకాశం వచ్చిన ఏకైక భారతీయ మహిళను. గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ 2017 హైదరాబాద్‌లో జరిగింది. ఇవాంక ట్రంప్ కూడా వచ్చారు. ఆ సమావేశానికి ఆహ్వానం వచ్చిందంటే కారణం పరిశ్రమను విజయవంతంగా నడిపించడమే. ఒక విజయాన్ని మనం సాధిస్తే... మరికొన్ని విజయాలు వాటంతట అవే వచ్చి తోడు నిలుస్తాయి. మహిళలకు నేను చెప్పేది ఒక్కటే... 'మాకు తెలియదు' అనుకోవద్దు. టెక్నాలజీ తెలియదు కాబట్టి, మేము ఇందులో సక్సెస్ కాలేము... అని భయపడే వాళ్లెందరో. ఇండస్ట్రీని నడిపించడానికి టెక్నాలజీ వచ్చి తీరాలనేమీ లేదు, టెక్నాలజీ తెలిసిన వ్యక్తిని ఉద్యోగంలో నియమించుకోవచ్చు. కాలానుగుణంగా మారడానికి కొత్త అవసరాలకు తగినట్లు మనల్ని, మన పరిశ్రమను మార్చుకోవడానికి సిద్ధంగా ఉంటే చాలు. రసాయన రంగులతో మొదలైన నా పరిశ్రమ ఇప్పుడు డెకొరేటివ్, ఇండస్ట్రియల్, స్పెషలైజ్‌డ్ పెయింట్స్‌తోపాటు ఎకో ఫ్రెండ్లీ టాయ్ పెయింట్స్ తయారీకి చేరింది.

మేనేజ్‌మెంట్ ఓ నైపుణ్యం

మూడు వేలకు పైగా సభ్యులున్న హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎమ్ఎ) ప్రెసిడెంట్ బాధ్యతలు నిర్వర్తించడం నాకు అత్యంత సంతృప్తినిచ్చింది. పాస్ట్ ప్రెసిడెంట్స్ నన్ను బాగా ప్రోత్సహించారు. 58 ఏళ్ల ఈ అసోసియేషన్‌కి ప్రెసిడెంట్ బాధ్యతలు నిర్వహించిన మూడో మహిళను. మహిళల్లో బెస్ట్ అనిపించుకోవాలనే టార్గెట్ పెట్టుకోలేదు నేను. ఇప్పటి వరకు పని చేసిన అందరు ప్రెసిడెంట్‌లలోనూ బెస్ట్‌గా నిలవాలనే లక్ష్యంతో పని చేశాను. ఆఫీస్‌ని ఆల్ ఉమెన్ ఆఫీస్‌గా మార్చాను. దేశవిదేశాల ఎంబసీలు, కాన్సులేట్‌లతో పని చేశాం. స్టూడెంట్స్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్ కోసం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌ని కెనడా ఎంబసీతో అనుసంధానం చేయడం వంటివి చాలా చేశాం. సోషల్ ఇంపాక్ట్ ప్రోగ్రామ్‌లలో ప్రభుత్వ పాఠశాలలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ తవ్వించడం వంటివెన్నో... కోవిడ్ సమయంలో కూడా వందకు పైగా కార్యక్రమాలు నిర్వహించాం. కమిటీ సభ్యులందరినీ ఇన్‌వాల్వ్ చేస్తూ పోవడంతోనే ప్రెసిడెంట్‌గా నేను విజయవంతమయ్యాను.

- కవితా రాజేశ్, ప్రొప్రయిటర్
ఓం సాయి ఆంధ్రా పెయింట్స్, హైదరాబాద్

కొత్తగా ఏది ప్రవేశపెట్టాలన్నా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో పరిశోధనలు చేస్తాం. నాకు ఆ సాంకేతిక పరిజ్ఞానం ఉండితీరాల్సిన అవసరం లేదు. అందుకు తగిన నిపుణులున్నారు.

పని పంపకం

ఒకప్పుడు పనులన్నీ నా భుజాల మీదనే మోసేదాన్ని. ఆరోగ్యం పాడైన తర్వాత వర్క్ డెలిగేషన్ నేర్చుకున్నాను. ఇంజనీరింగ్, ఎంబీఏ, డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కాలేజీల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా నా లెక్చర్స్‌లో 'మనం ఎదగాలి, మనతోపాటు పక్క వారిని ఎదగనివ్వాలి. ఆ ఎదుగుదల ఆర్థికంగానూ, ఆ వ్యక్తి ఇండిపెండెంట్‌గా నిలబడగలిగేటట్లు కూడా ఉండాలి. ఒకరి ఎదుగుదలకు మనం తోడ్పడితే వారి నుంచి వెలువడే కృతజ్ఞతలే మనల్ని నిలబెడతాయి' అని చెబుతుంటాను. ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఐమా) కౌన్సిల్ మెంబర్‌ని, ఇండో- పసిఫిక్ స్టడీస్‌కి కౌన్సిల్ మెంబర్‌ని కూడా. ఇన్ని బాధ్యతలలో అత్యంత చాలెంజింగ్ జాబ్ మా స్టీల్ మైన్స్ అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ బాధ్యతలే'' అన్నారామె నవ్వుతూ. పురాతన వస్తువుల సేకరణను ఇష్టపడే కవితారాజేశ్ ఇంట్లో ఈస్ట్ ఇండియా కంపెనీ తయారు చేసిన ఫ్యాన్ ఇప్పటికీ తిరుగుతోంది.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : మోర్ల అనిల్ కుమార్

టిప్

తైలమే కాదు టీ కూడా!



ఈ మధ్య కాలంలో జుట్టు రాలడం, చిన్నవయసులో తెల్లజుట్టు రావడం సర్వసాధారణమైపోయింది. అయితే మందార తైలమే కాకుండా, మందార పువ్వుల టీ కూడా జుట్టురాలడాన్ని నియంత్రిస్తుందని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో వేడి ఎక్కువైనా జుట్టు రాలడం అధికంగా ఉంటుంది. శరీర వేడిని తగ్గించడంలో మందార టీ చక్కగా పనిచేస్తుంది. మరి ఈ టీని ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం...

● తాజాగా ఉన్న ఎర్రమందార పువ్వు రేకులను గిన్నెలో వేసి మునిగేన్ని నీళ్లు పోసి పదినిమిషాలు నానబెట్టాలి ● నానాక ఈ నీటిలో టీస్పూను గ్రీన్‌టీ పోసి పది నిమిషాలపాటు మరిగించాలి ● చక్కగా మరిగిన తరువాత నీటిని వడగట్టి వేడిగా ఉన్నప్పుడే తాగాలి ● రోజూ ఈ టీ తాగడం వల్ల శరీరానికి విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్, ఎమినోయాసిడ్స్ అంది జుట్టురాలడం తగ్గి ఒత్తుగా పెరుగుతుంది.

విభిన్నం

ఈ ప్లాస్టిక్... పర్యావరణ హితం

పెనుముప్పుగా పరిణమిస్తోన్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ''రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్'' నినాదాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని ప్రపంచదేశాల్లోని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ఈ మాటలను సీరియస్‌గా తీసుకుని ఆచరించేవారు తక్కువే. కానీ సామాజిక స్పృహ కలిగిన కొంతమంది మాత్రం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి తమ వంతు సాయంగా సరికొత్త పరిష్కార మార్గాలతో ముందుకొస్తున్నారు. ఈ కోవకు చెందిన నేహా జైన్ టెక్ ఉద్యోగాన్నీ సైతం వదిలేసి మట్టిలో వేగంగా కలిసిపోయే బయోప్లాస్టిక్‌ను రూపొందిస్తోంది. సముద్ర నాచుతో తక్కువ ఖర్చుతో ట్రాన్స్‌పరెంట్ ప్లాస్టిక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి, కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషిచేస్తోంది.

ముంబైకి చెందిన నేహా జైన్ చిన్నప్పటి నుంచి విభిన్నంగా ఆలోచించేది. బెంగళూరులోని క్రైస్ట్ కాలేజీలో జర్నలిజం పూర్తిచేశాక, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో గూగుల్‌లో ఉద్యోగం సంపాదించింది. ఐదేళ్లపాటు వివిధ విభాగాల్లో పనిచేసిన నేహాకు ఇంకా ఏదో చేయాలన్న తపన. కానీ ఏం చేయాలో అర్థం కాలేదు. ఇలా ఆలోచిస్తున్న నేహా ఓ రోజు..''రోజురోజుకి పెరిగిపోతున్న వ్యర్థాలు వాతావరణంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి నా వంతు సాయంగా ఏదైనా మార్పు కలిగించేదిగా చేయాలి'' అని అనుకుంది. అదేవిధంగా పర్యావరణానికి హాని చేయని జీవనశైలిని అనుసరించాలనుకుంది. అందుకే 2011లో కారు కొనుక్కోవడానికి బదులు సైకిల్‌ను ఎంచుకుంది. ఇలా ఒక్కో వస్తువును వినియోగించే ముందు పర్యావరణానికి అనుకూలంగా ఉండేవే ఎంచుకోవడం మొదలు పెట్టింది.

గూగుల్‌ను వీడి...


నేహా జైన్



ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి చక్కని పరిష్కారం చూపాలని గట్టిగా నిర్ణయించుకున్న నేహా.. 2018లో గూగుల్ ఉద్యోగానికి రాజీనామా చేసింది. వెంటనే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పటిష్టంగా ఉండే వాటి కోసం పరిశోధించడం మొదలు పెట్టింది. ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించడానికి అనేక తయారీ కంపెనీలను సంప్రదించింది. ''ఫాస్ట్‌మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్(ఎఫ్ఎమ్‌సీజీ) కోసం ప్లాస్టిక్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. కానీ అవన్నీ రీసైకిల్ కావడం లేదు' అని గ్రహించి మట్టిలో కలిసిపోయే సరికొత్త ప్లాస్టిక్‌ను రూపొందించడం కోసం తీవ్రంగా అన్వేషించి సముద్ర నాచుతో ప్లాస్టిక్‌ను తయారు చేయాలనుకుంది. ఈ ఆలోచన రాగానే 2020 జూలైలో 'జీరోసర్కిల్' పేరిట స్టార్టప్‌ను ప్రారంభించి సముద్ర నాచుతో ట్రాన్స్‌పరెంట్ ప్లాస్టిక్ తయారీ మొదలు పెట్టింది.



సముద్రనాచు ఎందుకంటే...

సముద్ర ఉపరితలంపై తొమ్మిదిశాతం సముద్రనాచు దట్టంగా పెరిగి ఉంటుంది. ఈ నాచు వాతావరణంలో 53 బిలియన్ల టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తొలగిస్తుంది'' అని ముంబై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీని సందర్శించినప్పుడు అక్కడ ఉన్న బయాలజిస్టుల ద్వారా తెలుసుకుంది. ఈ నాచును పెంచడానికి ఎరువులుగానీ, క్రిమిసంహారకాలు గానీ వినియోగించాల్సిన అవసరం లేదు. ప్రత్యేకంగా, నీరు, భూమిని కూడా కేటాయించాల్సిన పనిలేదు. 30-40 రోజుల్లోనే పెరిగి వినియోగానికి అందుబాటులోకి వస్తుంది అని క్షుణ్ణంగా తెలుసుకుని ఎరుపు, ఆకుపచ్చ, గోధుమ రంగులలోని శిలీంధ్రాలను సేకరించి ఎండబెట్టి, పొడి చేసి ఆ పొడితో ప్లాస్టిక్‌ను రూపొందిస్తోంది. ప్రస్తుతం తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్రల్లోని మత్స్యకారుల ద్వారా ఈ నాచుని సేకరించి ప్రత్యామ్నాయ ప్లాస్టిక్ తయారు చేస్తోంది. 20 లక్షలతో ప్రారంభమైన జీరోసర్కిల్ కంపెనీ నేడు సముద్ర నాచులతో పారదర్శకమైన ప్లాస్టిక్ బ్యాగ్‌లను తయారు చేస్తూ దూసుకుపోతుంది. సొంత ఆర్అండ్‌డీ బృందంతో కాలుష్యరహిత సరికొత్త బయోప్లాస్టిక్ ఉత్పత్తులను తయారు చేస్తోంది నేహా.

నేరాలకు కేరాఫ్ అడ్రస్

సైబర్ నేరాలకు కేరాఫ్ అడ్రస్‌గా మొదటి ప్లేస్‌లో ఫేస్‌బుక్ నిలుస్తోంది. ఫేస్‌బుక్‌ను అడ్డం పెట్టుకుని చేసే నేరాలలో అకౌంట్లను హ్యాక్ చేయడం, డబ్బును డిమాండ్ చేయడం, వివరాలను దొంగిలించడం, భావోద్వేగాలతో ఆడుకోవడం, షాపింగ్ మోసం, ఫేక్ ఫ్రెండ్ రిక్వెస్టలు.. వంటివెన్నో ఉంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన సోషల్ నెట్‌వర్క్ ఫేస్‌బుక్. ఫొటోలు, వీడియోలు అనేక ఇతర ఇంటరాక్టివ్ అంశాలు, వ్యాపారం, సేవలను ప్రోత్సహించడానికి మాధ్యమంగా ఫేస్‌బుక్‌ని ఉపయోగిస్తున్నారు. నెట్‌వర్క్ ద్వారా భారీ సంఖ్యలో వ్యక్తులు కనెక్ట్ అయి ఉండటంతో, స్కామర్లకు ఇది ఒక మాధ్యమంగా మారింది. దీంతో మోసగాళ్లు సోషల్ మీడియా హ్యాండిల్ నుండి లింక్‌లు, కనెక్షన్‌లతో స్కామ్‌లకు తెరలేపుతున్నారు.

స్కామ్‌లు... ఫేస్‌బుక్ హ్యాకింగ్, నకిలీ ప్రొఫైల్ వంటి ఈ మోసాల జాబితాలో మొదట బాధితుడి ప్రొఫైల్‌ను హైజాక్ చేసి, ఆపై వివిధ కారణాలతో వేర్వేరు వ్యక్తులను సంప్రదించి, డబ్బు సంపాదించడానికి ప్రయత్నిస్తారు. ప్రొఫైల్ యజమాని ఈ విషయాన్ని తెలుసుకొని, ఈ వార్తను అందరికీ తెలియజేసే వరకు అతని ప్రొఫైల్ హైజాక్ అయ్యిందని తెలియదు. దీంతో ఫేస్‌బుక్ ఖాతాకు చెందిన తమ స్నేహితుడి నుండి రిక్వెస్ట్ వచ్చిందని మిగతావారు నమ్ముతారు. ఇది ఫేస్‌బుక్ చీటింగ్ స్కామ్‌కు సంబంధించిన కేసు అని ఆలస్యంగా తెలుసుకుంటారు.

యాక్సెస్ సులువు... సైబర్ నేరగాళ్లు బాధితురాలి/బాధితుడి ఫేస్‌బుక్ ఖాతాను హ్యాక్ చేసి వారి వ్యక్తిగత వివరాలన్నింటికి యాక్సెస్ పొందుతారు. స్కామర్ బాధితుడి ఫేస్‌బుక్ ఖాతాను లక్ష్యంగా చేసుకుని హ్యాక్ చేస్తాడు. తర్వాత స్నేహితుల జాబితాలోని వారిని సంప్రదిస్తాడు.

● స్కామర్ సాధారణంగా డబ్బు అడగడానికి ప్రయత్నిస్తాడు ● నిధుల బదిలీ, యాక్సెస్ కోడ్, వ్యక్తిగత మొబైల్ నంబర్లు, ఇతర వివరాల కోసం ఒక స్కామర్ ద్వారా ఫేస్‌బుక్ ప్రొఫైల్ యజమాని స్నేహితులు సంప్రదించినట్లు అనేక కేసులు ఇప్పటికే సైబర్‌క్రైమ్‌లో ఫైల్ అయి ఉన్నాయి. వీటిలో...

శృంగారపరమైన మోసాలు... అంత్యంత పెద్ద స్కామ్‌లలో ఇది ఒకటి. ఫేస్‌బుక్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకునేందుకు మోసగాళ్లు ప్రేమికులుగా నటిస్తారు. స్కామర్లు వారి బాధాకరమైన జీవనం గురించి, భాగస్వామి నుంచి విడిపోయినట్లు నటిస్తారు లేదా మిమ్మల్ని ఆకర్షించడానికి ముఖస్తుతిని ఉపయోగిస్తారు. ఒక శృంగారపరమైన వీడియో సంభాషణ మీ భావోద్వేగాలతో ఆడుకోవడానికి, మీ నమ్మకాన్ని పొందేందుకు రూపొందించి ఉంటుంది. వారాలు, నెలల వ్యవధిలో మెసెంజర్‌చాట్‌లను పెంచుతూ ఉంటారు. చివరికి ఏదో సమస్య చెప్పి డబ్బు పంపమని అడుగుతారు. ఆన్‌లైన్‌లో క్యాట్‌ఫిషింగ్ కోసం ఇది అత్యంత ప్రజాదరణ పొందిన అంశాలలో ఒకటి.

షాపింగ్ మోసాలు... ఫేస్‌బుక్ ద్వారా స్కామర్లు నకిలీ వస్తువులను అంటగట్టడానికి నకిలీ బ్రాండ్ ఖాతాలను సృష్టిస్తారు. రకరకాల ఆఫర్లతో ఎన్నడూ వినని షాప్ పేర్లను సృష్టిస్తారు. ప్రకటనలను పుష్ చేస్తారు. చౌక ధరలకు వస్తువులను అందిస్తామంటారు కానీ దేనినీ పంపరు. బదులుగా, మీ డబ్బు తీసుకొని అదృశ్యమవుతారు.

నకిలీ ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు... ఫేస్‌బుక్‌లో ఉన్న ఎవరైనా ఈ స్కామ్‌ను ఎదుర్కొనే ఉంటారు. ఒక వ్యక్తిని ఫాలో అవడానికి మొత్తం ఫేస్‌బుక్ ఖాతాలను చేరుకోవడానికి స్కామర్‌లకు ఇది ఇష్టమైన వ్యూహం. మీరు ఒక ఫేక్ అభ్యర్థనను అంగీకరించినప్పుడు, మీరు మీ అకౌంట్ లాక్ చేసినా మీరు స్కామర్‌కి అంతర్గత యాక్సెస్‌ను అందించినట్టే. మీ డిజిటల్ డివైజ్‌లో హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసే మోసపూరితమైన లింక్ వంటి ఇతర స్కామ్‌ల బారినపడేలా మీ నమ్మకాన్ని ఉపయోగించుకుంటారు.

నకిలీ ఛారిటీ స్కామ్‌లు... విపత్తు సంభవించినప్పుడు, సహాయం చేయాలనుకోవడం మానవ స్వభావం. చాలా మందికి, దీని అర్థం డబ్బును విరాళంగా ఇవ్వడం. మోసగాళ్లకు ఇది తెలుసు. వెంటనే డబ్బు చెల్లించేలా సంక్షోభాలను ఉపయోగిస్తారు. నకిలీ ఛారిటీ పేజీలు, వెబ్‌సైట్‌లు, గో ఫండ్ మి వంటి ప్రసిద్ధ సైట్‌లలో ఖాతాలను కూడా సృష్టించి, ఆపై మీ ఫేస్‌బుక్ ఫీడ్‌లో వారి 'ధార్మిక సంస్థలను' ప్రచారం చేస్తారు. ఫోన్ యాప్‌ల ద్వారా డబ్బు చెల్లించమని అడుగుతారు.

మీరు ఏదైనా స్వచ్ఛంద సంస్థకు డబ్బులు ఇచ్చే ముందు రీసెర్చ్ చేయడానికి కొంత సమయం తీసుకోండి. ఛారిటీ నావిగేటర్, గైడ్ స్టార్, ఛారిటీ వాచ్‌తో సహా ఈ ప్రయోజనం కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన సైట్‌లను చెక్ చేయండి.

హ్యాక్ అయిన సమాచారాన్ని రిపోర్ట్ చేయాలంటే ..
https://www.facebook.com/hacked

నకిలీ సమాచారం గురించి రిపోర్ట్‌కు...
https://www.facebook.com/help/572838089565953?helpref=search&sr=2&query=reporting%20false%20claims&search_session_id=f886d969d0ffdf65b717d0567986859f

మోసానికి సంబంధించిన సమాచారాన్ని ..
httpr://www.facebook.com/hep/174210519303259?rdrhc
రిపోర్ట్ చేయడం మంచిది.

ఫేస్‌బుక్ మోసాలకు అడ్డుకట్ట

మీ భద్రతను కాపాడుకోవడానికి ఫేస్‌బుక్‌లో మీరు చేయగలిగేవి...

● మీ ఫేస్‌బుక్ గోప్యతా సెట్టింగ్‌లను లాక్ చేయండి ● రెండుకారకాల ఫోన్‌నెంబర్ ప్రమాణీకరణను ప్రారంభించండి ● మీకు తెలియని వారి నుండి ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను తిరస్కరించండి ● వ్యక్తిగత సమాచారం లేదా డబ్బు కోసం అడిగే సందేశాలను పట్టించుకోవద్దు ● మీకు పంపిన అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దు ● మీ లాగిన్ చరిత్రను క్రమం తప్పకుండా తనిఖీ చేయండి ● బలమైన పాస్‌వర్డ్‌ని ఉపయోగించండి ● ధ్రువీకరించబడిన బ్రాండ్ ఖాతాల నుండి మాత్రమే షాపింగ్ చేయండి ● మీ పేరు మీద ఉన్న ఖాతాల కోసం క్రమం తప్పకుండా శోధించండి


ప్రతీకాత్మక చిత్రం

మీ ఫేస్‌బుక్ పేజ్ బయట...

● మీ పరికరం ఆపరేటింగ్ సిస్టమ్‌ను అప్‌డేట్ చేయండి ● అన్ని అనుమానాస్పద ఇ-మెయిల్‌లను తొలగించండి ● మీ అన్ని డిజిటల్ పరికరాల్లో యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేయండి ● ఎరుకతో వ్యవహరించండి.

మీరు ఫేస్‌బుక్ స్కామ్‌కు గురైనట్లయితే ...

● స్కామ్ గురించి ఫేస్‌బుక్‌కి నివేదించండి ● పాస్‌వర్డ్ మార్చుకోండి ● మీ బ్యాంక్ అకౌంట్లను ఎప్పుడూ తనిఖీ చేస్తూ ఉండండి ● మీ ఆన్‌లైన్ చెల్లింపులను ఆపేయండి ● మీ గుర్తింపుకు సంబంధించిన వివరాలను ఎవరైనా దొంగతనం చేశారా గమనించండి.

సైబర్ టాక్


ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



భారత్‌తో టి20 సిరీస్‌కు స్టార్క్ దూరం

ఈనెల 20 నుంచి భారత్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌కు ఆస్ట్రేలియా స్టార్ పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్‌తోపాటు ఆల్‌రౌండర్లు మిచెల్ మార్ష్, స్టొయినిస్ దూరమయ్యారు. ఈ ముగ్గురు గాయాలతో బాధపడుతున్నారని, వచ్చే నెలలో టి20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ ముగ్గురికీ కోలుకునేందుకు తగినంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతో భారత్‌తో సిరీస్‌కు ఎంపిక చేయలేదని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తెలిపింది. ఈ ముగ్గురి స్థానాల్లో నాథన్ ఇలిస్, డానియల్ సామ్స్, సీన్ అబాట్ జట్టులోకి వచ్చారు.

కోహ్లి 14 స్థానాలు ఎగబాకి...



ఆసియా కప్ టి20 టోర్నీలో ఐదు మ్యాచ్‌లు ఆడి 276 పరుగులు సాధించిన భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో కోహ్లి 14 స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత్‌కే చెందిన సూర్యకుమార్ యాదవ్ నాలుగో ర్యాంక్‌లో ఎలాంటి మార్పు లేదు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 14వ స్థానంలో కొనసాగుతున్నాడు.

230 మంది ఆటగాళ్లతో...

జాతీయ క్రీడలకు తెలంగాణ బృందం



సాక్షి, హైదరాబాద్: గుజరాత్‌లో జరిగే 36వ జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర బృందం వివరాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ప్రకటించింది. ఏడేళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ క్రీడల్లో తెలంగాణ నుంచి 230 మంది ఆటగాళ్ల పాల్గొనబోతున్నారు. ఇందులో పురుషుల విభాగంలో 104 మంది, మహిళల విభాగంలో 126 మంది పోటీ పడతారు. మొత్తం 26 క్రీడాంశాల్లో సత్తా చాటేందుకు అథ్లెట్లు సిద్ధమయ్యారు. కోచ్‌లు, సహాయక సిబ్బందితో కలిపి మొత్తం 302 మంది సభ్యులతో రాష్ట్ర బృందం ఈ క్రీడలకు వెళ్లనుంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 12 వరకు గుజరాత్‌లోని ఆరు నగరాలతో పాటు న్యూఢిల్లీ (సైక్లింగ్)లో జాతీయ క్రీడలు నిర్వహిస్తారు. కేరళలో 2015లో జరిగిన క్రీడల్లో తెలంగాణ 8 స్వర్ణాలు, 14 రజతాలు, 11 కాంస్యాలు (మొత్తం 33 పతకాలు) సాధించి 12వ స్థానంలో నిలిచింది. ఈసారి క్రీడల్లో అంతకంటే మెరుగైన ప్రదర్శన కనబర్చి టాప్–5లో చోటు దక్కించుకుంటామని 'శాట్స్' చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాలాచారి, కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, ఈ క్రీడలకు తెలంగాణ రాష్ట్ర చెఫ్ డి మిషన్ ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాడి ఓడిన కర్మన్ కౌర్



చెన్నై: భారత్‌లో జరుగుతున్న ఏకైక డబ్ల్యూటీఏ టోర్నీ చెన్నై ఓపెన్–250 టెన్నిస్ టోర్నీలో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 359వ ర్యాంకర్ కర్మన్ కౌర్ 2–6, 6–7 (2/7)తో 2014 వింబుల్డన్ టోర్నీ రన్నరప్ యుజీన్ బుషార్డ్ (కెనడా) చేతిలో పోరాడి ఓడిపోయింది. కర్మన్ కౌర్‌కు 3,800 డాలర్ల (రూ. 3 లక్షలు) ప్రైజ్‌మనీ, 30 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

గంగూలీ, షా లకు 'జై'

- బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శులకు సుప్రీం కోర్టులో ఊరట
- మరో మూడేళ్లు పదవిలో కొనసాగేందుకు అవకాశం



న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లో కీలక పరిణామం. నియమావళిలో మార్పులకు సంబంధించి సుప్రీం కోర్టును ఆశ్రయించిన బోర్డుకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయి. ఇకపై బీసీసీఐతో పాటు రాష్ట్ర క్రికెట్ సంఘాల్లో కలిపి వరుసగా 12 ఏళ్లు పదవిలో ఉండే అవకాశంతో పాటు ఆ తర్వాతే మూడేళ్ల విరామం (కూలింగ్ ఆఫ్ పీరియడ్) ఇచ్చే విధంగా నిబంధనను మార్చుకునేందుకు సుప్రీం కోర్టు అనుమతినిచ్చింది. జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమ కోహ్లిలతో కూడా బెంచ్ బుధవారం దీనిపై స్పష్టతనిచ్చింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం ఎవరైనా రాష్ట్ర క్రికెట్ సంఘంలో లేదా బీసీసీఐలో కలిపి వరుసగా ఆరేళ్లు పదవీకాలం ముగిసిన తర్వాత కనీసం మూడేళ్లు విరామం ఇచ్చిన తర్వాతే మళ్లీ ఏదైనా పదవి కోసం పోటీ పడవచ్చు. అయితే ఇప్పుడు సుప్రీం అనుమతించిన దాని ప్రకారం బీసీసీఐలో ఆరేళ్లు, రాష్ట్ర క్రికెట్ సంఘంలో ఆరేళ్ల పదవిని వేర్వేరుగా చూడనున్నారు. అంటే రాష్ట్ర సంఘంలో పని చేసిన తర్వాత కూడా బీసీసీఐలో వరుసగా మూడేళ్ల చొప్పున వరుసగా రెండు పర్యాయాలు (మొత్తం ఆరేళ్లు) పదవి చేపట్టే అవకాశం ఉంది. తాజా ఉత్తర్వుల ప్రకారం అందరికంటే ఎక్కువ ప్రయోజనం బోర్డు అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, బోర్డు కార్యదర్శి జై షాలకు లభించనుంది. వీరిద్దరు 2019లో పదవిలోకి వచ్చారు. గత నిబంధనల ప్రకారం వారిద్దరి పదవీ కాలం ఇటీవలే ముగిసింది. అయితే పదే పదే వ్యక్తులు మారకుండా అనుభవజ్ఞులు ఎక్కువ కాలం బోర్డులో ఉంటే ఆటకు మేలు జరుగుతుందనే వాదనతో సుప్రీంకోర్టును బీసీసీఐ ఆశ్రయించింది. ఈ వాదనతో అత్యున్నత న్యాయస్థానం ఏకీభవించింది. దాంతో గంగూలీ, జై షా మరోసారి ఎన్నికై 2025 వరకు తమ పదవుల్లో కొనసాగే అవకాశం ఉంది. సుప్రీం ఉత్తర్వుల కోసం వేచి చూస్తూ ఈ నెల చివర్లో జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేసిన బీసీసీఐ త్వరలోనే ఎన్నికలు జరిపేందుకు సిద్ధమైంది.

వినేశ్ కంచు పట్టు

- ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన భారత రెజ్లర్
- రెండు పతకాలు నెగ్గిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా రికార్డు



బెల్‌గ్రేడ్ (సెర్బియా): నాలుగు రోజుల నిరాశాజనక ప్రదర్శన అనంతరం ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఐదో రోజు భారత్ ఖాతాలో తొలి పతకం చేరింది. మహిళల ఫ్రీస్టయిల్ 53 కేజీల విభాగంలో వినేశ్ ఫొగాట్ కాంస్య పతకంతో మెరిసింది. తద్వారా ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో రెండు పతకాలు గెలిచిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా 28 ఏళ్ల వినేశ్ రికార్డు నెలకొల్పింది. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ వినేశ్ కాంస్య పతకం సాధించింది. బుధవారం జరిగిన 53 కేజీల కాంస్య పతక బౌట్‌లో బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత వినేశ్ 8–0 పాయింట్ల తేడాతో ఎమ్మా జోనా మాల్మ్‌గ్రెన్ (స్వీడన్)పై గెలిచింది. వాస్తవానికి మంగళవారం వినేశ్ తొలి రౌండ్‌లో 0–7తో ఖులాన్ బత్కుయగ్ (మంగోలియా) చేతిలో అనూహ్యంగా ఓడిపోయింది. అయితే ఖులాన్ ఫైనల్ చేరడంతో 'రెపిచాజ్' పద్ధతి ప్రకారం వినేశ్‌కు కాంస్య పతకం కోసం పోటీపడే అవకాశం లభించింది. ఫైనల్ చేరిన రెజ్లర్ చేతిలో అంతకుముందు రౌండ్‌లలో ఓడిపోయిన వారి మధ్య 'రెపిచాజ్' పద్ధతి ద్వారా బౌట్‌లు నిర్వహిస్తారు. 'రెపిచాజ్' తొలి రౌండ్‌లో వినేశ్ 4–0తో జుల్‌దిజ్ ఇషిమోవా (కజకిస్తాన్)పై గెలిచింది. తదుపరి రౌండ్‌లో వినేశ్‌తో పోటీపడాల్సిన లేలా గుర్బనోవా (అజర్‌బైజాన్) గాయం కారణంగా బరిలోకి దిగకపోవడంతో భారత రెజ్లర్‌కు 'వాకోవర్' లభించి కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది.

కాంస్యం రేసులో నిషా

మరోవైపు 68 కేజీల విభాగంలో భారత రెజ్లర్ నిషా దహియా కాంస్య పతకం రేసులో నిలిచింది. సెమీ ఫైనల్లో నిషా 4–5తో అమీ ఇషి (జపాన్) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు తొలి రౌండ్‌లో నిషా 11–0తో దనుతె దొమికైతె (లిథువేనియా)పై, రెండో రౌండ్‌లో 13–8తో అదెలా హంజ్లికోవా (చెక్ రిపబ్లిక్)పై, క్వార్టర్ ఫైనల్లో 11–0తో సోఫియా (బల్గేరియా)పై గెలిచింది. 2021 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన సరిత మోర్ (57 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో 0–7తో లిసాక్ అన్‌హెలినా (పోలాండ్) చేతిలో... మాన్సి అహ్లావత్ క్వార్టర్ ఫైనల్లో 3–5తో జోవితా మరియా (పోలాండ్) చేతిలో... రితిక తొలి రౌండ్‌లో 2–6తో కెండ్రా అగస్టీన్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయారు.

స్మృతి మెరుపు ఇన్నింగ్స్



రెండో టి20లో భారత్ ఘన విజయం

డెర్బీ: ఇంగ్లండ్ మహిళల జట్టుతో జరుగుతున్న టి20 సిరీస్‌లో తొలి మ్యాచ్ ఓటమి నుంచి భారత మహిళల జట్టు కోలుకుంది. సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం రెండో టి20లో గెలిచి సిరీస్‌ను సమం చేసింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 142 పరుగులే చేయగలిగింది. 16 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు ఒకదశలో 54/5తో నిలిచింది. అయితే ఫ్రేయా కెంప్ (37 బంతుల్లో 51 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), మయా బౌచర్ (26 బంతుల్లో 34; 4 ఫోర్లు) కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 65 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 24 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం భారత్ 16.4 ఓవర్లలో 2 వికెట్లకు 146 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్మృతి మంధాన (53 బంతుల్లో 79 నాటౌట్; 13 ఫోర్లు) అర్ధసెంచరీతో చెలరేగగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (22 బంతుల్లో 29 నాటౌట్; 4 ఫోర్లు) రాణించింది. తాజా ఫలితంతో సిరీస్ 1–1తో సమం కాగా, విజేతను తేల్చే చివరి టి20 నేడు బ్రిస్టల్‌లో జరుగుతుంది.

మహేల జయవర్ధనే, జహీర్ ఖాన్‌లకు ప్రమోషన్

వేర్వేరు లీగ్‌లలో ముంబై జట్ల బాధ్యతలు



ముంబై: ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్ సహాయక సిబ్బందికి సంబంధించి ప్రధాన మార్పు చోటు చేసుకుంది. ఇప్పటి వరకు టీమ్ హెడ్ కోచ్‌గా ఉన్న మహేల జయవర్ధనే, డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ జహీర్ ఖాన్ తమ హోదాల నుంచి తప్పుకున్నారు. వీరికి మరింత పెద్ద బాధ్యతలు అప్పగిస్తూ ముంబై టీమ్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ గ్రూప్ ఐపీఎల్ టీమ్ ముంబై ఇండియన్స్‌తో పాటు దక్షిణాఫ్రికా లీగ్‌లో ఎంఐ కేప్‌టౌన్, యూఏఈ లీగ్‌లో ఎంఐ ఎమిరేట్స్ జట్టును కూడా సొంతం చేసుకుంది. ఓవరాల్‌గా వీటి బాధ్యతల కోసమే ఈ మార్పులు జరిగాయి. ఇకపై జయవర్ధనే ముంబై టీమ్ 'గ్లోబల్ హెడ్ ఆఫ్ పెర్ఫార్మెన్స్'గా పని చేస్తాడు. ప్రపంచవ్యాప్తంగా గ్రూప్ క్రికెట్ వ్యవహారాల పర్యవేక్షణతో పాటు కోచింగ్ బృందం ఎంపికలో జయవర్ధనే కీలక బాధ్యతలు నిర్వహిస్తాడు. ఇదే తరహాలో జహీర్ ఖాన్‌ను 'గ్లోబల్ హెడ్ ఆఫ్ క్రికెట్ డెవలప్‌మెంట్'గా ఫ్రాంచైజీ నియమించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతిభాన్వేషణతో కుర్రాళ్లకు గుర్తించి వారిని తమ జట్ల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో జహీర్ ప్రధాన పాత్ర పోషిస్తాడు.

భారత క్రికెట్‌కు రాబిన్ ఉతప్ప గుడ్‌బై



బెంగళూరు: విదేశాల్లో జరిగే టి20 క్రికెట్ టోర్నమెంట్‌లలో పాల్గొనేందుకు వీలుగా మరో భారత క్రికెటర్ రాబిన్ ఉతప్ప అన్ని రకాల దేశవాళీ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. కర్ణాటకకు చెందిన 36 ఏళ్ల రాబిన్ ఉతప్ప 2006లో అరంగేట్రం చేసి భారత్ తరఫున మొత్తం 46 వన్డేలు ఆడి 934 పరుగులు... 13 టి20 మ్యాచ్‌లు ఆడి 249 పరుగులు సాధించాడు. 2007 టి20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత జట్టులో రాబిన్ ఉతప్ప సభ్యుడిగా ఉన్నాడు. ఐపీఎల్ టోర్నీలో ఉతప్ప రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్‌రైడర్స్, ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్, రాజస్తాన్ రాయల్స్, పుణే వారియర్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2014 ఐపీఎల్ విజేత కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో, 2021 ఐపీఎల్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ఉతప్ప ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో చివరిసారి కేరళ జట్టుకు ఆడిన ఉతప్ప ఆ జట్టు నుంచి నిరభ్యంతర పత్రాన్ని తీసుకున్నాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం భారత క్రికెటర్లు రిటైర్మెంట్ ప్రకటిస్తేనే విదేశీ లీగ్‌లలో ఆడేందుకు అర్హత సాధిస్తారు.

సినిమా

సినిమాకు భాష లేదు

– గౌతమ్ వాసుదేవ్‌మీనన్

''ఓటీటీలు వచ్చిన తర్వాత ప్రపంచం, సినిమా పరిశ్రమ చిన్నవి అయిపోయాయి. ఇతర భాషల సినిమాలను కూడా ప్రేక్షకులు చూస్తున్నారు. నిజాయితీగా చెప్పాలంటే సినిమాకు భాష లేదు. 'లైఫ్ ఆఫ్ ముత్తు' చిత్రంలో కొన్ని పాత్రలు హిందీ మాట్లాడతాయి. ఈ డైలాగ్స్ ప్రేక్షకులకు అర్థం కాకపోయినా భావం అర్థం అవుతుంది'' అని దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ అన్నారు. శింబు కథానాయకుడిగా గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ 'వెందు తనిందదు కాడు'. సిద్ధీ ఇద్నాని కథానాయిక.



ఇషారి.కె. గణేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. కాగా ఈ సినిమాను 'ది లైఫ్ ఆఫ్ ముత్తు' టైటిల్‌తో శ్రీ స్రవంతి మూవీస్ సంస్థ ఈ నెల 17న తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా గౌతమ్ మీనన్ మాట్లాడుతూ–''పల్లెటూరులో జీవించే ముత్తు ముంబై వెళ్లి, అనుకోకుండా చీకటి ప్రపంచంలోకి వెళ్తాడు. ఆ తర్వాత ఎలా బయట పడ్డాడు? అన్నదే కథ. రెహమాన్‌గారు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. కథ డిమాండ్ చేయడంతోనే ఈ సినిమాను రెండు పార్టులుగా రిలీజ్ చేస్తున్నాం. 'లైఫ్ ఆఫ్ ముత్తు'ను తెలుగులో 'స్రవంతి' రవికిశోర్‌గారు విడుదల చేయడం హ్యాపీ. నేను, రామ్ చేయాలనుకుంటున్న మూవీ వేసవి తర్వాత ఉండొచ్చు. కమల్‌హాసన్‌గారితో 'రాఘవన్ 2' చేయాలనే ప్లాన్ ఉంది. వెంకటేష్‌గారితో 'ఘర్షణ 2', నాగచైతన్యతే 'ఏ మాయ చేసావె 2' చేయాలనుంది. విక్రమ్‌తో నేను తీసిన 'ధృవనక్షత్రం' ఈ డిసెంబరులో రిలీజ్ అవుతుంది'' అన్నారు.

సానుకూల నిర్ణయం!

వేతనాలు పెంచాలనే సినీ కార్మికుల డిమాండ్‌లపై తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సానుకూల నిర్ణయాలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. దాదాపు 30శాతం వేతనాలు పెంచాలన్న డిమాండ్స్‌తో కార్మికులు రీసెంట్‌గా ఆందోళన చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసమై ఫెడరేషన్ నాయకులతో తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ఇటీవల చర్చలు జరిపినా ఏకాభిప్రాయం కుదర్లేదు. దీంతో తమ డిమాండ్‌లను అంగీకరించి కార్మికులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఈ నెల 16 నుంచి సమ్మె చేసే యోచనలో ఉన్నట్లుగా ఫెడరేషన్ నాయకులు నిర్మాతల మండలికి చెప్పారట. దీంతో వేతన కమిటీ ప్రతిపాదనలను పరిశీలనలోకి తీసుకుని కార్మికుల వేతనాల పెంపుపై కొన్ని ఒప్పందాలు కుదుర్చుకుని నిర్మాతల మండలి కొన్ని సానుకూల నిర్ణయాలు తీసుకుందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

సస్పెన్స్ డ్రామా



● అమీర్, సుమన్

అమీర్ హీరోగా, ప్రణీత, దీపిక హీరోయిన్లుగా పందిళ్లపల్లి రోషిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇట్లు'. పూదారి రాజాగౌడ్, ఎలిశాల లింగం పూదరి రాజశేఖర్ గౌడ్, బాచిన నాగేశ్వరరావు నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని సుమన్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, నిర్మాత సాయి వెంకట్‌లు విడుదల చేయగా, నటుడు కుప్పిలి శ్రీనివాస్, నిర్మాత రామ సత్యనారాయణ, ఉప్పల మెట్టయ్య, పెంచల స్వామి ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''సస్పెన్స్ థ్రిల్లర్ డ్రామా చిత్రమిది'' అన్నారు పందిళ్లపల్లి రోషిరెడ్డి. ''ఇట్లు' సినిమా అలరిస్తుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నాగేశ్వరరావు, కెమెరా: రామరాజు– నిమ్మ గోపి. సంగీతం: శివ–ప్రణయ్.

నేనే వస్తున్నా!



● ధనుష్

ధనుష్ హీరోగా నటించిన తాజా తమిళ చిత్రం 'నానే వరువేన్'. 'కాదల్ కొండేన్' (2003)', 'పుదుపెట్టై(2006), 'మయక్కం ఎన్న' (2011) చిత్రాల తర్వాత హీరో ధనుష్, దర్శకుడు సెల్వ రాఘవన్ కాంబినేషన్‌లో ఈ సినిమా తెరకెక్కింది. ఎల్లి అవ్రామ్, ఇందుజా రవిచంద్రన్, యోగిబాబు కీలక పాత్రలు చేశారు. కలైపులి ఎస్.థాను నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ చిత్రం 'నేనే వస్తున్నా' పేరుతో తెలుగులో రానుంది. గీతా ఆర్ట్స్ సమర్పణలో అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్‌ని కలైపులి ఎస్.థాను కలిశారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ నెలలోనే ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్ రాజా, కెమెరా: ఓం ప్రకాష్.

ఈ సినిమాతో మరింత దగ్గరవుతా

– కిరణ్ అబ్బవరం



''నా గత చిత్రాల్లో నేను రెండు షేడ్స్ ఉన్న పాత్ర చేయలేదు. కానీ తొలిసారి 'నేను మీకు బాగా కావాల్సినవాడిని' సినిమాలో చేశాను. ఒకటేమో ఎనర్జిటిక్ మాస్ అయితే మరొకటి సెటిల్డ్‌గా ఉంటుంది. హీరోగా సెటిల్ అవుతున్న టైంలో ఇలాంటి కథ నా కెరీర్‌కి చాలా బూస్టప్ ఇస్తుంది. ఈ సినిమా ద్వారా అందరికీ మరింత దగ్గరవుతా అనే నమ్మకం ఉంది'' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. శ్రీధర్ గాదె దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, సంజన ఆనంద్ జంటగా తెరకెక్కిని చిత్రం 'నేను మీకు బాగా కావాల్సినవాడిని'. కోడి దివ్య దీప్తి నిర్మించిన ఈ సినిమా రేపు(శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం పంచుకున్న విశేషాలు...

- దర్శకుడు కోడి రామకృష్ణగారు అంటే నాకు చాలా ఇష్టం. ఆయన తీసిన 'అమ్మోరు, అరుంధతి' వంటి సినిమాలు చూసి పెరిగాను. ఆయనతో పనిచేసే అవకాశం రాకపోయినా, ఆయన కుమార్తె దివ్య దీప్తి గారితో పనిచేయడం ఆనందంగా ఉంది. 'ఎస్ఆర్ కల్యాణ మండపం' కి ముందే 'నేను మీకు బాగా కావాల్సినవాడిని' ఓకే అయింది. అయితే లాక్‌డౌన్ వల్ల ఆలస్యం అయింది. దివ్య దీప్తి సహకారం వల్లే ఈ సినిమా అనుకున్నదాని కంటే బాగా వచ్చింది. కథ డిమాండ్ మేరకు ఈ మూవీలో డైలాగ్స్ నేనే రాశాను.
- కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాలో ఒక ముఖ్యమైన పాయింట్‌ని చర్చించాం. సరికొత్త కథ అని చెప్పను కానీ, మన అందరి ఇంట్లో జరిగే కథలా ఉంటుంది. ఎస్వీ కృష్ణారెడ్డిగారు హీరోయిన్ తండ్రిగా ఇన్నోసెంట్ పాత్ర చేశారు. ఇందులోని తండ్రీకూతుళ్ల ఎమోషన్స్‌కు ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతారు.
- ఈ మూవీలో మణిశర్మగారి సంగీతం, నేపథ్య సంగీతం నెక్ట్స్ లెవల్‌లో ఉంటాయి. మా సినిమా ట్రైలర్‌ను పవన్ కల్యాణ్‌గారు విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. చిరంజీవి, రవితేజగార్లలా మాస్ పాత్రలు చేయాలని ఉంది.
- నేను ఇప్పటి వరకూ చేసిన 'రాజావారు రాణిగారు, ఎస్ఆర్ కల్యాణ మండపం, సెబాస్టియన్, సమ్మతమే' చిత్రాల్లో 'సెబాస్టియన్' ఒక్కటే నన్ను నిరుత్సాహ పరిచింది. ఒకే సమయంలో రెండు మూడు సినిమాలు ఉండటంతో విశ్రాంతి లేకుండా పనిచేయాల్సి రావడం కష్టంగా ఉంది(నవ్వుతూ).
- గీతా ఆర్ట్స్‌లో చేస్తున్న 'వినరో భాగ్యము విష్ణు కథ', మైత్రీ మూవీ మేకర్స్‌లో చేస్తున్న 'మీటర్' సినిమాల షూటింగ్స్ పూర్తయ్యాయి. ఏయమ్ రత్నం బ్యానర్‌లో చేస్తున్న 'రూల్స్ రంజన్' సినిమా 40% షూటింగ్ అయ్యింది. శ్రీధర్ గాదెతో మరో చిత్రం చేసే అవకాశం ఉంది. ద



● నాగచైతన్య, సిద్ధు, అడివి శేష్, కృతీశెట్టి, సుధీర్ బాబు, ఇంద్రగంటి

ఆ బాధ్యత అందరిది

– సుధీర్‌బాబు

''ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' సినిమా ట్రైలర్ నాకు బాగా నచ్చింది. 'ఏమాయ చేసావె' చిత్రంలో సుధీర్‌తో కలిసి యాక్ట్ చేశాను.. తను ఆల్ రౌండర్. ఇంద్రగంటిగారి వర్కింగ్ స్టైల్ గురించి విన్నాను. ఆయనతో పనిచేయాలనుకుంటున్నాను. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అని హీరో నాగచైతన్య అన్నారు. సుధీర్‌బాబు, కృతీశెట్టి జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి'. గాజులపల్లె సుధీర్‌బాబు సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి బి.మహేంద్రబాబు, కిరణ్ బళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో సుధీర్‌బాబు మాట్లాడుతూ–''ఇంద్రగంటిగారితో నాకిది మూడో సినిమా. ఈ కథ విన్న వెంటనే నచ్చింది. మహేంద్ర, కిరణ్ రాజీ పడకుండా ఈ సినిమాను నిర్మించారు. ఈ మూవీతో కృతీశెట్టి తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుంది. అందరూ ఈ సినిమాకి కనెక్ట్ అవుతారనే నమ్మకం ఉంది. కృష్ణంరాజుగారి ఆశీస్సులు మనందరిపై ఉంటాయి.. ఆయన గర్వపడే చిత్రాలు చేయడం ప్రభాస్ ఒక్కరి బాధ్యతే కాదు.. మనందరి బాధ్యత కూడా'' అన్నారు. ''నేను చాలా ఇష్టపడి రాసుకున్న కథ ఇది. అందుకే చాలా స్పెషల్. కమర్షియల్ డైరెక్టర్స్‌కు ఈ సినిమా ఓ ట్రిబ్యూట్. సుధీర్‌బాబుతో ఈ మూవీ చేయడం గర్వంగా ఉంది'' అన్నారు ఇంద్రగంటి మోహనకృష్ణ. ''ఈ సినిమాలో నా పాత్ర నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది'' అన్నారు కృతీశెట్టి. దర్శకులు హరీష్ శంకర్, అనిల్ రావిపూడి, వెంకీ కుడుముల, రాహుల్ సంకృత్యాన్, హీరోలు అడవి శేష్, సిద్ధు జొన్నలగడ్డ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా చూడాలి

– సునీత తాటి



''ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న ఓ పెద్ద నేరం గురించి ఇండియాలో ఎవరూ మాట్లాడటం లేదు. మా 'శాకిని డాకిని' చిత్రంలో ఆ క్రైమ్ గురించి చెబుతున్నాం కాబట్టి ప్రతి మహిళ ఈ చిత్రం చూడాలి'' అని నిర్మాత సునీత తాటి అన్నారు. రెజీనా కసాండ్రా, నివేదా థామస్ లీడ్ రోల్స్‌లో సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శాకిని డాకిని'. డి.సురేష్ బాబు, సునీత తాటి, హ్యూన్వూ థామస్ కిమ్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా సునీత తాటి మాట్లాడుతూ– ''గురు ఫిల్మ్స్‌పై నిర్మించిన 7వ చిత్రం 'శాకిని డాకిని'. మహిళల సమస్యలపై మహిళలే మాట్లాడితే ఇంకా బాగా కనెక్ట్ అవుతారని లీడ్ రోల్స్‌లో రెజీనా, నివేదలను తీసుకున్నాం. ఇద్దరు మహిళా ట్రైనీ పోలీసులు ఒక నేరాన్ని ఎలా పరిష్కరించగలిగారు? అనేది ఈ చిత్ర కథ. ఇదొక యూనివర్సల్ కథ.. అందరికీ నచ్చుతుంది. సుధీర్ వర్మ వేరే షూటింగ్‌లో ఉండటం వల్లే 'శాకిని డాకిని' ప్రమోషన్స్‌లో పాల్గొనలేదు.. నేటి నుంచి పాల్గొంటారు. సురేశ్ బాబుగారితో అసోసియేట్ అవడం చాలా హ్యాపీ. మన చిత్రాలు కొరియన్, జపాన్ భాషల్లో చాలా రీమేక్ అవుతున్నాయి. థియేటర్‌లో సినిమా చూసినప్పుడు అందరం నవ్వుతాం.. ఏడుస్తాం. అదే ఓటీటీలో అయితే ఇంట్లో పర్సనల్‌గా అనుభూతి పొందుతాం. థియేటర్ అనుభూతే వేరు. మా బ్యానర్‌లో మరో నాలుగు కొరియన్ సినిమాలు రీమేక్ చేయనున్నాం.. వాటిలో సమంతతో ఓ సినిమా ఉంటుంది. డైరెక్టర్ బాపుగారంటే నాకు ఇష్టం. ఆయనలాంటి మూవీస్‌తో పాటు, 'అవతార్' లాంటి ఫ్యాంటసీ సినిమాలు డైరెక్ట్ చేయాలనుంది.. చేస్తాను'' అన్నారు.

రొమాంటిక్ థ్రిల్లర్



● లావణ్య, సుధాకర్

సుధాకర్ జంగం, లావణ్య జంటగా శ్యామ్ మండల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అం అః'. 'ఎ డిఫరెంట్ క్రైమ్ థ్రిల్లర్' ఉపశీర్షిక. రంగస్థలం మూవీ మేకర్స్, శ్రీ పద్మ ఫిలిమ్స్ బ్యానర్స్‌పై జోరిగె శ్రీనివాస్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న రిలీజ్ కానుంది. ''సస్పెన్స్‌తో పాటు యూత్ మెచ్చే అంశాలతో రూపొందిన చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: అవినాష్ ఎ.జగ్తాప్, లైన్ ప్రొడ్యూసర్: పళని స్వామి, కెమెరా: శివా రెడ్డి సావనం, సంగీతం: సందీప్ కుమార్ కంగుల.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	224	60,347
నిఫ్టీ ▽	66	18,004

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,686	△	50
డోజోన్స్	31,134	△	29
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,277	▽	109
డాక్స్	13,208	▽	161
షాంఘై	3,234	▽	26
నికాయ్	27,819	▽	796

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

లోకలైజేషన్ పెరగాలి

- టెక్నాలజీపై పెట్టుబడులు పెంచాలి
- ఆటో విడిభాగాల సంస్థలకు మారుతీ సుజుకీ చైర్మన్ కెనిచి సూచన

న్యూఢిల్లీ: వాహన విడిభాగాల పరిశ్రమ స్థానికీకరణ (లోకలైజేషన్) పెంచడంపై మరింతగా దృష్టి పెట్టాలని ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కెనిచి అయుకావా అభిప్రాయపడ్డారు. నిలకడైన వృద్ధి సాధించేందుకు కొత్త టెక్నాలజీలపై పెట్టుబడులు పెంచడాన్ని కొనసాగించాలని ఆయన సూచించారు. ఆటో విడిభాగాల సంస్థల సమాఖ్య ఏసీఎంఏ 62వ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా అయుకావా ఈ విషయాలు తెలిపారు. 'ముడి వస్తువులు మొదలుకుని అత్యంత చిన్న విడిభాగాలను కూడా వీలైనంత వరకూ స్థానికంగానే ఉత్పత్తి చేసేందుకు మార్గాలు వెతకాలి. భారతీయ ఆటో పరిశ్రమ దేశీయంగాను, అటు ఎగుమతులపరంగానూ భారీ స్థాయికి పెరిగింది. ఇలాంటప్పుడు నాణ్యత అత్యంత ప్రాధాన్యమైన అంశంగా ఉంటుంది. కాబట్టి నాణ్యతా ప్రమాణాలను మరింత మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాలి' అని పేర్కొన్నారు. 2070 నాటికి కర్బన ఉద్గారాలను సున్నా స్థాయికి తగ్గించాలన్న ప్రధాని లక్ష్యం సాకారం చేసే దిశగా భవిష్యత్ తరం టెక్నాలజీలపై పరిశ్రమ ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. పరిశ్రమను తిరిగి వృద్ధి బాట పట్టించేందుకు ఏసీఎంఏ, వాహనాల తయారీ సంస్థల సమాఖ్య సియామ్ కలిసి పనిచేయాలని అయుకావా తెలిపారు. కాగా, ప్యాసింజర్, వాణిజ్య వాహనాల అమ్మకాలు కరోనా పూర్వ స్థాయికి చేరగా.. ద్విచక్ర వాహనాల విక్రయాలు కూడా ఈ పండుగ సీజన్‌లో ఆ స్థాయిని అందుకోగలవని అంచనా వేస్తున్నట్లు ఏసీఎంఏ ప్రెసిడెంట్ సంజయ్ కపూర్ చెప్పారు.



కఠిన చర్యలు..
సరఫరాదారులు విడిభాగాలను స్థానికంగా తయారు చేయకుండా అడ్డుపడే ఆటో మొబైల్ కంపెనీల విషయంలో కేంద్రం కఠినంగా వ్యవహరిస్తుంది. దేశీయంగానే విడిభాగాలను తయారు చేసుకోవడానికి పరిశ్రమ ప్రోత్సాహం ఉంటుందని ఆశిస్తున్నాం.
– పీయూష్ గోయల్,
కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి



ఏసీఎంఏ 62వ వార్షిక సదస్సులో మాట్లాడుతున్న మారుతీ సుజుకీ చైర్మన్ అయుకావా కెనిచి

వాహనాల పరీక్షకు కఠిన ప్రమాణాలు ఉండాలి: పవన్ గోయెంకా



ఎలక్ట్రిక్ వాహనాలను కంపెనీలు ఆదరాబాదరాగా మార్కెట్లోకి తెచ్చేయకుండా తయారీకి సంబంధించి కఠిన ప్రమాణాలు, పరీక్షలు ఉండాలని ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ చైర్మన్ పవన్ గోయెంకా అభిప్రాయపడ్డారు. తద్వారా విద్యుత్ వాహనాలు అగ్ని ప్రమాదాల బారిన పడే ఉదంతాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

పెరిగిన బీవోబీ డిపాజిట్ రేట్లు



న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) రూ.2 కోట్ల వరకు డిపాజిట్లపై వడ్డీ రేట్లను 0.20 శాతం వరకు పెంచింది. పెరిగిన రేట్లు ఈ నెల 13 నుంచి అమల్లోకి వచ్చాయి. ఏడాది టర్మ్ డిపాజిట్‌పై రేటు 5.30 శాతం నుంచి 5.50 శాతానికి పెరిగింది. 400 రోజులు దాటి, మూడేళ్ల వరకు కాల వ్యవధి కలిగిన డిపాజిట్లపై రేటు 5.45 శాతం నుంచి 5.50 శాతానికి చేరింది. మూడేళ్లు దాటి, పదేళ్ల వరకు డిపాజిట్లపై రేటు 0.15 శాతం పెరిగి 5.65 శాతానికి చేరుకుంది. ఏడాది కాల డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 5.80 శాతం రేటు లభిస్తుంది. ఇతర కాల వ్యవధి కలిగిన డిపాజిట్లపైనా వృద్ధులకు కొంచెం అదనపు వడ్డీని బీవోబీ ఆఫర్ చేస్తోంది. 'బరోడా ట్యాక్స్ సేవింగ్స్ టర్మ్ డిపాజిట్' 5–10 ఏళ్ల కాల వ్యవధికి 5.65 శాతం రేటు లభిస్తుంది. సీనియర్ సిటిజన్లకు 0.15 శాతం అదనపు రేటును బ్యాంక్ అందిస్తోంది.

మూన్‌లైటింగ్ అనైతికం: ఐబీఎం



ముంబై: ఐటీ రంగంలో మూన్‌లైటింగ్‌కు (రెండు ఉద్యోగాలు) వ్యతిరేకంగా గళమెత్తే కంపెనీల సంఖ్య పెరుగుతోంది. విప్రో, ఇన్ఫోసిస్ తర్వాత ఆ జాబితాలో తాజాగా ఐబీఎం ఇండియా కూడా చేరింది. మూన్‌లైటింగ్ అనైతికమని ఐబీఎం ఇండియా, దక్షిణాసియా విభాగం ఎండీ సందీప్ పటేల్ వ్యాఖ్యానించారు. 'ఉద్యోగులు మా దగ్గర చేరేటప్పుడు ఐబీఎం కోసం మాత్రమే పనిచేస్తామన్న ఒప్పందంపై సంతకం చేస్తారు. పని వేళల తర్వాత ఖాళీ సమయాల్లో వారు ఏదైనా చేసుకోవచ్చన్న విషయం పక్కన పెడితే, మూన్‌లైటింగ్ మాత్రం అనైతికమే' అని పేర్కొన్నారు.

ఆగస్టులో ఎగుమతులు.. 'ఫ్లస్సే'



న్యూఢిల్లీ: భారత్ ఎగుమతులు ఆగస్టులో వృద్ధినే నమోదుచేసినట్లు వాణిజ్యమంత్రిత్వశాఖ బుధవారం వెలువరించిన సవరిత గణాంకాలు స్పష్టం చేశాయి. సమీక్షా నెల ఎగుమతుల్లో 1.62 శాతం వృద్ధి నమోదయిందని, విలువలో ఇది 33.92 డాలర్లని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఇదిలాఉండగా, నెలవారీగా తొలి లెక్కలు క్షీణతలో ఉండడం, అటు తర్వాత అవి వృద్ధిబాటలోకి రావడం ఇది వరుసగా రెండవనెల. జూలైలో తొలి గణాంకాలు క్షీణత (–0.76) నుంచి 2 శాతం వృద్ధికి మారాయి. ఆగస్టు విషయంలో తొలి గణాంకాల క్షీణ అంచనా మైనస్ 1.15 శాతం.

మార్కెట్‌పై అమెరికా ద్రవ్యోల్బణం దెబ్బ

- తెరపైకి వడ్డీరేట్ల పెంపు భయాలు
- నాలుగు రోజుల లాభాలకు బ్రేక్
- ఇంట్రాడేలో భారీ ఒడిదుడుకులు
- ఆరంభ నష్టాల నుంచి కొంత ఊరట
- 224 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- నిఫ్టీ నష్టం 66 పాయింట్లు



ముంబై: అమెరికాలో ద్రవ్యోల్బణం దిగిరాకపోవడంతో ఈక్విటీ మార్కెట్లను మరోసారి ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు భయాలు వెంటాడాయి. ఈ ప్రతికూల ప్రభావం భారత మార్కెట్‌పై కూడా పడింది. ఫలితంగా దేశీయ స్టాక్ సూచీల నాలుగు రోజుల ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. ఇంట్రాడేలో 1231 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 224 పాయింట్లు నష్టంతో 60,347 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 320 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. మార్కెట్ ముగిసేసరికి 66 పాయింట్లు నష్టపోయి 18,004 వద్ద నిలిచింది. ఐటీ, ఫార్మా, ఇంధన షేర్లు భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో నెలకొన్న ఆర్థిక మాంద్య భయాలతో ఐటీ షేర్లు భారీ పతనాన్ని చవిచూశాయి. మెటల్, బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లు రాణించి సూచీలు తేరుకోవడానికి దన్నుగా నిలిచాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.188 కోట్ల షేర్లను కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.1,398 కోట్ల షేర్లను అమ్మేశారు.

భారీ నష్టాల్లో అంతర్జాతీయ మార్కెట్లు

ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల రేట్ల పెంపు భయాలకు ఆర్థిక మాంద్యం ఆందోళనలు వెంటాడటంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో తీవ్ర నష్టాలను చవిచూశాయి. అమెరికా మార్కెట్లు మంగళవారం 4–5% క్షీణించాయి. అక్కడి నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న ఆసియా, యూరప్ మార్కెట్లు బుధవారం వరుసగా 3–2% పతనమయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ బుధవారం 35 పైసలు క్షీణించి 79.52 వద్ద స్థిరపడింది.

ఇంట్రాడేలో భారీ రికవరీ

సెన్సెక్స్ 1154 పాయింట్ల పతనమై 59,417 వద్ద, నిఫ్టీ 299 పాయింట్లు క్షీణించి 17,771 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. భారీ పతనం నేపథ్యంలో ఇన్వెస్టర్లు దిగువస్థాయిలో కొనుగోళ్లు చేపట్టారు. మిడ్ సెషన్ చివరికల్లా సూచీలు ఆరంభ నష్టాలను పూడ్చుకొని స్వల్పంగా లాభాల్లోకి మళ్లాయి. ఆఖర్లో మరోసారి అమ్మకాలు తలెత్తడంతో సూచీలకు నష్టాలు తప్పలేదు.

ఇన్వెస్టర్లకు రూ.76,197 కోట్ల నష్టం

సెన్సెక్స్ 224 పాయింట్ల పతనంతో ఇన్వెస్టర్లకు రూ.76,197 కోట్ల నష్టం వాటిల్లింది. దీంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం విలువ రూ.286 లక్షల కోట్లకు దిగివచ్చింది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	50,300	▼	376
బంగారం (99.5 స్వచ్ఛత)	50,099	▼	374
వెండి (కిలో)	56,350	▼	920

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-9-2022	
విశాఖ	450–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్ ధర (డజను)	66.00
14-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	390–00
వరంగల్	392–00
రిటైల్ ధర	4.50

టోకు ద్రవ్యోల్బణం తగ్గినా, 'తీవ్రమే'

- ఆగస్టులో 12.41 శాతం
- 11 నెలల కనిష్ట స్థాయి

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఆగస్టులో 12.41 శాతంగా (2021 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. గడచిన 11 నెలలుగా ఇంత తక్కువ స్థాయి టోకు ధరల రేటు నమోదు ఇదే తొలిసారి. గడచిన మూడు నెలలుగా టోకు ధరల స్పీడ్ తగ్గుతూ వస్తోంది. అయితే ఈ సూచీ రెండంకెలపైనే కొనసాగడం ఇది వరుసగా 17వ నెల. దీనితోపాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్యపరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టు వరకూ వరుసగా ఎనిమిది నెలల నుంచి కేంద్రం నిర్దేశిస్తున్న 6 శాతం ఎగువన కొనసాగుతోంది. ఆయా అంశాలు సామాన్యునిపై ధరల భారాన్ని మోపుతున్నాయి. గణాంకాల్లో కొన్ని కీలక విభాగాలను పరిశీలిస్తే..

- ఫుడ్ ఆర్టికల్స్ ద్రవ్యోల్బణం 12.37 శాతంగా ఉంది. జూలైలో ఈ రేటు 10.77 శాతమే. తృణధాన్యాలు (1.77శాతం), గోధుమలు (17.35 శాతం) పండ్లు (31.75 శాతం), కూరగాయల (22.92 శాతం) ధరలు పెరుగుదల బాటన ఉన్నాయి. టమాటా విషయంలో ధర 43.56 శాతం ఎగసింది.
- ఇంధనం, విద్యుత్ బాస్కెట్‌లో ద్రవ్యోల్బణం 33.67 శాతంగా ఉంది. అయితే జూలైలో ఈ స్పీడ్ 43.75 శాతం.
- తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 7.51% ఉంది.
- ఆయిల్‌సీడ్స్ విషయంలో రేటు 13.48% తగ్గింది.



17 నెలలుగా ఇలా...

నెల	టోకు ద్రవ్యోల్బణం(%ల్లో)
2021 ఏప్రిల్	10.74
మే	13.11
జూన్	12.07
జూలై	11.16
ఆగస్టు	11.39
సెప్టెంబర్	10.66
అక్టోబర్	12.54
నవంబర్	14.87
డిసెంబర్	13.56
2022 జనవరి	12.96
ఫిబ్రవరి	13.11
మార్చి	14.55
ఏప్రిల్	15.08
మే	15.88
జూన్	15.18
జూలై	13.93



భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పదో తరగతితోనే.. బీటెక్

» ఏపీ ట్రిపుల్ ఐటీల్లో ఇంటిగ్రేటెడ్ బీటెక్‌ప్రోగ్రామ్
» 2022-23 సంవత్సరానికి ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ
» పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక

బీటెక్.. లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఇందుకోసం ఇంటర్మీడియెట్ ఎంపీసీలో చేరడం.. ఆ తర్వాత ఎంట్రన్స్ టెస్ట్‌ల్లో లక్షల మందితో పోటీపడి ర్యాంకు సాధిస్తేనే సీటు లభిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో పదో తరగతి అర్హతతోనే.. అకడమిక్ మార్కుల ఆధారంగా.. నేరుగా బీటెక్ చదివేందుకు మార్గం.. ఏపీ ట్రిపుల్ ఐటీలు!! ఈ క్యాంపస్‌లలో సీటు సొంతం చేసుకుంటే.. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ లభిస్తుంది. తాజాగా 2022-23 సంవత్సరానికి సంబంధించి ఏపీ ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఏపీ ట్రిపుల్ ఐటీల ప్రాముఖ్యత, ప్రవేశ విధానం, కోర్సులు, కెరీర్ స్కోప్‌పై కథనం...

మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. మానస పుత్రికలుగా ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్‌లు..ఏపీ ట్రిపుల్ ఐటీలు. ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉన్నత విద్య, అందులోనూ సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్‌లు ఇవి. వీటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ(ఆర్‌జీయూకేటీ) పేరుతో.. యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశారు. ఏపీ ట్రిపుల్ ఐటీలు ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నాయి.

అర్హతలు

- 2022లో పదో తరగతి, తత్సమాన కోర్సు ఉత్తీర్ణత (మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించాలి) ఉండాలి. ఈ ఏడాదికి సంబంధించి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు.
- 85శాతం సీట్లు లోకల్ విద్యార్థుల(ఆంధ్రప్రదేశ్)కు కేటాయిస్తారు. మిగతా 15శాతం సీట్లకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల విద్యార్థులు పోటీపడొచ్చు.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 5శాతం సూపర్ న్యూమరరీ సీట్లకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఈ సీట్లకు గల్ఫ్‌దేశాల్లో పనిచేస్తున్న వారి పిల్లలు/ఎన్ఆర్ఐ విద్యార్థులు/అంతర్జాతీయ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

నాలుగు క్యాంపస్‌లు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు క్యాంపస్‌ల ద్వారా ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నారు. ఒక్కో క్యాంపస్‌లో వేయి సీట్లు చొప్పున మొత్తం నాలుగు వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా ఈడబ్ల్యూఎస్ కోటాకు పది శాతం సీట్లు కలపనున్నారు. ప్రస్తుతం ఆర్.కె.వ్యాలీ (ఇడుపులపాయ), నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళంలో ఈ క్యాంపస్‌లు ఉన్నాయి.

మెరిట్ ఆధారంగా ప్రవేశాలు

ఏపీ ట్రిపుల్ ఐటీల్లో పదో తరగతిలో మెరిట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి ప్రవేశాలు కల్పిస్తున్నారు. విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వారు పొందిన మార్కులకు అదనంగా.. నాలుగు మార్కులను డిప్రైవేషన్ స్కోర్ పేరిట కలుపుతారు. గతేడాది కరోనా పరిస్థితుల కారణంగా ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ ఏడాది.. ఆర్‌జీయూకేటీ విధానాల ప్రకారం-పదో తరగతిలో మెరిట్ ఆధారంగానే ఎంపిక చేసే విధానాన్ని అనుసరించనున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. విద్యార్థులు పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి సీట్ల కేటాయింపు చేస్తారు.

అప్‌లోడ్ చేయాల్సిన డాక్యుమెంట్లు

- విద్యార్థులు దరఖాస్తు సమయంలోనే నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. » పదో తరగతి హాల్‌టికెట్ నెంబర్ » పుట్టిన తేదీ సర్టిఫికెట్ »కుల ధ్రువీకరణ పత్రం »ఆధార్ నెంబర్ » ఎన్‌సీసీ, పీహెచ్, సీఏపీ కేటగిరీ విద్యార్థులు అందుకు సంబంధించిన ధ్రువ పత్రాలు »ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ » ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ » తెల్ల రేషన్ కార్డ్/రైస్ కార్డ్ »నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్ »లోకల్ కేటగిరీ కోరుకుంటున్న అభ్యర్థులు అందుకు సంబంధించి అధికారులు జారీ చేసిన రెసిడెన్స్ సర్టిఫికెట్.

పీయూసీ + బీటెక్

ఏపీ ట్రిపుల్ ఐటీల విద్యా విధానం వినూత్నమని చెప్పొచ్చు. మొత్తం ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో.. తొలి రెండేళ్లను పీయూసీ (ఇంటర్మీడియెట్ తత్సమాన) కోర్సుగా పరిగణిస్తారు. ఆ తర్వాత నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్ బోధన సాగుతుంది.

వినూత్న సబ్జెక్ట్‌లు

ఏపీ ట్రిపుల్ ఐటీల్లోని మొదటి రెండేళ్ల పీయూసీ విధానంలో.. ఎంపీసీ గ్రూప్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, తెలుగు, ఐటీ కోర్సులను అందిస్తున్నారు. అంతేకాకుండా బయాలజీ సబ్జెక్ట్‌ను కూడా ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశం ఉంది. బయాలజీని ఆప్షనల్‌గా ఎంపిక చేసుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్‌లకు హాజరయ్యే అర్హత లభిస్తుంది.



ఏపీ ట్రిపుల్ ఐటీలు

మూడో ఏడాది నుంచి బీటెక్

- మొదటి రెండేళ్ల పీయూసీ పూర్తి చేసుకున్న తర్వాత.. మూడో ఏడాది నుంచి బీటెక్ ప్రోగ్రామ్ ప్రారంభమవుతుంది. బీటెక్‌లో ఏడు బ్రాంచ్‌లను ఎంచుకునే అవకాశం అందుబాటులో ఉంది. అవి.. కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్.
- కెమికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు నూజివీడు, ఆర్.కె.వ్యాలీ క్యాంపస్‌లలోనే అందుబాటులో ఉన్నాయి.
- రెండేళ్ల పీయూసీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులు.. తమ ఆసక్తి, అభిరుచి మేరకు నిర్దిష్ట బ్రాంచ్‌ను ఎంచుకుని బీటెక్ ప్రోగ్రామ్‌లో అడుగు పెట్టొచ్చు.

'పీయూసీ'తో ఎగ్జిట్ అవకాశం

రెండేళ్ల వ్యవధిలోని పీయూసీ పూర్తి చేసుకున్న తర్వాత విద్యార్థులకు ఎగ్జిట్ అవకాశం కూడా ఉంది. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల ద్వారా సీటు సొంతం చేసుకున్న వారికి ఈ ఎగ్జిట్ సదుపాయం ఉపయుక్తం. ఇలాంటి విద్యార్థులకు పీయూసీ సర్టిఫికెట్ అందిస్తారు. దాని ఆధారంగా వారు ఉన్నత విద్య కోణంలో ఐఐటీలు, ఎన్ఐటీలు, మెడికల్ కళాశాలల్లో చేరే అవకాశం లభిస్తుంది.

నచ్చిన ప్రోగ్రామ్

రెండేళ్ల పీయూసీని పూర్తి చేసుకున్న విద్యార్థులు తమకు నచ్చిన బ్రాంచ్‌లను ప్రాథమ్యాల వారీగా పేర్కొనాలి. ప్రవేశాల కమిటీ ఆ దరఖాస్తులను పరిశీలించి.. పీయూసీ స్థాయిలో పొందిన మార్కులు, బీటెక్‌లో అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకుని బ్రాంచ్‌లను కేటాయిస్తుంది.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

పలు ఎంఎన్‌సీ సంస్థలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాయి. ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. అదేవిధంగా యూపీఎస్‌సీ నిర్వహించే ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, ఇతర ఉద్యోగ పోటీ పరీక్షల్లోనూ ఇక్కడి విద్యార్థులు విజయం సాధిస్తున్నారు. ఏపీ ట్రిపుల్ ఐటీల్లోని యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ఫలితంగా..విద్యార్థులు బీటెక్ తర్వాత గేట్, పీజీఈసెట్ తదితర ఉన్నత విద్య ఎంట్రన్స్ టెస్ట్‌లలో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు.

ఇంటర్న్‌షిప్ కూడా

ఏపీ ట్రిపుల్ ఐటీల్లో బీటెక్ చదువుతున్న వారికి ఇంటర్న్‌షిప్ అవకాశాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పరిధిలోని ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ ట్రెయినింగ్‌లో చేరొచ్చు. వీటితోపాటు పలు ప్రైవేట్ సంస్థల్లోనూ ఇంటర్న్‌షిప్ కల్పించేలా యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

స్కాలర్‌షిప్ సదుపాయం

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం సైతం అందుబాటులో ఉంటుంది. కుటుంబ వార్షికాదాయం రూ.2.5 లక్షలలోపు ఉన్న వారికి ఏపీ ప్రభుత్వం విద్యా దీవెన పథకం ద్వారా ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తున్నారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు చివరి తేదీ: సెప్టెంబర్ 19, 2022
- స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్: సెప్టెంబర్ 27 –సెప్టెంబర్ 30
- ఎంపిక జాబితా వెల్లడి(స్పెషల్ కేటగిరీ మినహా): సెప్టెంబర్ 29
- నూజివీడు క్యాంపస్, ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లలో సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్: అక్టోబర్ 12, 13 తేదీల్లో
- శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ అక్టోబర్ 14, 15 తేదీల్లో
- శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి నూజివీడులో, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి ఆర్‌కే వ్యాలీ(ఇడుపులపాయ)లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.
- క్లాసుల ప్రారంభం: అక్టోబర్ 17 నుంచి.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.rgukt.in
- ఆన్‌లైన్ దరఖాస్తు లింక్: https://admissions22.rgukt.in/app/apply

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్‌పీఎస్సీలో 833 పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. • మొత్తం పోస్టుల సంఖ్య: 833

- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ఇంజనీర్–434, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్–399.
- **విభాగాలు:** పంచాయతీరాజ్, మున్సిపల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, పబ్లిక్ హెల్త్, ట్రైబల్ వెల్ఫేర్, ఇరిగేషన్ తదితరాలు.

అర్హతలు

- **అసిస్టెంట్ ఇంజనీర్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ డిప్లొమా/బీఈ /బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 18–44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు వర్తిస్తుంది. **జీతం:** నెలకు రూ.45,960 నుంచి రూ.1,24,150 చెల్లిస్తారు.

జూనియర్ టెక్నికల్ ఆఫీసర్

- సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ డిప్లొమా/బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 18–44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు వర్తిస్తుంది. **జీతం:** నెలకు రూ.32,810 నుంచి రూ.96,890 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 28.09.2022
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.10.2022
- **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

మజ్‌గావ్‌డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్, ముంబైలో 1041 ఉద్యోగాలు

ముంబైలోని మజ్‌గావ్‌డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్.. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. • **మొత్తం పోస్టుల సంఖ్య:** 1041

- **పోస్టుల వివరాలు:** ఎలక్ట్రీషియన్, పెయింటర్, పైప్ ఫిట్టర్, హిందీ ట్రాన్స్‌లేటర్, రిగ్గర్, సేఫ్టీ ఇన్‌స్పెక్టర్, స్టోర్ కీపర్, ఫార్మాసిస్ట్, పారామెడిక్స్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్, సెయిల్ మేకర్ తదితరాలు.
- **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ మెకానిక్/మెకానిక్ రేడియో, రాడార్ ఎయిర్‌క్రాఫ్ట్/మెకానిక్ టెలివిజన్(వీడియో)/మెకానిక్ కమ్ ఆపరేటర్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ సిస్టమ్ /మెకానిక్ కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్/ మెకానిక్ రేడియో–టీవీ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ/ఐటీఐ /డిప్లొమా/డిగ్రీ/పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
- **వయసు:** 18 నుంచి 33 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ట్రేడ్/స్కిల్ టెస్ట్, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.09.2022
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2022
- **వెబ్‌సైట్:** www.mazagondock.in

బీజీసీఎల్, కోల్‌కతాలో 39 పోస్టులు

కోల్‌కతాలోని గెయిల్‌కి చెందిన బెంగాల్ గ్యాస్ కంపెనీ లిమిటెడ్(బీజీసీఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 39
- **పోస్టుల వివరాలు:** జూనియర్ అసోసియేట్, అసిస్టెంట్ అసోసియేట్, అసోసియేట్ కంపెనీ సెక్రటరీ, సీనియర్ అసోసియేట్, చీఫ్ అసోసియేట్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ /బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎంబీఏ/పీజీడీఎం/ఎంఎంఎస్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** పోస్టును అనుసరించి 56ఏళ్లకు మించకూడదు. **జీతం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,15,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, స్క్రీనింగ్, ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.09.2022
- **వెబ్‌సైట్:** bgcl.co.in

ఐఎండీ, న్యూఢిల్లీలో 165 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ విభాగం.. ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 165
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్, జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్), సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఆఫ్).

అర్హత:

- **ప్రాజెక్ట్ సైంటిస్ట్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీటెక్/బీఈ/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 35–45 ఏళ్లు ఉండాలి. **జీతం:** నెలకు రూ.56,000 నుంచి రూ.78,000 చెల్లిస్తారు.
- **జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 ఏళ్లు ఉండాలి. **జీతం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.10.2022
- **వెబ్‌సైట్:** imd.gov.in

క్లుప్తంగా

రాష్ట్రం యూనిట్‌గా ఏసీబీ జాయింట్ కమిషనర్ కార్యాలయం

సాక్షి, అమరావతి: ఏసీబీ విభాగంలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) జాయింట్ డైరెక్టర్ కార్యాలయాన్ని రాష్ట్ర పరిధితో పోలీస్ స్టేషన్‌గా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రం ఒక యూనిట్‌గా జాయింట్ డైరెక్టర్ కార్యాలయం ఇక నుంచి విధులు నిర్వర్తిస్తుందని హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులిచ్చారు.

'ఎంపీహెచ్‌డబ్ల్యూ'కు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్(ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సులో మహిళలకు ప్రవేశాల కోసం వైద్య శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. అక్టోబర్ 31 వరకు దరఖాస్తులకు గడువు విధించింది. https://cfw.ap.nic.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని.. ఎస్ఎస్‌సీ, ఇంటర్, స్టడీ సర్టిఫికెట్‌లతో పాటు కుల, నివాస ధ్రువపత్రాలు జత చేసి రిజిస్ట్రేషన్ ఫీజు(రూ.50 డీడీ)తో కలిపి డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో అందజేయాలని సూచించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఇంటర్ విద్యాభ్యాసంతో.. డిసెంబర్ నెలాఖరుకు 17 ఏళ్లు నిండిన వారు, 30 ఏళ్ల లోపువారు దరఖాస్తులకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా 61 శిక్షణ కేంద్రాల్లో రెండేళ్ల పాటు శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కేంద్రాల్లో ఉచితంగా, ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో 60 శాతం సీట్లలో ఉచిత ప్రవేశాలుంటాయి. మిగిలిన 40 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. జేసీ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఉచిత సీట్ల భర్తీ ప్రక్రియను పర్యవేక్షిస్తుంది. అర్హుల జాబితాను నవంబర్ 14న డీఎంహెచ్‌వోలు ప్రకటిస్తారు. నవంబర్ 21 నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

మరో ముందడుగు

విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల సెంట్రల్ ఓపీ భవన నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజలో శ్రీనివాసరావు, బెల్లాన

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు సంబంధించి మరో ముందడుగు పడింది. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో రూ.60 లక్షలతో సెంట్రల్ ఓపీ రిజిస్ట్రేషన్ భవన నిర్మాణ పనులకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ బుధవారం భూమి పూజ చేశారు. వచ్చే ఏడాది విద్యా సంవత్సరంలో వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్ర ఆస్పత్రిని బోధనాస్పత్రిగా మార్చేందుకు రూ.8.50 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

గుట్కాపై 'సెబ్' అస్త్రం

గుట్కా అక్రమ రవాణా అడ్డుకట్ట బాధ్యతలు

- సెబ్‌కు విస్తృతాధికారాలు.. త్వరలో ఉత్తర్వులు
- రాష్ట్రం ఒక యూనిట్‌గా గుట్కా కేసుల నమోదు
- నిందితులు సాంకేతిక కారణాలతో తప్పించుకోలేరు
- ఇతర రాష్ట్రాలతోనూ సమన్వయం సులభం
- తద్వారా గుట్కా రాకెట్‌కు చెక్ పెట్టొచ్చు



సాక్షి, అమరావతి: గుట్కాను నిషేధించినప్పటికీ రాష్ట్రంలో అక్రమంగా సాగుతున్న దందాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. గుట్కా రాకెట్ ఆటకట్టించేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)కు ప్రత్యేక అధికారాలు ఇచ్చింది. గుట్కా అక్రమ రవాణా, అమ్మకాలను అరికట్టే బాధ్యతను సెబ్ పరిధిలోకి తెచ్చింది. రాష్ట్రంలో గంజాయి, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా సెబ్ వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సెబ్ పరిధిని విస్తరిస్తూ గుట్కా దందా ఆటకట్టించే బాధ్యతను కూడా దీని పరిధిలోకి తేవాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈ మేరకు సెబ్‌కు విస్తృతంగా అధికారాలు కల్పించారు. రాష్ట్రం ఒక యూనిట్‌గా గుట్కా కేసులను సెబ్ పరిధిలోకి తేనున్నారు. ఈమేరకు త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

సెబ్‌తో అడ్డుకట్ట సులభం

గుట్కా ప్రధానంగా ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి అక్రమంగా తెస్తున్నారు. స్థానిక పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, జిల్లా సరిహద్దులు వంటి సాంకేతిక కారణాలతో నిందితులు బెయిల్ పొందుతూ తప్పించుకుంటున్నారు. కేసుల దర్యాప్తులో కూడా కాలయాపన జరుగుతోంది. దాంతో గుట్కా దందాను అడ్డుకునే బాధ్యతను స్థానిక పోలీసులకంటే సెబ్‌కు అప్పగించడమే మంచిదని నిర్ణయించారు. రాష్ట్రం అంతా సెబ్ అధికార పరిధిలోకి వస్తుంది కాబట్టి జిల్లా సరిహద్దులు వంటి సాంకేతిక అడ్డంకులు ఉండవు. సెబ్‌కు ఇప్పటికే ప్రత్యేకంగా 208 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతోపాటు అవసరమైతే పొరుగు రాష్ట్రాల పోలీసులతోనూ సమన్వయం చేసుకొనే అవకాశం ఉంటుంది. ఇప్పటికే గంజాయి సాగు, అక్రమ రవాణాను అరికట్టడంతో పొరుగు రాష్ట్రాలకు సెబ్ మార్గనిర్దేశం చేస్తోంది. అందువల్ల పొరుగు రాష్ట్రాలతో సమన్వయం కూడా సెబ్‌కు సులభం అవుతుంది. గుట్కా రాకెట్‌ను అరికట్టడంలో కూడా సెబ్ స్థానిక పోలీసులతో పాటు ఇతర రాష్ట్రాల పోలీసులతోనూ కలిసి పనిచేయగలుగుతుంది. ఇప్పటికే 'క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్)' పరిధిలోకి పోలీసు విభాగంతోపాటు సెబ్ కూడా చేరింది. సీసీటీఎన్ఎస్‌లోని సమాచారం రాష్ట్రంలోని 950 పోలీసు స్టేషన్లతోపాటు 208 సెబ్ పోలీసు స్టేషన్లకూ అందుబాటులోకి వచ్చింది. దీంతో సెబ్ అధికారులు సమర్థంగా గుట్కాను కట్టడిచేయొచ్చు. సాంకేతిక అంశాలను సాకుగా చూపించి నేరస్తులు తప్పించుకునే అవకాశాలూ ఉండవు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సెబ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, గుట్కాతో పాటు అన్ని రకాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

షుక్రియా.. సీఎం సార్

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాపై మహిళల హర్షం



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



విశాఖలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కడప కార్పొరేషన్/సాక్షి, విశాఖపట్నం: పేదింటి యువతుల వివాహాలను గౌరవంగా జరిపించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెడుతున్న వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం కడపలో మహిళలు 'కృతజ్ఞతా ర్యాలీ' నిర్వహించారు. 'షుక్రియా సీఎం సార్.. థ్యాంక్యూ సీఎం సార్' అంటూ నినాదాలు చేస్తూ.. సీఎం జగన్‌పై తమ అభిమానాన్ని చాటుతూ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ ఆడిటోరియం వద్ద ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాదీనిని ప్రారంభించారు. అలాగే విశాఖలోని లక్ష్మీటాకీసు వద్ద సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేసి సంతోషం వ్యక్తం చేశారు. పేదల పెన్నిధి సీఎం క్షేమం కోరుతూ శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సింహాచలం కొబ్బరికాయలు కొట్టారు.

ఏపీ ఇంధన సామర్థ్య గృహనిర్మాణం భేష్

'అంగన్' అంతర్జాతీయ సదస్సులో ప్రశంసలు

సాక్షి, అమరావతి: 'ఏపీలో 30 లక్షల ఇళ్లను నిర్మిస్తున్న భారీ పథకంలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయించడం పర్యావరణ పరిరక్షణలో కీలకమైన ముందడుగు. ఇందుకోసం భవన నిర్మాణంలో ఇండోస్విస్ సాంకేతికతను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) ద్వారా అందించడం మాకు సంతోషంగా ఉంది. ఇకముందు కూడా మా సహకారాన్ని కొనసాగిస్తాం..' అని భారత్‌లో స్విట్జర్లాండ్ రాయబార కార్యాలయానికి చెందిన అంతర్జాతీయ సహకారం విభాగం అధిపతి జోనాథన్ డెమెంగే చెప్పారు. ఢిల్లీలో బుధవారం మొదలైన ఆగ్మెంటింగ్ నేచర్ బై గ్రీన్ అఫర్డబుల్ న్యూ హాబిటాట్ (అంగన్)–2022 అంతర్జాతీయ సదస్సులో ఆయన ఈ మేరకు ఏపీని ప్రశంసించారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'లో భాగంగా భారీ గృహనిర్మాణ ప్రాజెక్టులో ఇంధన సామర్థ్య సాంకేతికతలను అమలు చేసేందుకు ఏపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రపంచదేశాల ప్రతినిధుల దృష్టిని ఆకర్షించాయి. ఏపీతో సహా వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న అత్యుత్తమ ఇంధన సామర్థ్య పద్ధతులపై అంతర్జాతీయ సదస్సుకు నోడల్ అధికారిగా ఉన్న బీఈఈ డైరెక్టర్ సౌరభ్ దిదితో కలిసి బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే వివరించారు. భవన నిర్మాణ నిబంధనల్లో ఈసీబీసీని తప్పనిసరిచేసిన ఏపీ ప్రభుత్వాన్ని వారు అభినందించారు. రాష్ట్రంలో ఇంధన పొదుపు, సామర్థ్య కార్యక్రమాల అమలులో ముఖ్యంగా బిల్డింగ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ కార్యక్రమాల్లో ఏపీకి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పలు దేశాల ప్రతినిధులు ఏపీ ఇంధన సామర్థ్య గృహాల కార్యక్రమం గురించి అడిగి తెలుసుకుని అభినందించారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

- అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి
- కర్నూలు న్యాయవాదుల డిమాండ్



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ తదితరులు

కర్నూలు (లీగల్): రాష్ట్ర హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ప్రతిపక్ష పార్టీలు సహకరించి సీమ ప్రజల చిరకాల వాంఛను తీర్చాలని కర్నూలు న్యాయవాదులు డిమాండ్ చేశారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. కర్నూలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఆర్.కృష్ణ, సీమ న్యాయవాదుల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ వై.జయరాజు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రవిగువేరా, సీనియర్ న్యాయవాదులు ఓంకార్, నాగలక్ష్మీదేవి, ఎం.సుబ్బయ్య, పి.సువర్ణరెడ్డి, బి.చంద్రుడు, రాజేష్, రంగనాథ్ మాట్లాడారు. హైకోర్టును కర్నూలుకు తరలించేందుకు ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నా టీడీపీ అధినేత చంద్రబాబు అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. సీమలో హైకోర్టు ఏర్పాటు చరిత్రాత్మక అవసరమే కాకుండా మూడుప్రాంతాల సమతుల్యానికి దోహదం చేస్తుందన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు టీడీపీ తప్ప అన్ని రాజకీయ పార్టీలు మద్దతిచ్చాయని గుర్తుచేశారు. శాసన రాజధాని, కార్యనిర్వాహక రాజధానులతో సంబంధం లేకుండా తక్షణం రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. ఈ మేరకు సీఎం జగన్‌కు, ప్రతిపక్ష నేతకు, సీమప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలు ఇస్తామని చెప్పారు.

ఆన్‌లైన్ స్వయంవరం

ఇబ్బడి ముబ్బడిగా మ్యాట్రిమోని వెబ్‌సైట్లు, యాప్‌లు

- భాగస్వామి ఎంపికలో జాగ్రత్త
- జోడీల ముసుగులో కేడీలు
- డబ్బులు కాజేసి ఫోన్ స్విచ్చాఫ్

(బీవీ రాఘవరెడ్డి)

> ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు!
> డబ్బులుంటే కట్టిన ఇల్లు కొనుక్కోవచ్చు..
> వివాహం మాత్రం సంక్షిప్త వ్యవహారమే!

అప్పట్లో పెళ్లిళ్ల పేరయ్యలు, ఆ మ్యారేజి బ్యూరోలు సంబంధాలు కుదర్చటంలో ముఖ్య పాత్ర పోషించగా టెక్నాలజీ పెరిగాక వెబ్‌సైట్‌లు, యాప్‌లు వచ్చేశాయి. కాలికి బలపం కట్టుకుని తిరిగే పని లేకుండా ఇంట్లో కూర్చుని ఇంటిల్లిపాదీ తిలకించేలా చౌకగా సేవలందిస్తున్నాయి. దేశంలో ప్రముఖ పెళ్లిళ్ల వెబ్‌సైట్‌లను పరిశీలిస్తే భారత్ మ్యాట్రిమోనికి కోటి మందికి పైగా వినియోగదారులున్నారు. మ్యాచ్ ఫైండర్ మ్యాట్రిమోనిలో రెండు వేల ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు రిజిస్టర్ చేసుకున్నారు. 2002లో ప్రారంభించిన ఫ్రీ వెబ్‌సైట్ వివాహ్ డాట్‌కామ్ ఉచితంగానే సేవలందిస్తోంది. వెబ్‌గేట్ డాట్‌కామ్ రోజుకు 600 మందికి పైగా ఖాతాదారులకు సేవలు అందిస్తున్నట్లు చెబుతోంది. 1996లో ప్రారంభమైన షాదీ డాట్‌కామ్ దేశంలోనే మొదటిదిగా చెబుతారు. కమ్యూనిటీ మ్యాట్రిమోనికి దేశంలో 140 శాఖలున్నాయి. డైవర్సీ మ్యాట్రిమోని యాప్‌ను 5 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగిస్తున్నారు. వెబ్‌సైట్ నిర్వాహకుల్లో కొందరు ఉచితంగా సేవలందిస్తుంటే మిగిలిన వారు రూ.500 నుంచి రూ.5,000 వరకు వసూలు చేస్తున్నారు. మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఫీజు చెల్లిస్తే సరైన జోడీని వెతికి పెడతామంటున్నారు. విద్యార్హతలు, ఉద్యోగం, ఇష్టాయిష్టాలు, కుల గోత్రాలు, జాతకచక్రాలు, ఆర్థిక స్థితి, కుటుంబ నేపథ్యం లాంటి వివరాలన్నీ ఫొటోలు, ఫోన్ నంబర్లతో సహా వెబ్‌సైట్లు అందుబాటులో ఉంచుతున్నాయి. యువతీ యువకుల ప్రాధాన్యతలకు అనుగుణంగా పర్‌ఫెక్ట్ మ్యాచ్‌లను సూచిస్తున్నాయి. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్స్‌లో అబ్బాయిల కంటే అమ్మాయిలే చురుగ్గా ఉంటున్నారు.

ఆచి తూచి అడుగేయాల్సిందే...

ఇదంతా ఒకఎత్తు కాగా పెళ్లిళ్ల వెబ్‌సైట్‌లను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న కేసులు పెరుగుతున్నాయి. నకిలీ ప్రొఫైల్స్, ఫొటోలతో రిజిస్టర్ చేసుకుని అమాయకులను మోసగిస్తున్నారు. మార్ఫింగ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసి కొందరు కేటుగాళ్లు టోకరా వేస్తున్నారు. వివరాలు సేకరించి బహుమతులు పంపి ఎర వేస్తుంటారు. లైంగిక దాడులకు పాల్పడుతున్న ఘటనలూ వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి వాటి బారిన పడకుండా అప్రమత్తత అవసరం. సమాచారం కోసమే మ్యాట్రిమోని సైట్లను ఉపయోగించుకోవాలి. పెద్దల ద్వారా ప్రత్యక్షంగా పూర్తి వివరాలు నిర్ధారించుకున్న తర్వాతే ఒక నిర్ణయానికి రావాలి. ఫోన్ చేసి డబ్బులు అడగడం, వ్యక్తిగత ఫొటోలు పంపమనటం, హోటళ్లకు రావాలని కోరితే సందేహించాల్సిందే. ట్విట్టర్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్నంగా పరిశీలించాలి.

అమెరికా వెళ్దామని..

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని రామిరెడ్డిపేటకు చెందిన రజని (పేరు మార్చాం) భర్తతో మనఃస్పర్థల కారణంగా విడాకులు తీసుకుంది. ఓ మ్యాట్రిమోని వెబ్‌సైట్ ద్వారా కొచ్చర్ల శ్రీకాంత్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుని అమెరికా వెళ్దామని చెప్పడంతో నమ్మింది. వీసా కావాలంటే బ్యాంకు ఖాతాలో పెద్ద మొత్తంలో డబ్బులు ఉండాలంటూ విడతల వారీగా రూ.48 లక్షలు కాజేసి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు కాకినాడకు చెందిన వంశీకృష్ణగా గుర్తించారు. బీఫార్మసీ చదివి వ్యసనాలకు బానిసై మోసాల బాట పట్టాడు. అతడిపై హైదరాబాద్, రామగుండం, రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో 2009 నుంచి 16కిపైగా చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుని అమెరికా పేరుతో రూ.17.5 లక్షలు స్వాహా చేశాడు. ఈ ఏడాది జనవరి 30న పోలీసులు అరెస్టు చేయగా బెయిల్‌పై విడుదలై తిరిగి అదే పంథాలో నరసరావుపేట మహిళను మోసగించి పరారయ్యాడు.

సంపన్న మహిళలపై వల

మ్యాట్రిమోనియల్ సైట్ల ద్వారా 40 మంది మహిళలను మోసగించిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పేరుతో తన వద్ద రూ.2.25 లక్షలు కాజేసినట్లు యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విశాల్ సురేశ్ చవాన్ అలియాస్ అనురాగ్ చవాన్(34) మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్స్‌లో నకిలీ ఖాతాలు సృష్టించి సంపన్న మహిళలపై వల విసిరాడు. ఖరీదైన ఐఫోన్లను బహుమతిగా పంపి ఆకట్టుకునేవాడు. పెట్టుబడుల పేరుతో డబ్బులు కాజేయడంతో పాటు, కొందర్ని హోటళ్లకు రప్పించుకుని లైంగిక దాడికి పాల్పడ్డాడు.

మత్తుమందు ఇచ్చి..

పెళ్లిళ్ల వెబ్‌సైట్ల ద్వారా 12 మంది మహిళలను ఆకర్షించి లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఓ మెకానికల్ ఇంజనీర్‌ను ముంబై పోలీసులు 2021 జూన్ 8న అరెస్టు చేశారు. మహేశ్ అలియాస్ కరణ్ గుప్తా మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్లలో నకిలీ ప్రొఫైల్స్‌తో రిజిస్టర్ చేసుకున్నాడు. మహిళలతో ఫోన్‌లో మాట్లాడి పబ్‌లు, రెస్టారెంట్లకు ఆహ్వానించేవాడు. మత్తుమందు కలిపిన డ్రింక్ తాగించి లైంగిక వేధింపులకు పాల్పడేవాడని వెల్లడైంది. హ్యాకర్‌గా పనిచేసిన అనుభవంతో తెలివిగా నేరాలకు పాల్పడేవాడు.

గిఫ్ట్‌లు పంపి..

విశాఖకు చెందిన మీనాక్షి (పేరు మార్చాం) భర్త చనిపోవడంతో మాట్రిమోనీ డాట్‌కామ్ ద్వారా అమెరికాలోని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో పరిచయం పెంచుకుంది. అమెరికా నుంచి పలుసార్లు గిఫ్ట్‌లు కూడా ఆమెకు అందాయి. కొన్నాళ్ల తర్వాత అత్యవసరమని చెప్పడంతో బాధితురాలు రూ.50 లక్షలు అతడికి ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆ తర్వాత నుంచి నిందితుడి ఫోన్ పనిచేయలేదు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.